


సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



శుక్రవారం బెంగళూరు ఎయిర్‌పోర్టులో విమానాల రద్దుతో ప్రయాణికుల పడిగాపులు

బగ్ దెబ్బకు విండోస్ క్లోజ్..!

ప్రపంచవ్యాప్తంగా స్తంభించిన మైక్రోసాఫ్ట్ సేవలు

విమానయాన, బ్యాంకింగ్, మీడియా సంస్థల సేవల్లో తీవ్ర అంతరాయం

- ఇబ్బందులు పడ్డ కోట్లాది మంది యూజర్లు, ప్రయాణికులు
- 'క్రౌడ్‌స్ట్రయిక్' అప్‌డేట్ వల్లే సమస్య ఉత్పన్నమైందన్న మైక్రోసాఫ్ట్
- ఇది భద్రతాలోపం, సైబర్ దాడి కాదని స్పష్టీకరణ
- సమస్యను దాదాపు పరిష్కరించామని ప్రకటన
- భారత్‌లో ప్రభావం కొంతే.. విమాన సర్వీసులకు తప్పని ఇక్కట్లు
- పలు విమాన సర్వీసులు రద్దు.. మరికొన్ని ఆలస్యం
- శంషాబాద్ విమానాశ్రయంలో రద్దయిన 29 విమానాలు
- యథాతథంగా దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజీలు, బ్యాంకింగ్ కార్యకలాపాలు
- నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ నెట్‌వర్క్‌లో సమస్యలేవీ ఉత్పన్నం కాలేదన్న కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

6లో

దేవుడు నా వైపే.. గెలుపు నాదే

- హత్యాయత్నం నుంచి తప్పించుకున్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్ అధ్యక్ష ఎన్నికల్లో గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు.



6లో

పూజా ఖేడ్కర్‌పై డిబార్ వేటు!

- ఎందుకు డిబార్ చేయకూడదో చెప్పాలంటూ ప్రొబేషనరీ ఐఏఎస్ పూజా ఖేడ్కర్‌కు యూపీఎస్సీ షోకాజ్ నోటీసు ఇచ్చింది.



6లో

బిల్కిస్ బానో దోషులకు సుప్రీంలో చుక్కెదురు

- బిల్కిస్ బానో రేప్ కేసులో ఇద్దరు దోషులు వేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది.



6లో

కీలక రైల్వే ప్రాజెక్టులు కొలిక్కి..

భారీగా నిధులు కేటాయిస్తున్న కేంద్రం.. ఫలితంగా పనుల్లో వేగం

మనోహరాబాద్-కొత్తపల్లితోపాటు, కాజీపేట-బల్లార్షా, కాజీపేట-విజయవాడ మూడో లైన్ పనుల్లో స్పీడ్

సాక్షి, హైదరాబాద్: వరసగా రెండేళ్లలో కేంద్రప్రభుత్వం కీలక రైల్వే ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయిస్తుండటంతో వాటి పనులు ఒక్కసారిగా వేగాన్ని పుంజుకున్నాయి. ఇదే ఊపు కొనసాగిస్తూ కొత్త బడ్జెట్ కాలపరిధిలో వాటిని పూర్తి చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. గత సంవత్సరం బడ్జెట్ కాలపరిధిలో రాష్ట్రంలో మెదక్-అక్కన్నపేట, మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనులను రైల్వే శాఖ పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చింది. కొన్నేళ్లుగా కాగితాలకే పరిమితమైన గుంటూరు-బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టును ఈ సంవత్సరం ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌తో పట్టాలెక్కించింది. ఈనెల 23న ప్రవేశపెట్టబోయే ఈ ఆర్థిక సంవత్సరపు పూర్తి కాల బడ్జెట్‌లో ఆ నిధులను కొంత సవరించే అవకాశం ఉంది. ఆ నిధులతో అవి ఈ ఆర్థిక సంవత్సరంలో తుదిదశకు చేరే అవకాశం ఉంది.

కాజీపేట-బల్లార్షా మూడో లైన్ పనుల్లో వేగం

ఉత్తర-దక్షిణ భారత్‌లను రైల్వే పరంగా జోడించే ప్రధాన లైన్‌లో ఇది కీలకం. నిత్యం 275 వరకు ప్రయాణికుల రైళ్లు, 180 వరకు సరుకు రవాణా రైళ్లు పరుగుపెట్టే ఈ మార్గంలో మూడో లైన్ అత్యవసరం. అది అందుబాటులోకి వస్తే కనీసం మరో 150 రైళ్లను కొత్తగా నడిపే వీలు చిక్కుతుంది. ఈ మార్గంలో తెలంగాణకు సంబంధించి దీన్ని రెండు ప్రాజెక్టులుగా చేపట్టారు. ఇందులో మహారాష్ట్ర-తెలంగాణల్లో కొనసాగే ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టు 2015-16లో మంజూరైంది. దీని నిడివి 202 కి.మీ.. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2,063 కోట్లు. గత రెండేళ్లుగా పనుల్లో వేగం కారణంగా చాలా సెక్షన్‌లలో పనులు పూర్తయ్యాయి. ఇప్పటివరకు 151కి.మీ. పనులు పూర్తయ్యాయి. గతేడాది బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు రూ.450 కోట్లు కేటాయించగా, గత మధ్యంతర బడ్జెట్‌లో రూ.300 కోట్లు ప్రతిపాదించారు. ఈసారి ఆ మొత్తాన్ని కొంత సవరించే అవకాశం ఉంది.

కాజీపేట-విజయవాడ మూడో లైన్ పనులకూ మోక్షం

దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైన ఆ ప్రాజెక్టు ఎట్టకేలకు 2012-13లో మంజూరైంది. కానీ, పనుల నిర్వహణ మాత్రం మందకొడిగా సాగుతూ అది ఇప్పటికీ పూర్తి కాలేదు. కానీ, గత రెండేళ్ల కాలంలో ఈ ప్రాజెక్టుకు ఏకంగారూ.647 కోట్లను కేటాయించటంతో ఎట్టకేలకు ప్రాజెక్టు ఓ రూపునకు వచ్చింది. పూర్తి నిడివి 219 కి.మీ. ఇప్పటివరకు 100కి.మీ. పనులు పూర్తయ్యాయి. దీని అంచనా వ్యయం రూ.1,952 కోట్లు.



'మనోహరాబాద్-కొత్తపల్లి'.. వచ్చే ఏడాదికి కొలిక్కి

సిద్దిపేట మీదుగా హైదరాబాద్-కరీంనగర్‌ను రైల్వే ద్వారా అనుసంధానించే కీలక ప్రాజెక్టు ఇది. 2006-07లో మంజూరైనా ఐదేళ్ల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. దీని నిడివి 151 కి.మీ. కాగా ఇప్పటి వరకు 76 కి.మీ. పనులు పూర్తయ్యాయి. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 1375 కోట్లు. గతేడాది బడ్జెట్‌లో దీనికి రూ.185 కోట్లు కేటాయించగా, గత మధ్యంతర బడ్జెట్‌లో రూ.350 కోట్లు ప్రతిపాదించారు. నిధులకు కొరత లేనందున వచ్చే ఏడాది కాలంలో పనులు దాదాపు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

'బీబీనగర్- గుంటూరు' పనులు ఇక స్పీడే

సికింద్రాబాద్-విజయవాడ మార్గానికి ప్రత్యామ్నాయ లైన్‌గా నడికుడి మీదుగా బీబీనగర్- గుంటూరు మార్గాన్ని అభివృద్ధి చేయాలని 2019లో నిర్ణయించారు. రూ.2,853 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టుకు గత మధ్యంతర బడ్జెట్‌లో రూ.200 కోట్లు ప్రతిపాదించారు. కుక్కడం-నడికుడి సెక్షన్ల మధ్య భూసేకరణ పనులు మొదలయ్యాయి.

వాగు దాటుకుంటూ వెళ్తున్న వైద్యాధికారి, సిబ్బంది



వాగులు దాటి వైద్యసేవలు..

వెంకటాపురం(కె): ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు దాటి ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం సీతారాంపురంలో వైద్య సిబ్బంది శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ గ్రామానికి వెళ్లాలంటే వాగులు దాటాలి. వర్షాలు పడుతుండడంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అయినా వైద్యాధికారి భవ్యశ్రీ, సిబ్బంది వాగులో నడుములోతు నీటిలో నడుచుకుంటూ గ్రామానికి వెళ్లారు. 67 మందికి పరీక్షలు జరిపి మందులు అందజేశారు. కలిపాక గ్రామంలోని ఇద్దరు గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

నేడు మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ హ్యాకథాన్

క్రిటికల్ మినరల్ రోడ్ షో కూడా.. హైదరాబాద్‌లో ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ హ్యాకథాన్, క్రిటికల్ మినరల్ రోడ్‌షోలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఖనిజ వనరులను సద్వినియోగం చేసుకునేందుకు సృజనాత్మక విధానంలో ముందుకెళ్లడం, అంతర్జాతీయంగా అమలవుతున్న ఉత్తమ పద్ధతులను అలవర్చుకోవడంతో మైనింగ్ రంగంలో అభివృద్ధి సాధించే లక్ష్యంగా బేగంపేటలో హ్యాకథాన్, రోడ్‌షో జరగనున్నాయి. ఇన్నోవేటివ్ మినరల్ హంట్ టెక్నిక్స్‌ను తెలుసుకోవడం, ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ పోర్టల్‌ను కూడా ప్రారంభిస్తారు. దేశవ్యాప్తంగా నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్‌కు సంబంధించిన సంపూర్ణ సమాచారం ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 29న జరిగిన క్రిటికల్ మినరల్స్‌కు సంబంధించిన రెండు, మూడవ విడత ఈ-ఆక్షన్ ప్రిఫర్డ్ బిడ్డర్స్ పేర్లను వెల్లడిస్తారు. కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్ చంద్ర దూబే, తెలంగాణ రాష్ట్ర ఉన్నతాధికారులు, కేంద్ర ప్రభుత్వ గనుల శాఖ ఉన్నతాధికారులు, మైనింగ్ రంగానికి సంబంధించిన ఔత్సాహికులు, పారిశ్రామికవేత్తలు పాల్గొననున్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుతో ఆర్థికవేత్త కార్తీక్ భేటీ



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ సుబ్రమణ్యం శుక్రవారం ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో సచివాలయంలో భేటీ అయ్యారు. ఆయన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో ఆర్థిక శాస్త్రం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక రంగంలో వేగవంతమైన పురోగతికి భారతదేశం, రాష్ట్రాలు చేపట్టాల్సిన సంస్కరణలపై 'యాక్సెలరేటింగ్ ఇండియాస్ డెవలప్‌మెంట్' పేరుతో రాసిన గ్రంథాన్ని మంత్రి శ్రీధర్‌బాబుకు అందజేశారు.



సైబర్ కేటుగాళ్ల కొత్త ఎత్తుగడ..
వాట్సాప్ కాల్స్‌తో బెదిరింపులు
+92 నంబర్‌తో కాల్ వస్తే అది మోసమని గుర్తించాలి
అనుమానం వస్తే ఫిర్యాదు చేయాలంటున్న అధికారులు

వాట్సాప్ డీపీ.. +92 నంబర్‌తో కాలింగ్

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త మోసాలకు దారులు వెతుకుతున్నారు. వాట్సాప్ డీపీగా పోలీస్ ఉన్నతాధికారుల ఫొటోలను పెట్టుకుని, ఆ నంబర్ల నుంచి పలువురికి వాట్సాప్ వాయిస్ కాల్స్ చేస్తున్నారు. తాజాగా ఇలాంటి బెదిరింపుల వీడియో ఒకటి డీజీపీ జితేందర్ తన అధికారిక 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అనుమానాస్పద కాల్స్ వస్తే నమ్మి మోసపోకుండా.. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

తెలంగాణ సీఎస్, డీజీపీ పేరిట గతంలోనూ వాట్సాప్ డీపీలతో డబ్బులు డిమాండ్

- ఈ ఏడాది ఏప్రిల్ 30న తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఫొటోను వాట్సాప్‌డీపీగా పెట్టిన సైబర్ నేరగాళ్లు..సీఎస్ పేరిట నలుగురు వ్యక్తులకు మెసేజ్‌లు పెట్టారు. అందులో రంజాన్ గిఫ్ట్ కూపన్లు పంపాలని కోరడంతో అనుమానాస్పదంగా భావించిన సదరు వ్యక్తులు సీఎస్ దృష్టికి తెచ్చారు. దీనిపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కేసు నమోదు చేశారు.
- హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా డీజీపీగా పనిచేసిన సమయంలో ఆయన ఫొటోను డీపీగా పెట్టిన నంబర్‌తో ఈ ఏడాది మే 21న ఓ వ్యాపారికి వాట్సాప్ కాల్ వెళ్లింది. 'మీ అమ్మాయిని నార్కోటిక్స్ డ్రగ్స్ కేసులో అరెస్టు చేశారు. ఆమెను విడుదల చేయాలంటే రూ.50 వేలు మొబైల్ పేమెంట్ ద్వారా పంపండి అని సైబర్ నేరగాళ్లు డిమాండ్ చేశారు. దీనిపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కేసు నమోదు చేశారు.
- ఈ ఏడాది మే 23న వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టి కొందరు సైబర్‌నేరగాళ్లు ఆమె పేరిట డబ్బులు పంపాలంటూ కలెక్టరేట్ సిబ్బందితో పాటు కొందరు ప్రజలకు వాట్సాప్ మెసేజ్‌లు పంపారు. విషయం తన దృష్టికి రావడంతో కలెక్టర్ వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు.. ప్రజలు, అధికారులు ఎవరూ అలాంటి మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు.

+92 నంబర్‌తో వస్తే అది మోసం..

మీ వాట్సాప్‌కు పోలీసుల పేరిట బెదిరింపు కాల్స్ వస్తే అందులో ఉన్న నంబర్ ఏ సంఖ్యతో మొదలైందో గమనించాలి. ఒకవేళ అది +92 నంబర్‌తో వస్తే.. పక్కాగా అది సైబర్ నేరగాళ్ల పనే అని గుర్తించాలి. వాస్తవానికి +92 కోడ్ పాకిస్తాన్‌ది. చాలావరకు ఈ నంబర్‌తో కాల్స్ పాకిస్తాన్ నుంచే వస్తాయని, కొన్నిసార్లు కంప్యూటర్ ప్రోగ్రామ్‌లతోనూ ఇలాంటికాల్స్ జనరేట్ చేయవచ్చని సైబర్ భద్రత నిపుణులు చెబుతున్నారు.

అనుమానం వస్తే సంచార్ సాథీ పోర్టల్ దృష్టికి తేవాలి..

మీకు తెలియని నంబర్ నుంచి +92తో ప్రారంభమయ్యే కాల్ వచ్చి.. అందులో అవతలి వ్యక్తి మీ వ్యక్తిగత వివరాలు.. మీ ఆధార్ నంబర్, బ్యాంక్ లాగిన్ వివరాలు లేదా ఓటీపీలు.. ఏవైనా అడిగితే చెప్పవద్దు. అలాంటి అనుమానాస్పద నంబర్ల నుంచి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే సంచార్ సాథీ పోర్టల్ (www. sanchar saathi.gov.in)'చక్షు-రిపోర్ట్ సస్పెక్టెడ్ ఫ్రాడ్ కమ్యూనికేషన్స్'లో మోసపూరిత సమాచారాన్ని తెలియజేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ ప్రజలకు సూచించింది.

ఫేక్ వాట్సాప్‌కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి..

పోలీస్ అధికారుల ఫొటోలను డీపీగా పెట్టుకున్న అపరిచితులు ఫోన్ చేసి మీకు సంబంధించిన వాళ్లు పోలీసులకు పట్టుబడ్డారని, లేదా వాళ్ల పేరు మీద ఇల్లీగల్ డ్రగ్స్ కొరియర్లు వచ్చాయని, వాళ్లు ఇంకేదో పెద్ద తప్పు చేశారని మిమ్మల్ని టెన్షన్లో పెట్టి బురిడీ కొట్టిస్తారు. అలాంటి ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– జితేందర్, డీజీపీ, తెలంగాణ



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 119

శనివారం 20-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మన మహిళలదే పైచేయి
ఆసియా కప్ టోర్నీ తొలి మ్యాచ్‌లో పాక్‌పై 7 వికెట్లతో నెగ్గిన భారత్.
- 15లో



చల్లనిరాజా ఓ చందమామా!
రేరాజు చుట్టూ ఎన్నో కథలు, కల్పనలు.. నేడు ఇంటర్నేషనల్ మూన్ డే
- 13లో

రైతు రుణమాఫీపై రగడ!

తమకు మాఫీ జరగలేదంటూ ఫిర్యాదుల వెల్లువ

గ్రామాలు, మండలాలు, జిల్లా స్థాయిలో ఫిర్యాదులు

- ఏఈవో, ఏవో, ఏడీఏ, డీఏవో లాంటి వారికి వినతులు
- అనేకచోట్ల వ్యవసాయాధికారులను నిలదీస్తున్న రైతులు
- మరోవైపు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- తమకు రూ. లక్షలోపే రుణం ఉన్నా ఎందుకు మాఫీ కాలేదంటూ ఆరా.. సమాధానం చెప్పలేని స్థితిలో అధికారులు.. కారణాలు తెలియవని స్పష్టీకరణ
- రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మందికి జరగని రుణమాఫీ
- రేషన్‌కార్డు, పీఎం కిసాన్ నిబంధనలే కారణమనే అనుమానం



సాక్షి, హైదరాబాద్: రుణమాఫీపై గందరగోళం కొనసాగుతూనే ఉంది. తమకు రుణమాఫీ జరగలేదంటూ రైతుల నుంచి వ్యవసాయ శాఖకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాలు, మండలాలు, జిల్లాల్లో ఏఈవో, ఏవో, ఏడీఏ, డీఏవో స్థాయి అధికారులకు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. కొందరు వ్యవసాయ శాఖ అధికారులకు ఫోన్లు చేసి ఆరా తీస్తున్నారు. అలాగే కొన్నిచోట్ల ఎమ్మార్వో కార్యాలయాలకు కూడా ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారమే రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం వేలాది ఫిర్యాదులు అందాయి. మరోవైపు అనేకచోట్ల రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. తమకు లక్ష రూపాయల లోపే రుణం ఉన్నా ఎందుకు మాఫీ జరగలేదంటూ నిలదీస్తున్నారు. అయితే ఇటు వ్యవసాయ శాఖ అధికారుల నుంచి గానీ, బ్యాంకర్ల నుంచి గానీ సరైన సమాధానం రావడంలేదని రైతులు చెబుతున్నారు. ఎందుకు రాలేదో తమకు తెలియడంటున్నారని వాపోతున్నారు. ఏ నిబంధనల వల్ల లక్షలాది మంది రైతులకు రుణమాఫీ జరగలేదో తమకూ అంతుబట్టడం లేదని అధికారులంటున్నట్లు తెలిసింది. అయితే పీఎం కిసాన్ నిబంధనలు, రేషన్‌కార్డు లేకపోవడం వంటివే అనేకమంది రైతులను రుణమాఫీకి అనర్హులుగా చేశాయని వ్యవసాయ శాఖ అధికారులు కొందరు పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే ప్రచారం జరుగుతుండగా, దీనిపై స్పష్టత లేకపోవడం, మరోవైపు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులందుతుండటంతో.. ఏం చేయాలో పాలుపోని స్థితిలో అధికారులున్నారు. గురువారం లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం.. దాదాపు 11.50 లక్షల మంది రైతులకు సంబంధించి సుమారు

మిగతా 2వ పేజీలో ▶

అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి

ఉమ్మడి మెదక్ డీసీసీబీ పరిధిలో సుమారు 42 వేల మంది రైతులు లక్ష లోపు రుణమాఫీ అర్హులు. వీరికి రూ.162 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. కానీ కేవలం 19,542 మంది రైతులకు రూ.75 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. అంటే కేవలం 45 శాతం మంది రైతులకు మాత్రమే మాఫీ అయింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ పరిధిలో రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులు 51,417 మంది ఉండగా.. వీరికి రూ.236.54 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. కానీ 20,130 మంది రైతులకు రూ.92.02 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. దీంతో మాఫీకాని వారు వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. అలాగే ఉమ్మడి నల్లగొండ డీసీసీబీ పరిధిలో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న వారు 72,513 మంది ఉండగా, 33,913 మందికి సంబంధించిన రూ.143.10 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. మిగతా వారికి మాఫీ జరగలేదు. ఇక వరంగల్ డీసీసీబీ పరిధిలో లక్ష లోపు రుణం తీసుకున్న రైతులు 57,129 మంది కాగా 23,841 మంది రైతుల ఖాతాల్లోనే మాఫీ సొమ్ము జమైంది. దీంతో మిగిలిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

75,200 ఇంజనీరింగ్ సీట్ల భర్తీ

- మొదలైన తొలి దశ సీట్ల కేటాయింపు
- కంప్యూటర్ కోర్సుల్లోనే 53 వేల సీట్లు
- సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్స్‌లో తక్కువే
- కౌన్సెలింగ్‌కు దూరంగా టాపర్స్
- వివరాలు వెల్లడించిన సాంకేతిక విద్యా శాఖ

16లో

త్వరలో విద్యాకమిషన్



విద్యావేత్తలతో సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తాం
- అంగన్‌వాడీలను ప్రీ స్కూల్స్‌గా మారుస్తాం
- 4వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తాం
- విద్యావ్యవస్థలో మార్పులపై విధానపత్రం రూపొందిస్తే.. దానిపై నిర్ణయం తీసుకుంటాం

3లో

ఏపీలో అరాచక పాలన.. రాష్ట్రపతి పాలన విధించాలి



వినుకొండలో రషీద్ కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోంమంత్రికి ఆధారాలతో నివేదిస్తాం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో 24న ఢిల్లీలో ధర్నా

- ఏపీలో పరిస్థితిని యావత్ దేశానికి తెలిసేలా చేస్తాం
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ వెల్లడి
- అసెంబ్లీ వేదికగా గవర్నర్ ప్రసంగం సమయంలో నిలదీస్తాం.. నెలన్నరలో 36 రాజకీయ హత్యలు.. 300కుపైగా హత్యాయత్నాలు
- టీడీపీ నేతల వేధింపులతో 35 మంది ఆత్మహత్య.. 560 ప్రైవేటు, 490 ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం.. ఇళ్లలోకి చొరబడి దాడులు..
- వినుకొండలో సామాన్యుడైన రషీద్ దారుణ హత్య.. ప్రేక్షక పాత్ర వహిస్తున్న పోలీసులు.. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5వి దిగజారుడు రాతలు

12లో

రాష్ట్రంలో రెండ్రోజులు వర్షాలే.. వర్షాలు

- పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం
- ఐదు జిల్లాలకు రెడ్‌అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ



మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కూడా కురవొచ్చని హెచ్చరిక

వివరాలు 5లో

థర్డ్ పార్టీకి భూముల విలువల సవరణ!

- పంజాబ్ తరహాలో ప్రైవేట్ సంస్థతో మదింపునకు యోచన
- ఆ తర్వాతే విలువలు సవరించాలనుకుంటున్న సర్కారు



- రెవెన్యూ మంత్రి పొంగులేటి ప్రత్యేక కసరత్తు
- ఇప్పటికే ప్రతిపాదనలను సిద్ధం చేసిన రిజిస్ట్రేషన్ల శాఖ

వివరాలు 12లో



గ్రూప్‌-2 పరీక్షలు వాయిదా

నిరుద్యోగుల అభ్యర్థనకు సర్కారు అంగీకారం

పోస్టుల సంఖ్య పెంచేందుకు, కొత్త నోటిఫికేషన్ జారీకి ఆమోదం

- ఓవర్ లాపింగ్ లేకుండా నిర్వహిస్తామన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్‌తో కలిసి నిరుద్యోగులతో భేటీ



డిప్యూటీ సీఎం భట్టికి వినతిపత్రం అందిస్తున్న నిరుద్యోగులు. చిత్రంలో ఎంపీలు మల్లురవి, బలరాం నాయక్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంది. గ్రూప్‌–2 పరీక్షలను వాయిదా వేయడానికి అంగీకరించింది. దీంతో పాటు పోస్టుల సంఖ్యను పెంచేందుకు, కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయడానికి కూడా ఆమోదం తెలిపింది. శుక్రవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్‌లు నిరుద్యోగులతో సమావేశమయ్యారు. ఆయా అంశాలపై చర్చించిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు గ్రూప్‌–2 పరీక్షల వాయిదాపై తుది నిర్ణయం

మిగతా 16వ పేజీలో ▶

డిసెంబర్‌లో గ్రూప్‌-2 పరీక్షలు

- త్వరలో తేదీల వెల్లడి
- టీజీపీఎస్సీ ప్రకటన

16లో

క్లుప్తంగా...

హామీలను నెరవేర్చేది కాంగ్రెస్ పార్టీనే

- రుణమాఫీ చేసిన సీఎం రేవంత్ రైతు బాంధవుడు
- కాంగ్రెస్ ఎంపీలు మల్లురవి, బలరాం నాయక్, రఘురామిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు బాంధవుడని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేది కాంగ్రెస్ పార్టీయేనని ఆ పార్టీ ఎంపీలు వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో శుక్రవారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయదని గోబెల్స్ ప్రచారం చేయడంతోనే తాము కొన్ని సీట్లు కోల్పోయామన్నారు. రైతు రుణమాఫీ చేసినందుకుగాను పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ధన్యవాద కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో రైతుభరోసా కూడా అమలు చేస్తామని అందుకోసమే భట్టి నేతృత్వంలోని ఉపకమిటీ ఏర్పాటు చేశామని వివరించారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణను మోడల్‌గా తీసుకుని దేశం మొత్తం అమలు చేయాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్‌గాంధీలకు చెబుతామని తెలిపారు.

నిరూపించకపోతే రాజీనామా చేస్తారా?

రైతు రుణమాఫీపై బండి సంజయ్‌కు పొన్నం సవాల్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 70 శాతం మంది రైతులకు రుణమాఫీ వర్తించడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. సంజయ్ తన ఆరోపణలను నిరూపించకపోతే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేస్తారా? అని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన సవాల్ చేశారు. 'తెలంగాణ రైతాంగానికి రుణమాఫీ చేస్తుంటే భరించలేక పోతున్నారా? నల్లచట్టాలను తెచ్చి రైతులను అణచివేయాలని ప్రయత్నించింది మీరు కాదా? పెద్ద ఎత్తున రైతు రుణమాఫీ జరుగుతుంటే ప్రశంసించాల్సింది పోయి విమర్శిస్తారా? అసలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎప్పుడైనా రైతు రుణమాఫీ చేశారా? రైతుల కోసం జరుగుతున్న మంచిని ప్రశంసించే ప్రయత్నం మీరు కూడా చేయండి. కానీ విమర్శించవద్దు' అని బండి సంజయ్‌కు పొన్నం ప్రభాకర్ హితవు పలికారు.

ఏ1, ఏ6 లను తీసుకురావాల్సిందే

- ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో పోలీసులను ఆదేశించిన నాంపల్లి కోర్టు
- 26కు విచారణ వాయిదా

సిటీ, కోర్టులు: ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1, ఏ6 నిందితులుగా ఉన్న ప్రభాకర్‌రావు, శ్రవణ్ కుమార్‌లను ఎక్కడున్నా వచ్చే వాయిదాలోపు కోర్టుకు తీసుకురావాలని నాంపల్లి కోర్టు శుక్రవారం మరోసారి పోలీసులను ఆదేశించింది. కాగా వీరిపై ఎన్‌బీడబ్ల్యూ పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా దాఖలు చేసిన చార్జిషీట్ నంబర్ అయిన తర్వాత తొలిసారిగా శుక్రవారం విచారణకు వచ్చింది. దీంతో ఇప్పటికే జ్యుడీషియల్ రిమాండ్‌లో భాగంగా చంచల్‌గూడ జైల్‌లో ఉన్న ఏ-2 నుంచి ఏ-5 ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును పోలీసులు శుక్రవారం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి పలు కాగితాలను(డాక్యుమెంట్లు) న్యాయస్థానం నిందితుల సమక్షంలో వారి తరపు న్యాయవాదులకు అందజేసింది. ఇదిలా ఉండగా ఏ2 నుంచి ఏ5 నిందితుల జ్యుడీషియల్ రిమాండ్‌ను ఈ నెల 26 వరకు పొడిగిస్తూ ఆ రోజుకి తదుపరి విచారణను కోర్టు వాయిదా వేసింది.

ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ దుర్మార్గం

బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రదర్శన

ఖైరతాబాద్ (హైదరాబాద్): ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ ఆలోచన దుర్మార్గమని, పార్లమెంట్‌లో ప్రైవేటీకరణ బిల్లు పెడితే దేశవ్యాప్తంగా ఉద్యమం తప్పదని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు అన్నారు. దేశ ఆర్థికాభివృద్ధి, ప్రజాప్రయోజనాల కోసం బ్యాంకులను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. బ్యాంకుల జాతీయీకరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో సచివాలయ యూనియన్ బ్యాంక్ శాఖ నుంచి నెక్లెస్ రోడ్డు ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. వివిధ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకులను జాతీయం చేసిన ఇందిరాగాం. దీకి అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఇఏ), ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

జేబులు నింపుకొనేందుకే ప్రాజెక్టులు కట్టారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మంత్రులు ఉత్తమ్, పొంగులేటి ఆరోపణ

- రూ.94 వేల కోట్లు ఖర్చు చేసి కనీసం లక్ష ఎకరాలకు కూడా నీరివ్వలేదు
- కాళేశ్వరం ప్రాజెక్టుపై నేడు ఎన్‌డీఎస్‌ఏతో భేటీ: ఉత్తమ్
- గొప్పలకు పోకుండా వాస్తవాలు ప్రతిబింబించేలా బడ్జెట్: పొంగులేటి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: గత ప్రభుత్వ పెద్దలు కేవలం జేబులు నింపుకొనేందుకే ప్రాజెక్టులు కట్టారని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వ పెద్దలు ప్రాజెక్టులకు రూ.94 వేల కోట్లు ఖర్చు చేసి కనీసం లక్ష ఎకరాలకు కూడా నీరివ్వలేదని, స్థిరీకరణ కూడా సరిగా లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక బ్లండర్ అని, దీనిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచనల ఆధారంగా ముందుకు వెళ్తామని చెప్పారు. రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కోసం ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రులు..స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

కాళేశ్వరం స్ట్రక్చరల్ బ్లండర్: ఉత్తమ్

'కాళేశ్వరంతో ఐదేళ్ల కాలంలో మొత్తం ఎత్తిపోసింది కేవలం 65 టీఎంసీలే. పైగా ఏటా రూ.10 వేల కోట్ల కరెంటు బిల్లులు వస్తున్నాయి. అదే తమ్మిడిహెట్టి వద్ద కట్టి ఉంటే రూ.34 వేల కోట్లలో ప్రాజెక్టు పూర్తయ్యి ఏటా రూ.వెయ్యి కోట్ల బిల్లు మాత్రమే వచ్చేది. పాలమూరు–రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల్లోనూ అవినీతే. ఇటీవల జస్టిస్ ఘోష్ కమిషన్ ముందు హాజరైన కేంద్ర జలవనరుల శాఖ సలహాదారు కాళేశ్వరంపై అఫిడవిట్ సమర్పించారు. ప్రాజెక్టు డిజైన్, నిర్మాణంలో లోపాలున్నాయని ఎన్‌డీఎస్‌ఏ తన మధ్యంతర నివేదికలో తెలిపింది. కాళేశ్వరం స్ట్రక్చరల్ బ్లండర్. ఇదే విషయంపై శనివారం ఢిల్లీలో ఎన్‌డీఎస్‌ఏ అధికారులతో నేను, నీటి పారుదల ముఖ్య కార్యదర్శి భేటీ అవుతాం. వారిచ్చే సలహాల ఆధారంగానే కాళేశ్వరంపై ముందుకెళ్తాం..'అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈ నెలాఖరుకు ఆదిలాబాద్‌లో సదర్మాట్ ప్రాజెక్టు ప్రారంభిస్తామని, గౌరవెల్లి ప్రాజెక్టును ప్రాధాన్యత క్రమంలో చేపడతామని తెలిపారు.

ఆరోగ్యశ్రీ, రేషన్‌కు ప్రత్యేక కార్డులు

'ఆరోగ్యశ్రీ, రేషన్‌కు ప్రత్యేక కార్డులిస్తాం, దరఖాస్తులు కూడా వేర్వేరుగా ఉంటాయి. కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణకు సముచిత స్థానం ఇస్తుందని ఆశిస్తున్నాం. బీఆర్ఎస్ త్వరలో నామమాత్రంగా ఉండిపోతుంది. మరింతమంది ఎమ్మెల్యేలు మా పార్టీలో చేరతారు..'అని ఉత్తమ్ చెప్పారు.

అప్పుల భారం ఉన్నా రుణమాఫీ: పొంగులేటి

గత ప్రభుత్వం మాదిరి గొప్పలకు పోయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టమని, వాస్తవాలను ప్రతిబింబించేలా మాత్రమే ఉంటుందని మంత్రి పొంగులేటి అన్నారు. 'గత ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పుల భారం మాపై మోపింది. అయినా మేం రైతు రుణమాఫీ కింద రూ.31 వేల కోట్ల రుణాలు రద్దు చేస్తున్నాం. మాది రైతు పక్షపాత, పేదల ప్రభుత్వం. గత ప్రభుత్వం రైతుబంధు పేరిట గుట్టలకు కొండలకు నిధులిచ్చి ఆర్థిక విధ్వంసానికి పాల్పడింది. అందుకే, మేం రైతు భరోసా విషయంలో అభిప్రాయాలు అడిగేందుకు వచ్చాం..'అని చెప్పారు.

మధ్యంతర నివేదికను అమలు చేశారా!

- సమగ్ర నివేదికతో సమావేశానికి హాజరుకండి
- కాళేశ్వరం బరాజ్‌లపై భేటీకి రావాలని ఎన్డీఎస్ఏ పిలుపు
- నేటి సమావేశానికి మంత్రి ఎన్.ఉత్తమ్, అధికారులు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లోని లోపాలను గుర్తించేందుకు జియో ఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షలు నిర్వహించాలంటూ మధ్యంతర నివేదికలో తాము చేసిన సిఫారసులను అమలు చేశారా? అని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అదేవిధంగా బరాజ్‌లకు వర్షాకాలంలో మరింత నష్టం జరగకుండా మధ్యంతర నివేదికలో సూచించిన అత్యవసర చర్యలు తీసుకున్నారా? అని నిలదీసింది. నివేదిక అమలుకు తీసుకున్న చర్యలతో శనివారం ఢిల్లీలో జరిగే సమావేశానికి రావాలని రాష్ట్ర నీటిపారుదల శాఖను కోరింది. ఈ సమావేశానికి నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరుకానున్నారు. కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యానికి గల కారణాలపై వానాకాలానికి ముందు జియో ఫిజికల్, జియో టెక్నికల్, స్ట్రక్చరల్ స్టెబిలిటీ పరీక్షలు చేసి నివేదిక ఇవ్వాలని అప్పట్లో ఎన్డీఎస్ఏ కోరింది. ఈ పరీక్షలన్నీ కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్), సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రిసేర్చ్ స్టేషన్(సీఎస్ఎంఆర్ఎస్), జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(ఎన్ జీఆర్)తో చేయించాలని గత మే 1న మధ్యంతర నివేదికను ఇచ్చిన విషయం విదితమే. నివేదిక అమలులో పురోగతిని తెలపాలని కోరుతూ గత మే 18న, జూన్ 25న, మళ్లీ ఈనెల 11న తెలంగాణకు ఎన్డీఎస్ఏ వరుస లేఖలు రాసింది.

నేటి భేటీలో వాటిపైనే చర్చ

అన్నారం, సుందిళ్లలో పరీక్షల కోసం బోర్ హోల్స్ వేస్తుండగా... ఇసుక, నీరు ఇయటికి వస్తున్నాయని, ఈ కారణంగా పరీక్షలు నిలుపుదల చేసి, జియో టెక్నికల్ పరీక్షల కోసం ప్రత్యామ్నాయాలు సూచించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 5వ తేదీన లేఖ రాసింది. అయితే అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లో ఇప్పటిదాకా ఎన్ని బోరోల్స్/డ్రిల్లింగ్స్ చేశారు? బ్యారేజీల ఎగువ, దిగువ భాగంలో ఇప్పటిదాకా ఎన్ని డ్రిల్లింగ్ చేశారు..? వంటి అంశాలపై సమగ్ర వివరాలు అందించాలని ఎన్డీఎస్ఏ కోరింది. కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ(సీడబ్ల్యూపీఆర్ఎస్) ఇచ్చిన నివేదిక ఏమిటి. బ్యారేజీల పై అధ్యయనాలు, పరిశోధనలపై ఫొటోలతో సహా సమగ్ర నివేదికను అందించాలని ఎన్డీఎస్ఏ నిర్దేశించింది. ఈ అంశాల ఆధారంగా శనివారం జరిగే సమావేశంలో చర్చించనున్నారు.

క్షీణించిన కవిత ఆరోగ్యం!

- పది కిలోల బరువు తగ్గడంపై భర్త అనిల్ ఆందోళన
- భర్త సమక్షంలో ఎయిమ్స్‌లో పూర్తయిన వైద్య పరీక్షలు
- సోమవారం కవితను కలవనున్న మాజీ మంత్రి కేటీఆర్



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఆరోపణలను ఎదుర్కొంటూ తిహార్ జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కవిత ఆరోగ్యం క్షీణిస్తున్నట్లుగా తెలుస్తోంది. శుక్రవారం తిహార్ జైలు అధికారులు కవితను ఎయిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ వివిధ వైద్య పరీక్షల అనంతరం తిరిగి జైలుకు తరలించారు. కవిత ఆరోగ్యం క్షీణించడం పట్ల భర్త అనిల్ కంటతడి పెట్టారు. ఎయిమ్స్‌లో ఆమెను చూసి భావోద్వేగానికి గురైనట్లు తెలిసింది. ఆమె తరచూ అనారోగ్యానికి గురవుతున్న సంగతి తెలిసిందే. మెరుగైన వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలకు అనుమతి ఇవ్వాలంటూ కవిత తరపు న్యాయవాది మోహిత్‌రావు న్యాయస్థానాన్ని కోరారు. ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షల అప్లికేషన్‌ను నిరాకరించిన న్యాయస్థానం ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలకు అనుమతి ఇచ్చింది.

పదికిలోల బరువు తగ్గిన కవిత

భర్త అనిల్ సమక్షంలో కవితకు ఎయిమ్స్ వైద్య బృందం పలు వైద్య పరీక్షలు నిర్వహించింది. ఈ వైద్య పరీక్షల సమయంలో కవిత పది కిలోల బరువు తగ్గినట్లు తెలిసింది. కవిత నీరసంగా ఉండటం, ఇంకా జ్వరంతో బాధపడటం, బరువు తగ్గడంపై అనిల్ చలించిపోయారు. డెంగ్యూ, టైఫాయిడ్, మలేరి యా టెస్టులు చేశారు. నాలుగు నెలల వ్యవధిలో దాదాపు పది కిలోల బరువు తగ్గిన విషయాన్ని తండ్రి కేసీఆర్, తల్లి శోభ, సోదరుడు కేటీఆర్, బావ హరీశ్‌రావుకు తెలిసి ఆమె అనారోగ్యం పట్ల తీవ్ర ఆవేదన కనబరుస్తున్నట్లు సమాచారం. జైలులో దోమలు అధికంగా ఉండటం వల్ల కొందరు డెంగ్యూ జ్వర బాధితులు ఉన్నారని కవిత తరపు న్యాయవాదులు చెబుతున్నారు.

సోమవారం ఢిల్లీకి కేటీఆర్, హరీశ్

అనారోగ్యానికి గురైన కవితను రెండు పర్యాయాలు దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ ఆసుపత్రికి, ఒకసారి ఎయిమ్స్‌కు తరలించిన తిహార్ జైలు అధికారులు పరీక్షలు చేయించారు. తిహార్ జైల్లో ఉన్న కవితను కలిసేందుకు సోమవారం కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఢిల్లీకి రానున్నారు.

ఆగస్టులో సీఎం అమెరికా టూర్

- పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా పలు రాష్ట్రాల్లో పర్యటన
- 3న వెళ్లి 11న తిరిగి రానున్న ముఖ్యమంత్రి... ఆ తర్వాత దక్షిణ కొరియాకు వెళ్లే చాన్స్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే నెలలో అమెరికాలో పర్యటించనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఆగస్టు 3వ తేదీ నుంచి సీఎం బృందం అమెరికాలో పర్యటిస్తుందని, అదే నెల 11న రాష్ట్రానికి తిరిగి వస్తుందని సీఎంవో వర్గాలు వెల్లడించాయి. అమెరికాలోని డల్లాస్, శాన్ ఫ్రాన్సిస్కో, న్యూజెర్సీ రాష్ట్రాల్లో పర్యటించనున్న సీఎం బృందం, ఆయా రాష్ట్రాల్లోని ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, పలు కంపెనీల సీఈవోలతో సమావేశం కానుంది. లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఇతర టెక్నాలజీ రంగాల్లోని ప్రముఖులను కలిసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను వివరిస్తారని సమాచారం. అమెరికా నుంచి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ దక్షిణ కొరియాలో పర్యటించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా దక్షిణ కొరియాలో నదీతీరాల అభివృద్ధిని అధ్యయనం చేయాలని సీఎం భావిస్తున్నట్టు సమాచారం.



రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు, సిబ్బందితో డిప్యూటీ సీఎం భట్టి

ఆర్థిక శాఖ సిబ్బందికి డిప్యూటీ సీఎం భట్టి విందు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు, సిబ్బందికి శుక్రవారం డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో విందు ఏర్పాటు చేశారు. బడ్జెట్‌కు ముందు అధికారులు సిబ్బందికి ఆర్థిక శాఖ మంత్రి విందు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆనవాయితీ కొనసాగింపులో భాగంగా శుక్రవారం డిన్నర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి సిబ్బంది ప్రతి ఒక్కరి దగ్గరికి వెళ్లి ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

రైతు రుణమాఫీపై రగడ!

▶ మొదటి పేజీ తరువాయి

రూ.6,098 కోట్లు బ్యాంకుల్లో జమ చేసిన సంగతి తెలిసిందే. కాగా లక్ష రూపాయల లోపే రుణం ఉన్నప్పటికీ మాఫీ జరగని లక్షలాది మంది రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఖమ్మం జిల్లాలో 20% నుంచి 30% లోపుగానే..

ఖమ్మం జిల్లాలో 20 శాతం నుంచి 30 శాతం లోపుగానే లక్షలోపు రుణాలు మాఫీ అయ్యాయి. ఖమ్మం డీసీసీబీలో ఏకంగా లక్ష మందికి పైగా రుణమాఫీ కాకపోవడంపై చర్చ జరుగుతోంది. జిల్లాలో 57,857 మంది రైతులకు రుణమాఫీ జరిగింది. అయితే చాలామందికి రుణమాఫీ కాకపోవడంతో శుక్రవారం రైతులు సహకార సొసైటీలు, బ్యాంకుల వద్దకు వెళ్లి ఆరా తీశారు. తమకు అన్ని అర్హతలున్నా ఎందుకు మాఫీ కాలేదంటూ అధికారులను అడిగారు.

టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు

ఈ నేపథ్యంలో రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి వీలుగా ఖమ్మం కలెక్టరేట్‌లో 1950తో పాటు 90632 11298 టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేశారు. అలాగే జిల్లా స్థాయిలో ఐటీ పోర్టల్, మండల స్థాయిలో సహాయ కేంద్రాల ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చునని అధికారులు తెలిపారు.



ఖమ్మం జిల్లా ముదిగొండ పీఏసీఎస్‌లో రుణమాఫీపై ఆరా తీస్తున్న రైతులు

ఎవరూ పట్టించుకోవడం లేదు

నాకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. 2022 నవంబర్‌లో మహబూబాబాద్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ.70 వేల పంట రుణం తీసుకున్నా. దానిని 2023లో రెన్యువల్ చేయించుకోగా బ్యాంకు అధికారులు తిరిగి రూ.85 వేల రుణం ఇచ్చారు. ఈ రూ.85 వేల రుణం మాఫీ కాలేదు. నాక్కూడా రుణమాఫీ వర్తింపజేయాలని బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. – అజ్మీర వెంకన్న, దామ్యతండా, మహబూబాబాద్ మండలం

నాతోటి వ్యక్తికయ్యింది.. నాకు కాలేదు

నాకు తడ్కల్ ఏపీజీవీబీ బ్యాంకులో రూ.42 వేల పంట రుణం ఉంది. ఏటా లోన్‌ను రెన్యువల్ చేస్తున్నా. ఈసారి నా రుణం మాఫీ అవుతుందని అనుకున్నా. కానీ కాలేదు. నాతో పాటు రుణం తీసుకొన్న వారి పేరు రుణమాఫీ జాబితాలో ఉంది. దీనిపై వ్యవసాయాధికారులను అడిగినా ఏమీ చెప్పడం లేదు. – కొండాపురం పెద్దగోవింద్‌రావు, బాన్సువాడ, కంగ్టి మండలం, సంగారెడ్డి జిల్లా

ఊరించి.. కంటతడి పెట్టించారు!

- రుణమాఫీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- అర్హత ఉన్నా అనేక మంది రైతులకు రుణమాఫీ జరగలేదు
- ఇలాంటి రైతులు ఆందోళనలో ఉంటే సంబురాలెందుకు?



సాక్షి, హైదరాబాద్: రుణమాఫీపై రైతులను ఏడు నెలలుగా ఊరించి, చివరకు కంటతడి పెట్టించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. 'చారాణ కోడికి.. బారాణా మసాలా'అనే సామెతను తలపించేలా రుణమాఫీపై ప్రభుత్వం తీరు ఉందన్నారు. అర్హత ఉన్నా అనేక మంది రైతులకు రుణమాఫీ ఎందుకు జరగలేదో చెప్పే నాథుడు లేడని, రైతుల గోడు వినేవారే లేరని అన్నారు. రుణమాఫీ జరగని అర్హులైన రైతులు ఓ వైపు ఆందోళనలో ఉంటే, సంబురాలు ఎందుకని శుక్రవారం 'ఎక్స్' వేదికగా కేటీఆర్ ప్రశ్నించారు. 40 లక్షల మంది లబ్ధిదారుల్లో 30 లక్షల మంది రైతులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు వ్యవసాయ సీజన్లు కావస్తున్నా రైతు భరోసాను ప్రారంభించలేదన్నారు. రైతు భరోసా, కౌలు రైతులకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు వంటి హామీలను అమలు చేయకుండా మభ్య పెడుతోందన్నారు. ఇంతకాలం ప్రజల దృష్టిని మళ్లించిన రేవంత్ ప్రభుత్వం, ప్రస్తుతం నిధుల దారిమళ్లింపునకు పాల్పడుతోందని కేటీఆర్ మండిపడ్డారు.

పేదరిక నిర్మూలనలో రెండో స్థానం

కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెట్టడంతో పేదరిక నిర్మూలనలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో నిలిచిందని కేటీఆర్ అన్నారు. నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీ) లెక్కలే దీనికి నిదర్శనమన్నారు. పదేళ్ల పాటు తెలంగాణలో పేదరిక నిర్మూలనతో పాటు సుస్థిరమైన అభివృద్ధి కోసం కేసీఆర్ చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. 2020–21తో పోలిస్తే 2023–24 (ఎస్‌డీజీ)లో 74 స్కోర్‌తో తెలంగాణ ముందుందని చెప్పారు. అంతకుముందు 2020–21తో పోలిస్తే ఐదు పాయింట్లు మెరుగైందన్నారు. చాలారంగాల్లో తెలంగాణ సాధించిన మార్కులు జాతీయ సగటును మించి ఉండటం గత పదేళ్ల అభివృద్ధికి నిదర్శనమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీకారాలు, రాజకీయ కక్షలు, పార్టీ ఫిరాయింపులపై పెట్టే దృష్టి.. రాష్ట్రాభివృద్ధిపై పెడితే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

రుణమాఫీలో మాది ఆల్ టైం రికార్డ్

మాజీ మంత్రి హరీశ్‌రావు

- నాడు రైతులకు అందిన మొత్తం రూ.1.20లక్షల కోట్లు
- బీసీ, ఎస్సీ హాస్టళ్ల ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలివ్వండి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్లలో పాలనలో తెలంగాణలో వ్యవసాయ రంగం స్వర్ణయుగం సాధించడంతోపాటు రుణమాఫీలో రైతులకు రూ.1.20లక్షల కోట్లు లబ్ధి చేకూర్చి దేశంలోనే ఆల్ టైం రికార్డు సృష్టించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం హరీశ్‌రావు సామాజిక మాధ్యమం 'ఎక్స్'వేదికగా బీఆర్ఎస్ పాలనలో రైతులకు జరిగిన లబ్ధిని వివరించారు. కేసీఆర్ పాలనలో వివిధ పథకాల కింద రైతులకు రూ.1.20 లక్షల కోట్లు నేరుగా సాయం అందించిందన్నారు. రైతుబంధు కింద 69 లక్షల మంది రైతులకు రూ.72,972 కోట్లు, రైతు బీమా కింద 1.11 లక్షల మంది రైతులకు రూ.6,488 కోట్ల తమ ప్రభుత్వ హయాంలో చెల్లించామన్నారు. రైతు రుణమాఫీ కింద రెండు విడతల్లో కలుపుకుని రూ.29,144.61 కోట్లు చెల్లించామన్నారు. ఇతర రైతు సంక్షేమ పథకాల కింద రైతులకు రూ.11,401 కోట్లు సాయం అందించామన్నారు.

చిరుద్యోగుల వెతలు తీర్చండి

ప్రభుత్వ ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఏడు నెలలుగా జీతాలు పొందక అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వారికి వేతనాలివ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రతీ నెలా 1న వేతనాలు చెల్లిస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ సర్కారుకు చిరు ఉద్యోగుల వెతలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

నేడు గవర్నర్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భేటీ

- కేటీఆర్ నేతృత్వంలో రాజ్ భవన్‌కు..
- ఎమ్మెల్యేలపై అనర్హత వేటు, ప్రొటోకాల్ ఉల్లంఘనలపై ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో భేటీ కానున్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఈ భేటీకి గవర్నర్ అపాయింట్మెంట్ ఇచ్చినట్లు సమాచారం. పార్టీ ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని ఇటీవల కేటీఆర్ నేతృత్వంలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం గవర్నర్‌తో జరిగే భేటీలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం ఇదే అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించే అవకాశముంది. క్షేత్రస్థాయిలో ప్రొటోకాల్ ఉల్లంఘనలతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కూడా సాక్ష్యాధారాలను గవర్నర్‌కు బీఆర్ఎస్ బృందం అందజేస్తుంది. దీంతోపాటు రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలు, పోటీ పరీక్షల నిర్వహణపై నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనలు, వారిపై పోలీస్ కేసుల నమోదు వంటి అంశాలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఈ నెల 23న రాష్ట్ర శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యేలోపే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడేలా చూడాలని కేటీఆర్ రాష్ట్ర గవర్నర్‌కు విజ్ఞప్తి చేయనున్నారు. అప్పటికి అనర్హత వేటు పడకుంటే ఇదే అంశాన్ని అసెంబ్లీలోనూ ఎత్తి చూపాలని బీఆర్ఎస్ వ్యూహం సిద్ధం చేస్తోంది.

రుణమాఫీపై రేవంత్ మోసం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ధ్వజం
- కేవలం 30 శాతం మంది రైతులకు మాత్రమే లబ్ధి
- గోరంత చేసి, కొండంత చెప్పుకుంటున్నారు

సాక్షి, హైదరాబాద్: రుణమాఫీ పేరిట సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు గడిచిన నాలుగైదు రోజులుగా రైతులను మోసం చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. రైతులకు బీఆర్ఎస్ పాలనలో ఏమీ జరగలేదని కాంగ్రెస్ పార్టీ గోబెల్స్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. పార్టీ ఎమ్మెల్యేలు వివేకానంద, కోవా లక్ష్మి, నేతలు రాకేశ్‌రెడ్డి, రాంబాబు యాదవ్, తుంగ బాలుతో కలసి ఆయన తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన రూ.6 వేల కోట్లతో పంట రుణాలు తీసుకున్న రైతుల్లో 30%మందికి మాత్రమే లబ్ధి జరిగిందన్నారు. రైతులకు గోరంత చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కొండంతగా ప్రచారం చేసుకుంటోందన్నారు. కేసీఆర్ పాలనలో రెండు విడతల్లో కలుపుకొని రైతులకు రూ.29 వేల కోట్ల రుణమాఫీ చేశామని, మరో 7 వేల కోట్లు సిద్ధం చేసినా ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ ఫిర్యాదుతో అది నిలిచిపోయిందని చెప్పారు. హరీశ్‌రావు రాజీనామా సవాలును కాంగ్రెస్ నేతలు వక్రీకరిస్తున్నారని, ఇప్పటికీ హరీశ్ తన రాజీనామా సవాలుకు కట్టుబడి ఉన్నారని ఆయన అన్నారు. రుణమాఫీపై దేవుళ్లపై ఒట్లు వేసి వాటిని నిలుపుకునేందుకు రేవంత్‌రెడ్డి తంటాలు పడుతున్నారని ఎమ్మె ల్యే వివేకానంద విమర్శించారు. ప్రతిపక్షంలో ప్రభు త్వ ప్రకటనలను తప్పుపట్టిన రేవంత్, ఇప్పుడు అదే తరహాలో ఎందుకు ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో తప్పుడు హామీలతో మోసం చేసిన రేవంత్, ముఖ్యమంత్రిగానూ అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. రైతుభరోసాపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం కాంగ్రెస్ కార్యకర్తల అభిప్రాయాలు మాత్రమే తీసుకుందని ఎమ్మెల్యే కోవా లక్ష్మి విమర్శించారు.

వారు నిద్రమాత్రలు వేసుకుని పడుకుంటున్నారు

బీఆర్ఎస్, బీజేపీ నేతలనుద్దేశించి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ రుణమాఫీ కార్యక్రమాన్ని చూసిన దగ్గర్నుంచి బీఆర్ఎస్, బీజేపీ నేతలకు నిద్ర పట్టడం లేదని, ఆ పార్టీల నేతలు నిద్రమాత్రలు వేసుకుని పడుకుంటున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీ గురించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్, బీజేపీ నేతలు బండి సంజయ్, హరీశ్‌రావులకు లేదన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు కోట్ల శ్రీనివాస్, సంగిశెట్టి జగదీశ్వరరావులతో కలిసి ఆయన మాట్లాడుతూ రూ.లక్ష వరకు రైతుల రుణమాఫీ ప్రారంభం కాగానే రాష్ట్ర వ్యాప్తంగా రైతులు సంబురాలు చేసుకుంటున్నారన్నారు.

ఆగస్టు నెలాఖరునాటికి రూ.2లక్షల రుణమాఫీ

ఆగస్టు 15వరకు రూ.లక్షన్నర, అదేనెల 31వ తేదీ నాటికి రూ.2లక్షల మాఫీ కూడా పూర్తవుతుందని జగ్గారెడ్డి చెప్పారు. రూ.7లక్షల కోట్లు అప్పులు చేసి రూ.26వేల కోట్లు రైతులకిచ్చామని బీఆర్ఎస్ ఘనంగా చెప్పుకుంటోందని, అప్పులు తీర్చుకుంటూ రూ.31వేల కోట్ల రుణమాఫీ చేసిన తామేం చెప్పుకోవాలని ప్రశ్నించారు. తమకు నాలుగున్నరేళ్ల సమయం ఉన్నా అప్పుడే ఈ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. సినీనటుడు చిరంజీవి ఖైదీ నంబర్ 150 పేరుతో తీసిన సినిమాలో రైతుల గురించి చెప్పి కోట్లు సంపాదించుకున్నారని, కానీ బీజేపీ చేస్తున్న దురాగతాలను ఏనాడూ ప్రశ్నించలేదని, తన తమ్ముడు పవన్ కల్యాణ్ బీజేపీతో దోస్తీ చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక, బీజేపీ హయాంలో రూ.16లక్షల కోట్లను అదానీ, అంబానీ, మోదీ అనే కార్పొరేట్లకు మాఫీ చేశారే కానీ, రైతులకు ఒక్క రూపాయి అయినా రుణమాఫీ చేశారా అని ప్రశ్నించారు.

క్లుప్తంగా...

రిటైర్మెంట్ సౌకర్యాల సవరణ ఉత్తర్వులివ్వాలి

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లు, హెల్పర్లకు ఉద్యోగ విరమణ సౌకర్యాల సవరణ ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ టీచర్‌కు రూ.2 లక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష చొప్పున ఉద్యోగ విరమణ ప్యాకేజీ ప్రకటించినందుకు శుక్రవారం రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జీవోను వెంటనే విడుదల చేసి ప్యాకేజీని అమలు చేయాలని కోరారు.

అర్చకుల బదిలీ ఆలోచన విరమించాలి

సాక్షి, హైదరాబాద్: దేవాలయ అర్చకుల బదిలీ ఆలోచనను విరమించుకోవాలని రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. జేఏసీ కన్వీనర్ డీవీఆర్ భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఆనంద్, తెలంగాణ పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ శ్రీనివాసరావు ముఖ్యమంత్రిని కలిసి ఈమేరకు వినతి పత్రం అందజేశారు. ఆలయాల్లో ఐదేళ్లకు పైగా పనిచేస్తున్న ఉద్యోగులు, అర్చకులను క్రమబద్ధీకరించాలని, పింఛన్ వసతి కల్పించాలని, ఈవో పదోన్నతులు చేపట్టాలని, ఆలయ భూములను పరిరక్షించేందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

వాటికి ప్రత్యేక నిధులివ్వాలి

మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ భూక్యా రామునాయక్

సాక్షి, హైదరాబాద్: సింగరేణి పరిధిలోని మున్సిపాలిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ భూక్యా రామునాయక్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సింగరేణి బొగ్గు గనులు, ఓపెన్ కాస్ట్ ప్రాంతంలో మణుగూరు, కొత్తగూడెం, పాల్వంచ, భూపాలపల్లి, మంథని, రామగుండం, నస్పూర్, మందమర్రి, చెన్నూర్, బెల్లంపల్లి, క్యాతంపల్లి తదితర మున్సిపాలిటీలు ఉన్నాయన్నారు. వీటి పరిధిలోనే బొగ్గు గనులు, ఓపెన్ కాస్ట్ ఉన్నాయని, వివిధ మున్సిపాలిటీలో సింగరేణి సంస్థలు ఏర్పడి రూ.లక్షల కోట్ల లాభాలను గడిస్తున్నాయన్నారు. సింగరేణి సంస్థలు, ఇతర ఆస్తులకు మున్సిపాలిటీలే నిధులు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మున్సిపాలిటీల అభివృద్ధికి సింగరేణి సంస్థ నుంచి నిధులు ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ సీఎం బలరాం నాయక్‌ను కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదలయ్యేలా చూడాలని పురపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్‌ను కోరారు.

త్వరలో విద్యాకమిషన్ ఏర్పాటు

- విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రీ స్కూల్స్‌గా అంగన్‌వాడీలు... నాలుగు నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రణాళిక
- సచివాలయంలో విద్యావేత్తలతో భేటీ



మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో భట్టి, కేకే, కోదండరాం, పీఎల్ విశ్వేశ్వరరావు, ఆకునూరి మురళి, హరగోపాల్, శాంతాసిన్హా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యావ్యవస్థను మెరుగుపర్చడానికి త్వరలోనే విద్యాకమిషన్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలు మొదలు యూనివర్సిటీల వరకు నాణ్యమైన విద్యాబోధన, నైపుణ్య శిక్షణ, ఉపాధికల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతంపై చర్చించేందుకు విద్యావేత్తలతో సచివాలయంలో సీఎం శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ బలోపేతానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని..విద్యావేత్తలు ఇచ్చే సూచనలు స్వీకరిస్తామన్నారు. భేటీలో ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరాం, పీఎల్.విశ్వేశ్వరరావు, శాంతాసిన్హా, అల్దాస్ జానయ్య, పద్మజాషా, లక్ష్మీనారాయణ, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి పాల్గొన్నారు. నియామకాలు, నిధులు, మౌలిక సదుపాయాలు, పర్యవేక్షణలోపంతో పాఠశాలవిద్యలో తెలంగాణ 35వ స్థానంలో ఉందని వారు సీఎంకు వివరించారు. పాఠశాలలకు గ్రేడింగ్ ఇవ్వాలని.. తద్వారా విద్యార్థులు చేరడానికి ఆసక్తి కనపరుస్తారని సూచించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని వివరించారు. అంగన్‌వాడీల్లోనే మూడో తరగతి వరకు ప్రీస్కూల్‌లో బోధన అందేలా చూసి, నాలుగు నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు సీఎం తెలిపారు. పదేళ్లుగా యూనివర్సిటీల్లో బోధన సిబ్బంది నియామకం జరగలేదని, వీసీలు లేరని ప్రొఫెసర్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వీసీల నియామకానికి ఇప్పటికే సెర్చ్ కమిటీలు వేశామన్నారు. యూనివర్సిటీలకు డెవలప్‌మెంట్ గ్రాంట్స్ ఇవ్వాలని, అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేయాలని అల్దాస్ జానయ్య సీఎంను కోరారు. తాము చదువుకున్న ఉస్మానియాలో ప్రస్తుతం విద్యాప్రమాణాలు పడిపోయాయని హరగోపాల్, శాంతాసిన్హా ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థలో మార్పులపై విధానపత్రం రూపొందిస్తే.. దానిపై చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి అన్నారు. విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రపంచ బ్యాంకు, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు అతి తక్కువ వడ్డీకి, దీర్ఘకాలిక రుణాలు ఇస్తాయని ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య చెప్పగా, ఆ అంశాన్ని పరిశీలిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో 11 శాతంగా ఉన్న విద్యాశాఖ బడ్జెట్ తెలంగాణ ఏర్పడిన తర్వాత 6.4 శాతానికి పడిపోయిందని, తాను, భట్టి విక్రమార్క ఇద్దరం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నామని, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి బడ్జెట్ పెంచుతామని సీఎం హామీ ఇచ్చారు.

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో 'తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ'బిల్లు!

తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు బిల్లును ఈ బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్కిల్స్ యూనివర్సిటీపై శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా వర్సిటీలో నిర్వహించే కోర్సులు, వాటి వ్యవధి, నిర్వహణకు అవసరమయ్యే మౌలిక వసతులు, నిధులు, వివిధ కంపెనీల భాగస్వామ్యంపై పరిశ్రమలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కొత్త యూనివర్సిటీకి 'తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ'అని పేరు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర పరిశ్రమల విభాగం ముసాయిదా రూపొందించిందని చెప్పారు.

అందరికీ హైదరాబాద్‌లోనే శిక్షణ

హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ప్రధాన క్యాంపస్‌తోపాటు జిల్లా కేంద్రాల్లో ప్రాంతీయ ప్రాంగణాలు (శాటిలైట్ క్యాంపస్‌లు) ఏర్పాటు చేసే విషయం సమావేశంలో చర్చకొచ్చింది. అయితే అందరూ హైదరాబాద్ క్యాంపస్‌లో చేరేందుకు పోటీ పడతారని సీఎం అన్నారు. హైదరాబాద్‌లోనే అందరికీ శిక్షణ అందించేలా ఏర్పాట్లు చేయాలని, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ)తో పాటు న్యాక్ క్యాంపస్‌ను ఉపయోగించుకోవాలని, అవసరమైన మౌలిక వసతి సదుపాయాలున్న ప్రాంగణాలను గుర్తించాలని సూచించారు.

పీపీపీ మోడల్‌లో స్కిల్స్ వర్సిటీ

ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం (పీపీపీ)తో స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పనున్నారు. మూడు, నాలుగేళ్ల కాల వ్యవధి ఉండే డిగ్రీ కోర్సులతో పాటు ఏడాది డిప్లొమా, మూడు నుంచి నాలుగు నెలల వ్యవధి ఉండే సర్టిఫికెట్ కోర్సులు ఇందులో నిర్వహిస్తారు.

సమీకృత గురుకులాల ఏర్పాటుపై సీఎం సమీక్ష

- వీటికి అనుబంధంగా సెమీ రెసిడెన్షియల్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం
- సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ప్రణాళిక

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో సమీకృత గురుకులాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇందులో భాగంగా భవనాల డిజైన్స్‌పై శుక్రవారం రేవంత్‌రెడ్డి.. మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆర్కిటెక్ట్స్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమీకృత గురుకుల పాఠశాలల మాస్టర్ ప్లాన్‌తోపాటు ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రెండు మండలాల్లో సమీకృత గురుకుల పాఠశాలలతో సమాంతరంగా సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్వహించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వీటికి సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్రాలను ప్లేస్కూల్ తరహాలో మూడో తరగతి వరకు నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీల్లో విద్యాబోధనకు అదనంగా ఒక టీచర్ నియమించాలని చెప్పారు. నాలుగోతరగతి నుంచి సెమీ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుకునేలా వెసులుబాటు ఉండాలని, ప్రభుత్వమే రవాణా సదుపాయం కల్పించేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

ప్రభుత్వ సలహాదారులతో పర్యవేక్షణ కమిటీ: సీఎస్ శాంతికుమారి

సమీకృత గురుకుల విద్యాసంస్థలకు సంబంధించి పనుల పర్యవేక్షణ, వసతుల కల్పన అంశాలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. ఈ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సభ్యులుగా ఉంటారన్నారు. త్వరలో ఏర్పాటు చేయనున్న సమీకృత గురుకుల పాఠశాలలకు భూకేటాయింపులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన చర్యలపై సంక్షేమశాఖల ఉన్నతాధికారులతో శుక్రవారం సచివాలయంలో సీఎస్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిత్తల్, ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి, మైనారిటీ సంక్షేమశాఖ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ పాల్గొన్నారు.

ఆగస్టు 1 నుంచి 'వికలాంగులకు చేయూత'



ముత్తినేని వీరయ్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆగస్టు 1 నుంచి 'వికలాంగులకు చేయూత' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య వెల్లడించారు. తొలిరోజు కార్యక్రమానికి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ప్రతినెలా తొలి, మూడో గురువారం మలక్‌పేటలోని తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ కార్యాలయంలో దివ్యాంగుల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. రెండు, మూడో గురువారాల్లో ఫోన్ కార్యక్రమం ద్వారా వినతులు స్వీకరిస్తామని వివరించారు. నగరంలోని కార్పొరేషన్‌కు రాలేని దివ్యాంగులు, వందశాతం వైకల్యం ఉన్నవారి కోసం ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. అందిన విజ్ఞప్తుల మేరకు ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డెక్కిన స్టాఫ్ నర్సులు

బదిలీల కౌన్సెలింగ్ తాత్కాలిక వాయిదా

- కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాల రోడ్డును దిగ్బంధనం చేసిన వేలాది మంది స్టాఫ్ నర్సులు
- భారీగా ట్రాఫిక్ జామ్



ఉస్మానియా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో స్టాఫ్ నర్సుల ఆందోళన

సాక్షి, హైదరాబాద్, సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న హెడ్ నర్సు, స్టాఫ్ నర్సుల కౌన్సెలింగ్‌లో అవకతవకలు జరిగాయంటూ నర్సులు చేపట్టిన ఆందోళన శుక్రవారం కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాల వద్ద ఉద్రిక్తతకు దారితీసింది. తెలంగాణలోని 7 జోన్లకు ఒకేసారి కౌన్సెలింగ్ చేపట్టడంతో కళాశాల ఆడిటోరియంలో గందరగోళం నెలకొంది. డీహెచ్ రవీంద్రనాయక్ నేతృత్వంలో జరిగిన కౌన్సెలింగ్‌లో గ్రేడ్-1 అధికారి సుజాత రాథోడ్ వేదికపైకి వచ్చి బదిలీల లిస్టును మార్పు చేయించడంతో నర్సులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బదిలీల కౌన్సెలింగ్‌ను పారదర్శంగా నిర్వహించాలని పెద్దపెట్టున నినదించారు. దీంతో డీహెచ్ కౌన్సెలింగ్‌ను తాత్కాలికంగా వాయిదా వేశారు. దీంతో వివిధ జిల్లాల నుంచి వచ్చిన వేలాది మంది స్టాఫ్‌నర్సులు ధర్నాకు దిగారు. తమకు ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించాలని, డీహెచ్ డౌన్ డౌన్ అని నినదించారు. కొందరు అధికారులు యూనియన్ నేతలుగా చెప్పుకుంటున్న వారితో కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగులు ఇస్తున్నారని ఆరోపించారు. ఓ యూనియన్ నేత రూ.5 కోట్ల వరకు వసూలు చేశాడని.. ఆ సొమ్ములో రూ. 3 కోట్లు ఒక కీలక అధికారికి కూడా ఇచ్చినట్లు ఆరోపించారు. ఉస్మానియా మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న రోడ్డును గంటసేపు దిగ్బంధనం చేశారు. దీంతో సుమారు రెండున్నర గంటల పాటు కోఠి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పదుల సంఖ్యలో ఉన్న పోలీసులు వేల సంఖ్యల్లో స్టాఫ్ నర్సులను నిలువరించలేకపోవడంతో రాకపోకలు భారీగా నిలిచిపోయాయి.

> ఎవరిలోనైతే కుటిలతగానీ, కపటంగానీ, అబద్ధంగానీ ఉండవో– అంటే ఎవరైతే రాగద్వేషాలకు దూరంగా ఉంటూ, నిష్కల్మష హృదయులై ఉంటారో వారికి మాత్రమే ఈ విశుద్ధ, నిర్వికార బ్రహ్మలోకం లభిస్తుంది.
>
> – ప్రశ్నోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 20 జూలై 2024

స్తంభించిన ప్రపంచం!

మైక్రోసాఫ్ట్ విండోస్ మొండికేయటంతో శుక్రవారం ఒక్కసారిగా అంతా అస్తవ్యస్తమైన తీరు ఐటీపై ప్రపంచం ఎంతగా ఆధారపడిందో కళ్లకు కట్టింది. అమెరికా, యూరప్, ఆస్ట్రేలియాలతోపాటు మన దేశంలోనూ అనేక సేవలకు అంతరాయం ఏర్పడింది. మ్యాక్, లైనెక్స్ ఆధారిత సేవలు యథావిధిగా పనిచేశాయి. 1872లో ఆంగ్ల రచయిత శామ్యూల్ బట్లర్ యంత్రాలకు సొంతంగా ఆలోచించే, తిరిగి తమంత తాము చేయగలిగే సామర్థ్యం వస్తే ఎలావుంటుందో చూపుతూ ఎరెవాన్ అనే వ్యంగ్య నవల రాశాడు. అది మరీ అతిగావుందని సమకాలికుల నుంచి విమర్శలొచ్చాయి. బహుశా ప్రపంచంలో అదే తొలి సైన్స్ ఫిక్షన్. ఆ కోవలో తర్వాత చాలా వచ్చాయి. సైబర్ దాడులు జరిగితే ప్రపంచం ఏమవుతుందన్న ఇతివృత్తాలతో చలనచిత్రాలు, టీవీ సీరియళ్లు వచ్చాయి. కానీ మైక్రోసాఫ్ట్ విండోస్‌కు సైబర్ నేరగాళ్లనుంచి కాకుండా అలాంటివారినుంచి రక్షిస్తామని చెప్పే ఒక సైబర్ సెక్యూరిటీ సంస్థ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌వల్ల సమస్యలు తలెత్తి ఇంత పని జరగటం ఒక వైచిత్రి. మైక్రోసాఫ్ట్‌కు సైబర్ సెక్యూరిటీ సేవలందించే క్రౌడ్‌స్ట్రయిక్ అనే అమెరికా సంస్థ తాను రూపొందించిన యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌ను నవీకరించి కొత్తది విడుదల చేయగానే సమస్య తలెత్తిందంటున్నారు. దీంతో మైక్రోసాఫ్ట్ రూపొందించిన ఇన్‌ట్యూన్, వన్‌నోట్, షేర్‌పాయింట్, మైక్రోసాఫ్ట్ డిఫెండర్ వంటి అనేక యాప్‌లు నిరర్థకమయ్యాయి. ఒక్కొక్కటే మళ్లీ పునరుద్ధరిస్తున్నట్టు సంస్థ ప్రకటించింది. అయితే ఈలోగా అనేక దేశాల్లో కంప్యూటర్లు ఆగిపోయాయి. రైళ్లు, విమానయాన సేవలు నిలిచిపోవటం మొదలుకొని దుకాణాల్లో చెల్లింపుల ప్రక్రియ వరకూ అన్నిటికన్నీ స్తంభించిపోయాయి. చాలాచోట్ల వాణిజ్య, వ్యాపార లావాదేవీలూ, బ్యాంకింగ్, ఆరోగ్య సేవలూ, వార్తా ప్రసారాలూ, పోలీసు వ్యవస్థలూ, మెట్రో సర్వీసులూ, స్టాక్ ఎక్స్ఛేంజ్‌లూ నిలిచిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది సంస్థల్లో వినియోగించే టీమ్స్ సాఫ్ట్‌వేర్ సైతం ఆగిపోయింది. విమానాల్లో బోర్డింగ్ పాస్‌లు చేతితో రాసి ఇవ్వటం అందరూ మరిచి దాదాపు మూడు దశాబ్దాలవుతోంది. తాజా సమస్య అదెలా వుంటుందో ఈ తరానికి రుచి చూపింది.

సమాచార సాంకేతికతలు వర్తమాన యుగంలో జీవితాన్ని వేగవంతం చేశాయి. కొన్ని శతాబ్దాలు ఇలాంటివేమీ లేకుండానే ప్రపంచం మనుగడ సాగించిందన్న సంగతినే మరిచేలా చేశాయి. అరచేతిలో ప్రపంచం మొత్తం ఇమిడిపోయింది. ఖండాంతరాల్లోని మారుమూల దేశాల్లోనివారితో సైతం ఎక్కడున్నవారైనా మాట్లాడగలిగే వెసులుబాటు అందుబాటులోకొచ్చింది. మనుష్య సంచారం అసాధ్యమనుకున్న చోటకు సైతం డ్రోన్‌లు వెళ్తున్నాయి. సాధారణ పనులు మొదలుకొని ప్రమాదం పొంచివుండే కార్యాలవరకూ రోబోలు చేస్తున్నాయి. సంక్లిష్ట సమస్యలకు చిటికెలో పరిష్కారం లభిస్తోంది. అందువల్ల ఉత్పాదకత పెరిగింది. చాలా తక్కువ వ్యవధిలో ఎక్కువ పని చేయగలిగే సామర్థ్యం మనుషుల సొంతమైంది. కావలసిన సమాచారం కోసం గూగుల్‌ని ఆశ్రయించేవారే నిమిషానికి 63 లక్షలమంది ఉన్నారంటే పరిస్థితేమిటో అర్థమవుతుంది. ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా సగటు ఆయుఃప్రమాణం 52.5 సంవత్సరాలైతే ఆరోగ్యరంగ సాంకేతికతలవల్ల అది ప్రస్తుతం 72 సంవత్సరాలని ఐక్యరాజ్యసమితి నిరుడు ప్రకటించింది. సమాచార సాంకేతికతలు అనేకచోట్ల మనిషి అవసరాన్ని తగ్గించాయి. అందువల్ల కొందరి ఉద్యోగావకాశాలకు ముప్పు వచ్చిన మాట కూడా వాస్తవం. కానీ ఇదివరకెన్నడూ వినని అనేక రకాల కొత్త అవకాశాలు లభించాయి. వచ్చే ఏడాదికల్లా ప్రపంచవ్యాప్తంగా ఈ సాంకేతికతల్లో 9 కోట్ల 70 లక్షల ఉద్యోగావకాశాలుంటాయని ఒక అంచనా. అయితే ఈ సాంకేతికతల వల్ల సాంఘిక జీవనం అస్తవ్యస్తమవుతున్నదని, మనిషి ఏకాకి అవుతున్నాడని, పర్యవసానంగా సమాజంలో అమానవీయత విస్తరించిందని, వ్యక్తి గోప్యతకు ముప్పు ఏర్పడిందని, పౌరుల జీవితాల్లోకి రాజ్యం చొరబాటు ఊహకందనంత పెరిగిందని కనబడుతూనేవుంది. తప్పుడు సమాచారం వ్యాప్తిచేసి లాభపడే శక్తులున్నట్టే, దానివల్ల నష్టపోతున్నవారూ అధికంగానే ఉన్నారు. ఈ సాంకేతికతల అభివృద్ధి పరుగులో పర్యావరణానికి కలుగుతున్న హాని గురించి ఎవరూ పట్టించుకోవటం లేదు. పారిశ్రామికీకరణ తర్వాత భవిష్యత్తు స్పృహ కొరవడి అడవుల, ఇతరేతర సహజ సంపదల విధ్వంసం, పర్యవసానంగా ప్రకృతి వైపరీత్యాలు క్రమేపీ పెరిగాయనుకుంటే ఐటీ అభివృద్ధి దీన్ని మరింత వేగవంతం చేసింది. పర్యావరణ అనుకూల సుస్థిరాభివృద్ధి వైపు దృష్టి సారించాలన్న వినతులు అరణ్యరోదనే అవుతున్నాయి.

పాతికేళ్ల క్రితం వై2కె సమస్యతో ప్రపంచం తలకిందులవుతుందన్న ప్రచారం జరిగింది. ఈ సమస్య పరిష్కారానికి వేల కోట్లు ఖర్చుచేయటం తప్పనిసరన్న అంచనాలు వచ్చాయి. తీరా చాలా సులభంగానే దానికి పరిష్కారం దొరికింది. నిజానికి ఆ రోజుల్లో కంప్యూటర్ల వాడకం, వాటిపై ఆధారపడటం ఇప్పటితో పోలిస్తే తక్కువనే చెప్పాలి. కానీ తరచు సైబర్ దాడులతో తల్లడిల్లే సమాచార సాంకేతిక ప్రపంచంలో తాజా ఉదంతం ఒక పెద్ద కుదుపు. అప్రమత్తంగా లేకపోతే, విడుదల చేసేముందు ఒకటికి పదిసార్లు పరీక్షించి చూసుకోనట్టయితే ఒక సాఫ్ట్‌వేర్ ఎంతటి ఉత్పాతం సృష్టించగలదో తాజా ఉదంతం ఒక హెచ్చరిక. ఇంతవరకైతే ఫర్వాలేదు. కానీ దాదాపు అన్ని దేశాల రక్షణ వ్యవస్థలూ ఐటీతో ముడిపడివున్న వర్తమానంలో పొరపాటున సాఫ్ట్‌వేర్ లోపంతో కంప్యూటర్లు తప్పుగా అర్థం చేసుకుంటే పెనుముప్పు ఏర్పడుతుంది. ఏం జరిగిందో తెలుసుకునేలోపే మారణాయుధాలు భూగోళాన్ని వల్లకాడు చేస్తాయి. ఆ విషయంలో అప్రమత్తత అవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం, **తిథి:** శు.చతుర్దశి సా.5.20 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.2.25 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.12.04 నుండి 1.40 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.37నుండి 7.21 వరకు, **అమృతఘడియలు:** రా.9.37 నుండి 11.12 వరకు.

సూర్యోదయం : 5.38
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

అమెరికా రాజకీయంలో హింసాపర్వం

విశ్లేషణ



మనోజ్ జోషి

అమెరికా రాజకీయ జీవితంలో హింస ఒక భాగమైందన్నది వాస్తవం. తుపాకుల లభ్యత, వాటి యాజమాన్యంపై నియంత్రణలను సడలించారు. ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకోవడానికి ఉపయోగించిన కోల్ట్ ఏఆర్–15 వంటి ఆయుధాలను నిషేధించే ప్రయత్నం పదేళ్లే కొనసాగింది. ఇది కోర్టులో పదేపదే సవాళ్లను ఎదుర్కొంది. ఎక్కువగా ఇటువంటి ఆయుధాలతోనే సామూహిక కాల్పులు జరుపుతారు. 2023లో, 604 కాల్పులు జరగగా 754 మంది మరణించారు. ఇక ట్రంప్ మీద జరిగిన హత్యాయత్నం ఆయనకు రాజకీయంగా లాభిస్తుందనేది సుస్పష్టం. అలాగే ట్రంప్ వాచాలత్వం పెను మంటలు రగిలించేలా ఉందన్నదీ రహస్యం కాదు. ఆయన ఎలా వ్యవహరిస్తారనే దానిపై ప్రస్తుత పరిస్థితి చాలావరకు ఆధారపడి ఉంటుంది.

అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నానికి సంబంధించిన రాజకీయ పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. అవి ఆయనకు ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తాయి. తనపై జరిగిన దాడి పట్ల ట్రంప్ సహజమైన, పోరాట ప్రతిస్పందనలకు గొప్ప ప్రాముఖ్యత ఉంది. ఆయనను సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు చుట్టుముట్టినప్పుడు, తన ముఖం మీద రక్తపు చారలతో, తన కుడి పిడికిలిని పైకెత్తి, 'ఫైట్, ఫైట్, ఫైట్'(పోరాడు) అంటూ గర్జించారు. రక్తసిక్తమైన, ఆగ్రహోదగ్రుడైన ట్రంప్ పిడికిలి బిగించి ఉండగా, ఆయన వెనుక ఒక అమెరికన్ జెండా రెపరెపలాడుతున్న చిత్రాలు వైరల్‌గా మారాయి. రెండు వారాల క్రితం అధ్యక్ష అభ్యర్థుల మధ్య జరిగిన చర్చలో జో బైడెన్ ప్రదర్శన, సమర్థవంతమైన ప్రచారాన్ని నిర్వహించగల ఆయన సామర్థ్యం వల్ల అధ్యక్ష పోటీ ఇప్పటికే గందరగోళంలో పడింది.

తనపై ఉన్న కేసుల కారణంగా తనను తాను అమర వీరుడుగానూ, హింసకు గురైన వ్యక్తిగానూ ప్రదర్శించుకోవడం ట్రంప్ విధానం. కాల్పుల ద్వారా మృత్యువుకు సమీపంగా వెళ్లడం అనేది ఆయనకు అమరత్వ భావనను ఆపాదిస్తుంది. అధ్యక్షుల చర్చలో పరాజయం తరువాత డెమోక్రాటిక్ అభ్యర్థిగా బైడెన్‌ను తొలగించాలనే ప్రచారంపై ట్రంప్ మీద హత్యాయత్నం తప్పక ప్రభావం చూపుతుంది. ట్రంప్ వర్గానికి అంతకంటే కావాల్సింది లేదు.

ట్రంప్‌పై కాల్పుల ఘటన బైడెన్ ప్రచారాన్ని క్లిష్టతరం చేస్తుంది. ఇప్పుడు నేరుగా ట్రంప్‌పై దృష్టి సారిస్తానని అమెరికా అధ్యక్షుడు గత వారంలో అన్నారు. ట్రంప్‌ను ఓడించడానికి తానే ఉత్తమ అభ్యర్థిగా ఉన్నానని ఆయన అభిప్రాయం. 'లక్ష్యానికి సంబంధించిన కేంద్ర స్థానంలో ట్రంప్‌ను ఉంచే సమయం వచ్చింది' అన్న బైడెన్ మాటల్ని, తమ అధ్యక్ష అభ్యర్థిపై హింసకు పిలుపుగా ఇప్పుడు కొంతమంది రిపబ్లికన్లు ఆపాదిస్తున్నారు. ఇది ఒక విడి ఘటన కాదనీ, ట్రంప్ 'ఏ రకంగానైనా అడ్డుకోవలసిన నిరంకుశ ఫాసిస్ట్' అనే డెమోక్రాటిక్ పార్టీ వాచాలత్వపు అనివార్య పరిణామమనీ రిపబ్లికన్ల ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ పోస్ట్ చేశారు.

అమెరికా రాజకీయ జీవితంలో హింస ఒక భాగమైందన్నది వాస్తవం. తుపాకుల లభ్యత, వాటి యాజమాన్యంపై నియంత్రణలను సడలించడం వంటి నిర్ణయాలతో కోర్టులేమీ మేలు చేయలేదు. ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకోవడానికి ఉపయోగించిన కోల్ట్ ఏఆర్–15 వంటి దాడి ఆయుధాలను నిషేధించే ప్రయత్నం కేవలం పదేళ్లపాటు కొనసాగింది. ఇది కోర్టులో పదేపదే సవాళ్లను ఎదుర్కొంది. ప్రస్తుతం, కొన్ని రాష్ట్రాలు తమ సొంత చట్టాల ద్వారా అటువంటి ఆయుధాలను నిషేధించాయి. కాల్పుల ఘటన జరిగిన పెన్సిల్వేనియా వాటిలో లేదు. ఎక్కువగా ఇటువంటి ఆయుధాలతోనే సామూహిక కాల్పులు జరుపుతారు. జూలైలో ఇప్పటికే మరొక



కాల్పుల ఘటన, అయిదు మంది మరణాలకు దారితీసింది. 2023లో, 604 కాల్పులు జరగగా 754 మంది మరణించారు, దాదాపు 2,500 మంది గాయపడ్డారు. అమెరికన్ సుప్రీంకోర్ట్ సహాయకారిగా లేదని చెప్పడం చిన్న మాటే అవుతుంది.

బైడెన్ గెలుపొందిన ఎన్నికల ఫలితాలను ట్రంప్ మద్దతుదారులు 2021 జనవరి 6న తారుమారు చేయడానికి ప్రయత్నించిన కాపిటల్ అల్లర్ల నుండి, అమెరికా ఎన్నికల ప్రక్రియ హింసకు దారితీసింది. తిరుగుబాటును అణిచివేసేందుకు ముందు రేగిన అల్లకల్లోలంలో తొమ్మిది మంది మరణించారు. దీనివల్లనే ట్రంప్ ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత అమెరికన్ రాజకీయాలు లోతుగా విభజనకు గుర య్యాయి. 'ప్యూ రీసెర్చ్ సెంటర్' పోల్ ప్రకారం, ప్రతి రాజకీయ పక్షంలోనూ దాదాపు మూడింట రెండు వంతుల మంది... ఇతర పార్టీలలోని వారు అనైతికులనీ, నిజాయితీ లేనివారనీ, సంకుచిత మనస్తత్వం గలవారనీ నమ్ముతున్నారు.

ట్రంప్ వాచాలత్వం పెను మంటలు రగిలించేలా ఉందన్నది రహస్యం కాదు. తాను వచ్చే నవంబర్ అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోతే 'రక్తపాతం' ఉంటుందని మార్చ్ నెలలో ఒక ఇంటర్వ్యూలో ప్రకటించారు. తరువాత ఒక ర్యాలీలో, 'ఇప్పుడు నేను ఎన్నిక కాకపోతే... అది దేశానికి రక్తపాత కారకం అవుతుంది' అని పునరావృతం చేశారు. 2023 మార్చిలో, ట్రంప్ దోషిగా నిర్ధారించబడిన కేసులో మాన్‌హట్టన్ జిల్లా ప్రభుత్వ న్యాయవాది తనపై అభియోగాలు మోపినట్లయితే 'సంభావ్య మరణం, విధ్వంసం' జరగొచ్చని మాజీ అధ్యక్షుడు హెచ్చరించారు. తనకు అన్యాయం జరిగితే 'వీధుల్లో అల్లర్లు జరుగుతాయి', 'దేశంలో అల్లర్లు జరుగుతాయి' అని బెదిరించిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఆయన అనుచరులు మరోవైపున వలసదారులు, విదేశీయులు, శ్వేతజాతీయేతర జాతుల ప్రజలపై హింస గురించి మాట్లాడారు. నిజానికి, వ్యాపార లావాదేవీల్లో 34 నేరాలకు ట్రంప్ పాల్పడ్డారని మే నెలలో న్యాయస్థానం ఆయనను దోషిగా ప్రకటించిన తర్వాత, ట్రంప్ అనుకూల వెబ్‌సైట్లు అల్లర్లు, విప్లవం, హింసాత్మక ప్రతీకారం అనే పిలుపులతో నిండిపోయాయి.

ఇటీవలి సంవత్సరాలలోని హింసలో రాజకీయ నమూనా ఉంది. 2017లో, బేస్‌బాల్ గేమ్‌లో రిపబ్లికన్ హౌస్ మెజారిటీ విప్ అయిన స్టీవ్ స్కలైస్ మీద రిపబ్లికన్ వ్యతిరేక గన్‌మ్యాన్ కాల్పులు జరిపాడు (ఆ గన్‌మ్యాన్‌ను అప్పుడే కాల్చి చంపారు). 2018లో, ఫ్లోరిడాకు చెందిన ఒక వ్యక్తి నాటి అధ్యక్షుడు ట్రంప్ విమర్శకులకు పైపు బాంబులను మెయిల్ చేశాడు. అతడు లక్ష్యంగా చేసుకున్నవారిలో బరాక్ ఒబామా, హిల్లరీ క్లింటన్, కమలా హారిస్ ఉన్నారు. 2020 ఎన్నికలకు ముందు, మిషిగన్ గవర్నర్ గ్రెట్చెన్ విట్మెర్‌ను కిడ్నాప్ చేసి, రాజద్రోహ నేరం కింద ఆమెను 'విచారణ'లో నిలబెట్టడానికి ఆరు గురు వ్యక్తులు కుట్ర పన్నారు. 2022లో, మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీని లక్ష్యంగా చేసుకున్నారు; దాడిలో ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డారు. దుండగుడు పెలోసీని బందీగా తీసుకోవాలని పథకం వేశాడు.

ఈ పరిస్థితులలో, సగటు అమెరికన్ నిరుత్సాహానికీ, నిరాశకూ గురవుతాడు. రెండు పార్టీలలోని అతివాద శక్తులు అధికారం చేజిక్కించుకుని ఉన్నాయనీ, గతంలో అమెరికన్ రాజకీయాలకు ప్రతీకగా నిలిచిన ద్వైపాక్షికతకు పెద్దగా చోటు లేకుండా చేశాయనీ సగటు అమెరికన్లు భావిస్తున్నారు.

రాబోయే రోజులూ, వారాల్లో బైడెన్ చర్చ వైఫల్యం, దానిపై పొరలుగా, ట్రంప్‌పై హత్యాయత్నం వంటి ఇటీవలి సంఘటనలకు చెందిన పరిణామాల పెరుగుదలను మనం చూస్తాం. చాలామంది సరైన ఆలోచనాపరులు ట్రంప్‌పై కాల్పుల దాడి కలిగించిన షాక్ ప్రభావం ఎంతో కొంత ప్రశాంతతను తెస్తుందని ఆశిస్తున్నప్పటికీ, అలా జరుగుతుందనడానికి ఎటువంటి హామీ లేదు. రష్యన్లు, చైనీయులు తమ వంతు పాత్రను జోడించడంతో ఇప్పటికే తప్పుడు సమాచారం, అతిశయోక్తి, తీవ్రవాదం, జాత్యహంకారం, విభజన, అపనమ్మకం లాంటివి సైబర్ ప్రపంచంలో చెడతిరుగుతున్నాయి.

ట్రంప్ ఎలా వ్యవహరిస్తారనే దానిపై ప్రస్తుత పరిస్థితి చాలావరకు ఆధారపడి ఉంటుంది. తనపై హత్యాయత్నాన్ని ఆయన డెమో క్రాట్లపై దాడి చేయడానికి, విభజనలను మరింతగా పెంచడానికి ఉపయోగించవచ్చు లేదా నైతికంగా అత్యున్నత మార్గాన్ని చేపట్టి, పక్షపాత చీలికలను నయం చేయడానికి ఎంచుకోవచ్చు. కానీ ఫిర్యా దులు, ప్రతీకారం చాలాకాలంగా ట్రంప్ ఇతివృత్తాలుగా ఉన్నాయి. ఆయన తక్షణ ప్రతిస్పందన నెమ్మదిగానూ, తెలివిగానూ ఉన్నప్పటికీ, రాబోయే రోజుల్లో ట్రంప్ ఏ దిశలో వెళ్లగలరనే దానిపై అంచనాలు ఊహకందడం లేదు.

వ్యాసకర్త న్యూఢిల్లీలోని అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో డిస్టింగ్విష్డ్ ఫెలో ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

రెండూ భిన్నం



బానిసత్వం చట్టబద్ధం, వర్ణవివక్ష చట్టబద్ధం, ఆఖరికి వలసవాదం కూడా చట్టబద్ధం. కానీ ఒకటి చట్టబద్ధమైనంత మాత్రాన అది సరైందని కాదు. చట్టబద్ధత అనేది నైతికతకు సంబంధించినది కాదు. అది అధికారానికి సంబంధించినది.

– అడేమోలా, పాన్ ఆఫ్రికనిస్ట్

హిందీ సమస్య



కర్ణాటకలోని కన్నడిగులతో లేదు సమస్య : హిందీ అనేది జాతీయ భాష అనీ, దాన్ని అందరూ నేర్చుకోవాలనీ హిందీవాలాలు అనుకోవడంలో ఉంది. పైగా హిందీయేతరులు తక్కువ భారతీయులు కాబట్టి వాళ్లకు హిందీ 'నేర్పించాలి' అనుకోవడం మరొకటి.

– సంజయ్ హెగ్డే, న్యాయవాది

ఉద్యోగ దాత



ధోతి కట్టుకోవడం వల్ల బెంగళూరు మాల్‌లోకి ప్రవేశానికి నిరాకరించబడిన రైతు ఫకీరప్ప, "నన్ను ఆపిన సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగం పోతున్నదని తెలిసింది. దయచేసి ఆయన్ని ఉద్యోగం నుంచి తీసేయొద్దు. ఆయనకు కూడా కుటుంబం ఉంటుంది కదా" అన్నారు. అదీ ఒక రైతు హృదయం.

– ఆదర్శ్ హెగ్డే, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

కోరుకున్నది తినాలి...



మా ప్రాంతంలో 'హలాల్', 'ఝట్కా' మాంసం దుకాణాలు రెండూ ఉంటాయి. నేను ఎప్పుడూ ఝట్కా దుకాణానికి వెళ్లలేదు, భవిష్యత్‌లో వెళ్లే ఆలోచన లేదు. ఇది నా హక్కు. ఆ కారణంగా నన్నెవరూ తప్పుపట్టరు. అలాగే అందరికీ ఆ ఎంపిక అవకాశం ఉండాలి.

– జాఫర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

మాట్లాడలేరా?



78 రోజులు, 11 తీవ్రవాద దాడులు, పదులకొద్దీ పౌరులు, సైనికుల మరణాలు... అయినా నిశ్శబ్దం తాండవిస్తోంది. ఎవరికీ మాట్లాడటానికి మాటల్లేవు. చాలామంది 'నంబర్ వన్, నంబర్ టూ'లతో బాగుంటే చాలనుకుంటున్నారు. మిగతావాళ్లు ట్రోల్స్‌కు భయపడుతున్నారు. ఇదీ ఇప్పటి దేశ పరిస్థితి.

– వైభవ్ సింగ్, మీడియా పర్సనాలిటీ

ప్రదర్శన వద్దన్నప్పుడు...



'కావడ్ యాత్ర' (శివ భక్తుల యాత్ర) సందర్భంగా, ఉత్తరప్రదేశ్‌లో అధికారిక ఆజ్ఞల ప్రకారం, దుకాణ యజమానులు, చిన్న వీధి వర్తకులు తమ పేర్లను ప్రదర్శించాలని మీరు అడుగుతారు(ఇది మతానికి కోడ్). మీరే మళ్లీ హలాల్ ఆహారం, బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ గురించి అరుస్తారు. పూర్తిగా ద్వంద్వ ప్రమాణాలు.

– బర్ఖా దత్, జర్నలిస్ట్

ఏకీకృత నష్టం



మైక్రోసాఫ్ట్ 'గ్లిచ్' (చిన్న సమస్య) వల్ల ప్రపంచవ్యాప్తంగా బ్యాంకులు, ఆర్థిక మార్కెట్లు, విమానాలు ఆగిపోవాల్సి వచ్చింది. అందుకే ఉత్పత్తి సంబంధ వైవిధ్యం చాలా ముఖ్యం. ప్రపంచ వ్యాప్త ఏకీకృత అనుసంధానం అనేది చెడ్డ ఆలోచన. తక్కువ అనుసంధానిత వ్యవస్థ చూడటానికి అంత సమర్థంగా కనబడకపోవచ్చు, కానీ త్వరగా కోలుకుంటుంది.

– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

ఇన్ బాక్స్

పరిశోధనా ఫలితాలు అందరివి!

ఐక్యరాజ్యసమితి 2021లో చేసిన తీర్మానాన్ని అనుసరించి 2022 నుంచి జూలై 20వ తేదీన అంతర్జాతీయ చంద్ర దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుతున్నారు. అంతర్జాతీయ చంద్ర దినోత్సవం ముఖ్య ఉద్దేశం చంద్రునిపై పరిశోధనలు చేయడానికి ప్రపంచ దేశాలు అన్నీ సహకరించుకొని మానవాభివృద్ధికి పరిశోధనా ఫలితాలను వాడుకోవడం. మానవుడు ఈ భూమి మీద జన్మించిన నాటి నుండి ఖగోళ విషయాలు తెలుసుకోవడంలో ఆసక్తి చూపుతూ వచ్చాడు. 1969లో అమెరికా తన పౌరుణ్ణి చంద్రునిపై నడిపించడంతో చందమామపై పరిశోధనలు ఊపందుకున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికే అనేక మిషన్‌లను చంద్రుని పరిశోధనకు పంపాయి.

మన భారతదేశం చంద్రునిపై పరిశోధనలు చేయడానికి 'చంద్రయాన్' పేరుతో పలు ప్రయోగాలు చేస్తూ ముందుకు సాగుతున్నది. ముఖ్యంగా 2023 జూలై 3వ తేదీన 'చంద్రయాన్–3' ప్రయోగం విజయవంతం చేశారు. ఆగస్ట్ 23వ తేదీన చంద్రుని దక్షిణ ధృవంపై విక్రమ్ ల్యాండింగ్ సాఫ్టుగా జరగటం ద్వారా భారతదేశం చంద్రుని దక్షిణ ధృవంపై మొట్టమొదటగా ల్యాండ్ అయిన దేశంగా ఘన విజయం సొంతం చేసుకుంది. అందుకే ఈ సంవత్సరం 2024 ఆగస్ట్ 23 నుంచి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఆగస్ట్ 23న జరుపుకోవాలని నిర్ణయించారు. ఇంకా మరెన్నో ప్రయోగాలు చేయవలసిన ఆవశ్యకత ఉంది.

భవిష్యత్తులో 'మానవుని నివాసం చందమామే' అన్నట్లుగా పరిశోధనలు చేయవలసిన అవసరం ఉంది. ఇప్పటికే కొన్ని దేశాలు ఈ లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయి. మన దేశం విషయానికి వస్తే.. నిపుణులైన శాస్త్రవేత్తలు ఉన్నారు. అయితే మౌలిక సదుపాయాలు, వసతులు లేకపోవడంతో కొంత వెనకబడిపోతున్నాము. అయినా మన 'ఇస్రో' శాస్త్రవేత్తలు ఇతర దేశాల రాకెట్లను కూడా అంతరిక్షంలో ప్రవేశపెడుతున్నారు. మరికాస్త సహకారం ప్రభుత్వం అందిస్తే, మరెన్నో అద్భుతాలు సృష్టించడమే కాకుండా దేశ అభివృద్ధికి అవసరమైన విదేశీ మారక ద్రవ్యాన్ని భారీగా ఆర్జించి పెడతారు.

– ఐ. ప్రసాదరావు; ఉపాధ్యాయుడు, కాకినాడ
(నేడు ప్రపంచ చంద్ర దినోత్సవం)

పాముకాటు మరణాలను ఆపేదెన్నడు?

అభిప్రాయం



ముద్దం నరసింహ స్వామి

సాధారణంగా వర్షాకాలం ఎక్కువగా పాములు సంచరిస్తూ ఉంటాయి. ఆరుబయట గడ్డిదుబ్బులు, బహిరంగ ప్రదేశాల్లో మొక్కలు మొలిచి పాములకు అనువైన ఆవాసంగా మారే సీజన్ ఇది. ప్రతి ఏటా జూన్ నుంచి సెప్టెంబరు వరకు పాములు, ఇతర విష కీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. అందుకే ఈ కాలంలోనే ఎక్కువగా ప్రజలు... ముఖ్యంగా రైతులు పాముకాటుకు గురవుతూ ఉంటారు.

ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో పాము కాటు మరణాలు విపరీతంగా సంభవిస్తున్నాయి. గోదావరి వరదలు వచ్చిన భద్రాచలం వంటి ప్రాంతాల్లో వరద నీటితోపాటు ఇళ్లలోకి పాములు, తేళ్లు వచ్చి చేరడంతో పలువురు వాటి కాటుకు గురయిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాత్రి సమయాల్లో పొలాల్లో తిరిగేవారు, పొలంకాడే నిద్రించేవారు అధికంగా పాముకాటుకు గురవుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

భారతదేశంలో పాము కాటు మరణాలు భారీగా నమోదవుతున్నాయని ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఓ నివేదికలో వెల్లడించింది. 2000 సంవత్సరం నుండి 2019 సంవత్సరాల వరకూ గత 20 ఏళ్లలో ఏకంగా 12 లక్షల మంది పాముకాటుతో ప్రాణాలు వదిలారని ఈ సంస్థ నివేదిక పేర్కొంది. అంటే ప్రతి సంవత్సరం సరాసరి పాముకాటుకు 58 వేల మంది చనిపోతున్నారని నివేదిక పేర్కొంది. ఇంకా ప్రభుత్వ లెక్కల్లోకి రాని పాముకాటు మరణాలు దేశంలో పెద్ద ఎత్తున చోటు చేసుకుంటున్నట్టు కూడా చెప్పుకొచ్చింది. పెద్ద సంఖ్యలో పాముకాటు మరణాలు సంభవిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని తగ్గించి చూపించే ప్రయత్నం చేస్తున్నాయని డబ్ల్యూహెచ్ఓ ఆరోపించింది.

ఒక అంచనా ప్రకారం దేశంలో ఏటా సరాసరి 10 లక్షల మంది పాముకాటుకు గురవుతున్నారు. అయినప్పటికీ వారికి తగినంత పాము కాటు విరు



గుడు మందు దేశంలో తయారీలో లేదని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. భారతదేశంలో కట్ల పాము, తాచు పాము, రెండు రకాల రక్తపింజరల వల్ల ఎక్కువగా పాముకాటులు సంభవిస్తున్నాయనీ, మరణాలకు కూడా ఇవే కారణమనీ ఈ సంస్థ పేర్కొంది. అయితే ప్రస్తుతం పాముకాటుకు విరుగుడు యాంటీ వీనం తయారుచేస్తున్న కంపెనీలు నాలుగే ఉన్నాయనీ, వాటి తయారీ ప్రక్రియలో కూడా నాణ్యత ఉండడం లేదనీ డబ్ల్యూహెచ్ఓ అభిప్రాయం వ్యక్తం చేసింది. అంతేకాదు భారతదేశంలో అవసరానికి తగ్గట్టుగా మెడిసిన్ ఉత్పత్తి జరగడం లేదని పేర్కొంది. ఇక పాముకాటు మరణాలకు పదిరెట్లు ఎక్కువగా బాధితులు అంగవైకల్యానికి గురవుతున్నారని ఇది గుర్తించింది.

పాము కాటు కేసుల్లో 30 శాతం పూర్తిస్థాయిలో విషం మనిషి శరీరంలోకి వెళ్తుందని, ప్రపంచ సగటు కంటే ఇది ఎక్కువ అని పేర్కొంది. దీనికి ప్రధాన కారణం గ్రామాల నుంచి పాముకాటుకు గురైన వ్యక్తిని వెంటనే ఆసుపత్రికి తీసుకు వెళ్లే సౌకర్యాలు లేకపోవడం అని తెలిపింది.

ఇక ప్రాథమిక చికిత్సా కేంద్రాల్లోని సిబ్బందికి పాము కాటుకు చికిత్స చేయడంలో అనుభవం లేదని అంటోంది. అంతేకాదు, యాంటీ వీనమ్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నా ప్రాథమిక చికిత్సా కేంద్రాల్లో సరైన పరికరాలు లేకపోవడంతో, ఆ ఇంజెక్షన్లు పాడైపోతున్నాయని గుర్తించింది. మరికొన్ని ప్రైమరీ హెల్త్ సెంటర్లలో యాంటీ వీనమ్ ఇంజెక్షన్లు కాలం చెల్లిపోవడంతో బాధితులకు సరైన సమయంలో చికిత్స అందక పట్టణాలకు వెళ్లే ప్రయత్నంలో సమయం ఎక్కువ అవ్వడంతో, చాలా మంది దారి మధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నట్లు డబ్ల్యూహెచ్ఓ చెబుతోంది. ఈ పరిస్థితి ఆఫ్రికన్ దేశాలు, ఆస్ట్రేలియాతో పాటు మన దేశంలో కూడా నెలకొన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం తేల్చింది. ఇప్పటికైనా అధికారులు పాము కాటుకు సరైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రజలూ అప్రమత్తంగా వ్యవహరించాలి. మొత్తం మీద ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిన నివేదికను ప్రజలు, ప్రభుత్వాలు ఒక పాఠంగా స్వీకరించాలి.


వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ | 99498 39699

పవిత్రహృదయం

ఒక భక్తుడు అడవిలో కఠోర తపస్సు చేస్తున్నాడు. దేవుడు అతని ఎదుట ప్రత్యక్షమయ్యాడు. దేవుడి చేతిలో ఆయుధాలు ఉన్నాయి. 'భక్తా, నీ భక్తికి మెచ్చాను. నీకు ఏం కావాలో కోరుకో' అన్నాడు దేవుడు. ఆ మాటతో భక్తుడు 'దేవుడా, నా పురోగతికి అడ్డంకిగా ఉన్న శక్తులను నీ ఆయుధాలతో నాశనం చేసెయ్' అన్నాడు.

భగవంతుడు ఓ నవ్వు నవ్వాడు. 'దానికేం... అలాగే చేసేస్తాను' అని అంతర్ధానమయ్యాడు. కాసేపయింది. భగవంతుని చేతిలో నుంచి ఓ ఆయుధం వేగంగా వచ్చింది. వరం అడిగిన భక్తుడి రొమ్ము మీద దాడి చేసింది. అతను కింద పడిపోయాడు. 'ఇదేమిటీ దేవుడ్ని వరమడగటం తప్పయిపోయిందిగా' అనుకున్నాడు.

'అయ్యో దేవుడా, ఏమిటిది... నా పురోగతికి అడ్డంకిగా ఉన్న శత్రువును తొలగించమన్నాను. కానీ నువ్వు నీ ఆయుధంతో నాపైనే దాడి చేశావు. గురి తప్పిందా?' అని అడిగాడు భక్తుడు.



అప్పుడు దేవుడు మళ్ళీ ప్రత్యక్షమై 'భక్తా, నువ్వు కోరుకున్నట్టే నేను ఆయుధం సంధించాను. నేనేమీ నువ్వు అడిగింది మరచిపోలేదు. నీ మీదకు నేను ప్రయోగించిన ఆయుధం సరిగ్గానే వచ్చింద'న్నాడు.

'ఇతరులపై దాడి చేయాలి, పడగొట్టాలి, అంతమొందించాలి అని అనుకునే నీ అంతరంగమే నీకు ప్రధాన శత్రువు. అవే నీ ప్రగతికి అడ్డుకట్టలవుతున్నాయి. అందుకే నా ఆయుధం నిన్నే ఢీకొట్టింద'న్నాడు భగవంతుడు. ఆయన మాటలు లీలగా వినిపిస్తూ ఉండగానే భక్తుడి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

ఆధ్యాత్మిక మార్గంలో పయనించేవాడు తన భౌతికపరమైన అభివృద్ధికి సంబంధించిన యావ తగ్గించుకొని కైవల్య ప్రాప్తిపైనే దృష్టి పెట్టాలి. హృదయగత దౌర్బల్యాలను వదిలించుకోకుంటే దేవుడు వరమిచ్చినా దాన్ని వినియోగించుకోవడంలో విఫలమవ్వడం తథ్యం. హృదయాన్ని పవిత్రంగా ఉంచుకుంటే అంతా మేలే జరుగుతుంది.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

కొత్త భవనం మంజూరుకు నివేదిక

• హస్నాబాద్ స్కూల్‌ను సందర్శించిన 'కడా' అధికారి



స్కూల్‌ను పరిశీలిస్తున్న 'కడా' అధికారి వెంకట్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్

దుద్యాల్: 'స్కూల్ షాక్ కొడుతోంది'శీర్షికతో ఈనెల 16న 'సాక్షి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హస్నాబాద్ ఉన్నత పాఠశాలను శుక్రవారం కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) అధికారి వెంకట్‌రెడ్డి సందర్శించారు. ఎనభై ఏళ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరి వర్షాలకు తడిసిముద్దవుతోందని, కిటికీలు, బోర్డు, తలుపులను ముట్టుకుంటే విద్యుత్ షాక్ కొడుతోందని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు వివరించారు. వర్షం కురిసిన రోజు గదుల్లో నీళ్లు చేరి పాఠాలు కొనసాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. భవనం పూర్తిగా పాడవటంతో మరమ్మతులు చేసినా ప్రయోజనం ఉండదని తెలిపారు. నూతన భవనం మంజూరు కోసం సంబంధిత అధికారులతో సర్వే చేయించి, ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం నర్సింలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, జిల్లా కార్యదర్శి దౌల్తాబాద్ మల్లేశ్ ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాకే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

• ఆర్.కృష్ణయ్య



కాచిగూడ: తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను శుక్రవారం కలిసి బీసీల డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు జనగణన చేపట్టి బీసీల పంచాయతీ రిజర్వేషన్లను 20% నుంచి రిజర్వేషన్లను 42%కు పెంచాలని కోరారు. విద్య, ఉద్యోగ రిజర్వేషన్లలను 29% నుంచి బీసీల జనాభా ప్రాతిపదికన 50%కు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు వెంటనే అమలు చేయాలని కోరారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి!

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో శుక్రవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందినట్టు తెలిసింది. ఈ సందర్భంగా పెద్దఎత్తున మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యాన్ని పోలీసు బలగాలు స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ జిల్లా ఎలిమిడి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన బలగాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టినట్లు తెలిసింది. ఈక్రమంలో ఎలిమిడి అటవీ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం పోలీసు బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయని తెలిసింది. ఈమేరకు ఒక మావోయిస్టు మృతి చెందగా, ఘటనాస్థలి నుంచి భారీగా మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం, నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో శుక్రవారం రాత్రి వరకు ఎదురుకాల్పులు జరుగుతూనే ఉన్నాయని తెలుస్తున్నా.. పోలీసువర్గాలు మాత్రం ధ్రువీకరించలేదు.

యూట్యూబర్ ప్రణీత్‌పై గంజాయి కేసు



సాక్షి, హైదరాబాద్/సిటీ కోర్టులు: తండ్రీ కూతుళ్ల వీడియోపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసి అరెస్టయిన యూట్యూబర్ ప్రణీత్ హన్మంతుపై మరో కేసు నమోదైంది. సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ప్రణీత్‌ను ఇటీవల అరెస్టు చేయడం తెలిసిందే. ప్రణీత్ నుంచి సేకరించిన నమూనాల్లో ఆయన గంజాయి తీసుకున్న ఆనవాళ్లు ఉన్నాయంటూ ఫోరెన్సిక్ విభాగం పేర్కొన్న నివేదిక సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు చేరింది. దీంతో ప్రణీత్‌పై గతంలో నమోదు చేసిన ఐటీయాక్ట్ 67బి సెక్షన్‌తోపాటు పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్స్ యాక్ట్, 2012), ఎన్‌డీపీఎస్ యాక్ట్, బీఎన్ఎస్ సెక్షన్ల 79,294 ను అదనంగా నమోదు చేశారు. కాగా, చంచల్‌గూడ జైల్‌లో ఉన్న ప్రణీత్‌ను విచారించేందుకు మూడు రోజుల కస్టడీ కోరుతూ పోలీసులు నాంపల్లి కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయస్థానం ప్రణీత్ హన్మంతును మూడు రోజులు పోలీస్ కస్టడీకి తీసుకోవాలని ఆదేశించింది.



కాళేశ్వరం పుష్కరఘాట్‌ను తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి

నేడు మల్లన్న చెంతకు కృష్ణమ్మ

ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి జూరాలకు చేరుకున్న వరద ప్రవాహం

జూరాల విద్యుత్ కేంద్రం, ప్రాజెక్టు గేట్ల నుంచి నీరువిడుదల

సాక్షి, హైదరాబాద్/కాళేశ్వరం/నాగార్జునసాగర్: శ్రీశైలం మల్లన్న చెంతకు కృష్ణమ్మ శనివారం చేరుకోనుంది. కృష్ణా ప్రధాన పాయపై కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి విడుదల చేస్తున్న వరద ప్రవాహం శుక్రవారం జూరాల ప్రాజెక్టుకు చేరుకుంది. జూరాలలో విద్యుత్ కేంద్రం, గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శనివారం వరద ప్రవాహం శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుకుంటుంది. పశ్చిమ కనుమల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కృష్ణా ప్రధాన పాయలో శుక్రవారం వరద మరింత తగ్గింది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 43,478 క్యూసెక్కుల నీరు రాగా, గేట్లు ఎత్తి 65,480 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 65,801 క్యూసెక్కుల నీరు చేరగా, గేట్లు ఎత్తి 70,780 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఎగువ నుంచి వరద వస్తుండటంతో జూరాల ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి చేస్తూ.. గేట్లు ఎత్తి దిగువకు 34,818 క్యూసెక్కులను వదిలేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు ఎడమ కేంద్రంలో తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి చేస్తూ 7,063 క్యూసెక్కుల నీటిని దిగువకు తరలిస్తుండటంతో నీటి నిల్వ 33.11 టీఎంసీలకు తగ్గింది. నాగార్జునసాగర్‌లోకి వరద ప్రవాహం చేరడం లేదు. సాగర్ కుడి కాలువ, ఏఎమ్మార్పీ ద్వారా 8,165 క్యూసెక్కులను విడుదల చేస్తుండటంతో నీటి నిల్వ 123.5 టీఎంసీలకు తగ్గింది.

నేడు తుంగభద్ర డ్యామ్‌లోకి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం


కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో వరద ఉధృతి మరింత పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 1,08,270 క్యూసెక్కుల రాకతో నీటి నిల్వ 58.67 టీఎంసీలకు చేరుకుంది. తుంగభద్ర బేసిన్ పరిధిలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శనివారం తుంగభద్ర డ్యామ్‌లోకి వరద ఉధృతి మరింత పెరుగుతుందని సీడబ్ల్యూసీ) అంచనా వేసింది. వరద ఇలానే కొనసాగితే నాలుగు రోజుల్లో తుంగభద్ర ప్రాజెక్టు నిండుతుంది.

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల

నాగార్జునసాగర్ జలాశయం నుంచి ఎడమకాల్వ ద్వారా అధికారులు శుక్రవారం 4వేల క్యూసెక్కులకు నీటిని విడుదల చేశారు. సాగర్ కుడి కాల్వ ద్వారా ఏపీలోని వివిధ జిల్లాలకు గత రెండు రోజుల నుంచి నిత్యం 5,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

కాళేశ్వరం వద్ద 8.500 మీటర్ల ఎత్తులో నీటిప్రవాహం

తెలంగాణలోని గోదావరి, మహారాష్ట్రలో ప్రాణహిత నదికి వరద తాకిడి పెరిగింది. అన్నారం(సరస్వతీ) బరాజ్ వద్ద మానేరు వాగు నుంచి 15 వేల క్యూసెక్కుల వరద రాగా, బరాజ్‌లోని మొత్తం 66 గేట్లు పూర్తిగా పైకి ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఆ వరద నీరు దిగువన కాళేశ్వరం వద్ద కలుస్తోంది. గడ్చిరోలి జిల్లా మీదుగా ప్రాణహిత నదికి వరద పోటెత్తింది. ఆ నీరంతా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద కలుస్తుండడంతో పుష్కరఘాట్లను తాకుతూ వరద దిగువకు తరలిపోతోంది. పుష్కర ఘాట్ల వద్ద 8.500 మీటర్లు ఎత్తులో నీటి ప్రవాహం కొనసాగుతోంది. అక్కడినుంచి మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌కు వరద తాకిడి పెరుగుతోంది. బరాజ్ వద్ద 3.73 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతోంది. బరాజ్‌లో మొత్తం 85 గేట్లు పైకి ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్టు దిగువకు తరలిస్తున్నారు. దిగువన తుపాకులగూడెం బరాజ్‌లోకి 3,75,430 క్యూసెక్కులు చేరుతుండగా.. అంతే స్థాయిలో దిగువకు వదిలారు. దుమ్ముగూడెం(సీతమ్మసాగర్)లోకి 3,47,511 క్యూసెక్కులు చేరుతుండగా అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. దాంతో భద్రాచలం వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. భద్రాచలం వద్దకు శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 3.75 లక్షల క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి మట్టం(సముద్ర మట్టానికి) 40.2 మీటర్లకు వరద చేరింది.



సాగర్ ఎడమ కాల్వకు విడుదలవుతున్న నీరు

కురుస్తున్న రామప్ప దేవాలయం

• నాలుగేళ్ల క్రితమే మరమ్మతులు



లీకేజీతో ఆలయంలో పడుతున్న వర్షపు నీరు. (ఇన్‌సెట్‌లో) స్తంభాల నుంచి కురుస్తున్న వర్షపు నీరు

వెంకటాపురం(ఎం): ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం వర్షానికి కురుస్తోంది. నాలుగైదు రోజులుగా పడుతున్న వర్షాలతో రామప్ప ఆలయానికి ఈశాన్యం వైపున ఉన్న రెండు పిల్లర్ల మీదుగా వర్షపు నీరు ఆలయంలోకి చేరుతోంది. 2018లో కురిసిన భారీ వర్షాలకు ఆలయ పైకప్పుకు పలుచోట్ల లీకేజీలు ఏర్పడి దేవాలయం వర్షపునీటితో బురదమయంగా మారింది. దీంతో కేంద్ర పురావస్తుశాఖ అధికారులు ఆలయ పైకప్పుకు మరమ్మతులు చేపట్టారు. అయినా, లీకేజీ సమస్య అదేవిధంగా ఉండడంతో 2020లో తిరిగి పైకప్పుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టారు. ఆలయ పైకప్పుపై జాలీ ఏర్పాటు చేసి దానిపై డంగు సున్నం, కరక్కాయ, నల్లబెల్లం, ఇటుక పొడి, ఇసుక కలిపిన మిశ్రమాన్ని (పీఓపీ) వేసి లీకేజీలు పూడ్చివేశారు. నాలుగేళ్ల తర్వాత మళ్లీ రామప్ప ఆలయం కురుస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఆలయానికి పైకప్పు కింద ఉన్న రెండు స్టోన్‌ల మధ్య గ్యాప్ వచ్చిందని, అందులోనుంచి వర్షపు నీరు పిల్లర్ల ద్వారా ఆలయంలోకి వస్తుందని అధికారులు చెప్పారు. గ్యాప్‌ను పూర్తి చేసేందుకు గత ఏప్రిల్‌లో టెండర్లు పిలవగా ఎవరూ రాలేదన్నారు.

రెండు రోజులు వర్షాలే.. వర్షాలు

• పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం
• ఐదు జిల్లాలకు రెడ్ అలర్ట్

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో శుక్రవారం ఉదయం వాయుగుండం ఏర్పడింది. ఉత్తర బంగాళాఖాతంలో గురువారం ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడి గురువారం రాత్రి తీవ్ర అల్పపీడనంగా మారి శుక్రవారం ఉదయానికి వాయుగుండంగా మారినట్టు వాతావరణ శాఖ తెలిపింది. ఇది సముద్రమట్టం నుంచి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్నట్టు వాతావరణ శాఖ అంచనా వేసింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు, కొన్నిచోట్ల అతి భారీ వర్షాలు, మరికొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ వివరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ, అత్యంత భారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందంటూ రెడ్‌అలర్ట్ జారీ చేసింది. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ... మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ ఇచ్చింది. శుక్రవారం రాష్ట్రంలో సగటున 2.77 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నైరుతి సీజన్‌లో శుక్రవారం నాటికి రాష్ట్రంలో సగటున 25.76 సెంటీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. 31.32 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ములుగు జిల్లాలో ఒకరి గల్లంతు

ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం తానిపర్తికి చెందిన బానారి రాజు (45) గోదావరిలో గల్లంతయ్యాడు. చేపల వేటకని గురువారం వెళ్లిన రాజు శుక్రవారం ఉదయం వరకు రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున మహదేవపూర్ మండలం అన్నారం వైపు నుంచి దామెరకుంట వైపుగా ట్రాలీ ఆటో గుండ్రాత్‌పల్లి సమీపంలో గల అలుగువాగులో కొట్టుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తమై ఆటో ఎక్కి అరవడంతో గమనించిన స్థానికులు రక్షించారు.

వరదలపై గంటకోసారి సమీక్ష

• చీఫ్ ఇంజనీర్లు హెడ్‌క్వార్టర్ వీడొద్దు
• నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో చెరువులు, భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల్లోకి వచ్చే వరదను గంటకోసారి పర్యవేక్షించాలని నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆశ్వారావుపేటలోని పెద్దవాగు ప్రాజెక్టుకు గండ్లు పడటం దురదృష్టకరమన్నారు. ప్రాజెక్టుల నుంచి వరదను వదిలే క్రమంలో దిగువ ప్రాంతాల్లో తగిన హెచ్చరికలు జారీ చేయాలని, దీనికోసం స్టాండింగ్ ఆపరేషన్ ప్రొటోకాల్ పాటించాలన్నారు. కలెక్టర్లు, ఎస్పీల సహకారం తీసుకోవాలని సూచించారు. ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చూసుకోవాలన్నారు. చెరువులు, ప్రాజెక్టులు, కాలువలు దెబ్బతింటే తక్షణ మరమ్మతులు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలోని ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈ, ఏఈలు అందుబాటులో ఉండాలన్నారు. ఏమైనా అత్యవసర పరిస్థితులు ఉత్పన్నమైతే ఈఎన్సీ(జనరల్)తో పాటు నీటిపారుదలశాఖ కార్యదర్శికి వాట్సాప్ లేదా ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగంతో కలిసి చర్యలు చేపట్టాలన్నారు. ఇక చీఫ్ ఇంజనీర్లు ఎవరూ కూడా హెడ్‌క్వార్టర్ వీడొద్దని చెప్పారు.

అప్రమత్తంగా ఉండండి: నీటిపారుదల ఈఎన్సీ అనిల్‌కుమార్

ముందు జాగ్రత్త చర్యలపై శుక్రవారం నీటిపారుదలశాఖ ఇంజనీర్ ఇన్‌చీఫ్ అనిల్‌కుమార్ ఆ శాఖ ఉన్నతాధికారులతో టెలి కాన్ఫరెన్స్‌లు నిర్వహించారు. విపత్తు నిర్వహణ బృందాలతో సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, రిజర్వాయర్లు, కాల్వలు, నీటి మట్టాలను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలించాలని, స్పిల్‌వేలు, వరద గేట్లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో చెక్ చేయాలని సూచించారు. నీటిమట్టాలు, ప్రవాహ ఉధృతిపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొని, కంట్రోల్‌రూంకు తెలియజేయాలన్నారు.

ప్రజాప్రతినిధులంతా ఆయిల్‌పాం సాగు చేయాలి

• వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్/ సాక్షిప్రతినిధి, కరీంనగర్/సాక్షి,పెద్దపల్లి: భూమి ఉన్న ప్రజాప్రతినిధులంతా తప్పనిసరిగా ఆయిల్‌పాం పంట సాగుచేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి శుక్రవారం పెద్దపల్లి జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్‌లో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం తుమ్మల మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగుతో రైతులు ఆర్థికంగా బలపడతారన్నారు. మన దేశానికి 100 లక్షల మెట్రిక్ టన్నుల ఆయిల్‌పాం అవసరముండగా, మన దగ్గర ప్రస్తుతం 3.96 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే పండుతుందన్నారు. ఇండోనేసియా, మలేసియాలాంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు.

అతిత్వరలో పంటల బీమా: రైతు భరోసాలో తుమ్మల

అతి త్వరలోనే పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. శుక్రవారం కరీంనగర్‌లోని వీకన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతు భరోసా ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా మాట్లాడారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని పనులను తాము7 నెలల్లో చేసి చూపించామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అర్హత ఉన్న రైతులకు అందరికీ రైతు భరోసా అందుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఐటీ రిటర్న్ చేసే రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.



పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల. చిత్రంలో శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు

మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గం

రాష్ట్రంలోని పలు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన పాలక వర్గాన్ని నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 19 అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాన్ని నియమించామని, మిగిలిన మార్కెట్ కమిటీలకు కూడా కొత్త మార్కెట్ కమిటీలను నియమిస్తామని తెలిపారు.

కమిటీ	చైర్మన్	వైస్‌చైర్మన్
చేర్యాల	నల్లనగుల్ల శ్వేత	కమిడి జీవన్‌రెడ్డి
వనపర్తి రోడ్డు	పల్లెపాగ ప్రశాంత్	తిరుపతిరెడ్డి
దేవరకద్ర	ఎం.కటలప్ప	హన్మంత్‌రెడ్డి
చొప్పదండి	కొత్తూరి మహేష్	మునిగాల రాజేందర్

కోలుకున్న ఆర్.నారాయణమూర్తి

• నిమ్స్ నుంచి డిశ్చార్జి



లక్డీకాపూల్ (హైదరాబాద్): అస్వస్థతకు గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆర్.నారాయణమూర్తి డిశ్చార్జి అయ్యారు. కడుపునొప్పితో బాధపడుతున్న ఆయన మూడు రోజులుగా నిమ్స్ మెట్టు రంగారెడ్డి బ్లాక్‌లో చికిత్స పొందడం తెలిసిందే. ఆయన ఆరోగ్యం మెరుగుపడటంతో శుక్రవారం వైద్యులు డిశ్చార్జి చేశారు.

రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో జనరల్ డైరీ పెట్టాలి

• ప్రజల వివరాలన్నీ అందులో నమోదు చేయాలి
• రిజిస్ట్రేషన్ ఉన్నతాధికారులకు హైకోర్టు ఆదేశం
• అధికారులు, ప్రజలకు మార్గదర్శకాలు జారీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జనరల్ డైరీ పెట్టాలి.. అందులో రిజిస్ట్రేషన్‌కు వచ్చే ప్రజలు(కక్షిదారులు) వివరాలన్నీ పేర్కొనాలని హైకోర్టు అధికారులను ఆదేశించింది. ఎందుకు వచ్చారు.. ఎప్పుడు వచ్చారు.. లాంటి వివరాలు నమోదు చేయాలని స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్ సమయంలో వస్తున్న అవాంతరాలను తగ్గించేందుకు అధికారులు, ప్రజలకు హైకోర్టు పలు మార్గదర్శకాలు జారీ చేసింది. రిజిస్ట్రేషన్ అధికారులు ఈ మార్గదర్శకాలు అమలు చేసేలా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ చర్యలు తీసుకోవాలి. ఈ ఆర్డర్ కాపీని సంబంధిత అధికారులకు చేరేలా చూడాలని రిజిస్ట్రీని ఆదేశించింది. కోర్టు వివాదం పరిష్కారమైన తర్వాత కూడా రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన అనంత రామేశ్వరిదేవితో పాటు మరికొందరు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ ఎన్‌వీ.శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు. ఒకరిద్దరు అధికారులు కాదు.. అసలు రెవెన్యూ వ్యవస్థలోనే లోపాలున్నాయని అభిప్రాయపడ్డారు. కోర్టులో విచారణ ముగిసినా మళ్లీ ఆదేశాలు తీసుకురావాలంటూ వేధించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పేదవారు కొద్దోగొప్పో భూమి కొనుగోలు చేద్దామని అనుకుంటే రిజిస్ట్రేషన్, జీఎస్టీ, స్టాంపు డ్యూటీ వసూలు చేస్తున్నారని.. ఇప్పుడు బాధితులకు కోర్టు ఫీజులు అదనంగా మారాయని స్పష్టం చేసింది. ఎలాంటి నిషేధ ఉత్తర్వులు లేకున్నా పిటిషనర్లకు ఎందుకు రిజిస్ట్రేషన్ చేయలేదని పెద్ద అంబర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్‌పై అసంతృప్తి వ్యక్తం చేసింది.



అధికారులకు మార్గదర్శకాలు

• ఏదైనా ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం అధికారులను ప్రజలు సంప్రదించినప్పుడు రిజిస్ట్రేషన్ చట్టం-1908, ఇండియన్ స్టాంప్ ప్రకారం అన్ని చట్టప్రకారం ఉంటే వారంలోగా రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేయాలి. లేనిపక్షంలో తిరస్కరించాలి. ఇదే విషయాన్ని వారికి తెలియజేయాలి. తిరస్కరణ మౌఖికంగా ఉండకూడదు. లిఖితపూర్వక పత్రం ఇవ్వాలి. • ఒకవేళ రిజిస్ట్రేషన్ పత్రాలు తిరస్కరిస్తే అప్పటికే చెల్లించిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీల వాపసు ప్రక్రియ సరళీకృతం చేయాలి. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలను చెల్లించే ముందు ప్రజలు వాపసు విధానాన్ని కూడా తెలుసుకోవాలి. • కోర్టు ఆదేశాలు లేనప్పుడు, ఉత్తర్వులు ఎత్తివేసినప్పుడు, అప్పీల్ పెండింగ్ లేనప్పుడు.. మళ్లీ దానిపై న్యాయస్థానం ఆదేశాలు కావాలని ప్రజలను ఒత్తిడి చేయకుండా సబ్ రిజిస్ట్రార్‌లకు ఉన్నతాధికారులు సర్క్యులర్లు, నోటిఫికేషన్‌లు జారీ చేయాలి. • తీర్పు వెల్లడించిన, కొట్టివేసిన పిటిషన్లలోని ఆస్తుల రిజిస్ట్రేషన్లను రిజిస్టరింగ్ అథారిటీలు తిరస్కరించకూడదు. • ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక వాచ్ రిజిస్టర్/జనరల్ డైరీ నిర్వహించాలి. ప్రజల తమ పత్రాల రిజిస్ట్రేషన్‌కు వచ్చిన తేదీ, సమయాన్ని అందులో పేర్కొనాలి. వారు ఎందుకు వచ్చారో కూడా నమోదు చేయాలి. అవకతవకలు, మధ్యవర్తుల జోక్యం, తప్పులు జరగకుండా ఇది తోడ్పడుతుంది. • కోర్టు ఉత్తర్వుల కోసం పట్టుబట్టకుండా సబ్ రిజిస్ట్రార్, మండల్ రెవెన్యూ అధికారి ఉత్తర్వులు జారీ చేయాలి. • వింజమూరి రాజగోపాలాచారి వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఇన్వెక్టా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వర్సెస్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసుల్లో న్యాయస్థానాలు ఇచ్చిన మార్గదర్శకాలను రిజిస్టరింగ్ అధికారులు పాటించాలి.

ప్రజల(కక్షిదారులు)కు సూచనలు..

• సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉండే వాచ్ రిజిస్టర్ లేదా జనరల్ డైరీలో తమ వివరాలు నమోదు చేయాలి. అసలు కక్షిదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయానికే రాలేదు.. రిజిస్ట్రేషన్ కోసం పత్రాలు సమర్పించలేదని భవిష్యత్‌లో అధికారులు తప్పించుకోకుండా ఇది ఉపయోగపడుతుంది. • రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించే ముందు పార్టీలు ప్రతిపాదిత ఆస్తి నిషేధిత జాబితాలో లేదని నిర్ధారించుకోవాలి. • ఒకవేళ నిషేధిత జాబితాలో ఉంటే చట్టం ప్రకారం ఆ జాబితా నుంచి ఆస్తిని తొలగించడానికి తగిన చర్యలు తీసుకోవాలి. నిషేధిత జాబితాలో ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయడం లేదంటూ నేరుగా కోర్టును ఆశ్రయించకూడదు.

• రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సమర్పించిన పత్రాలు ఆ చట్టంలోని నిబంధనల మేరకు ఉండేలా చూసుకోవాలి.



బగ్ దెబ్బకు 'విండోస్' క్లోజ్!

విశ్వవ్యాప్తంగా స్తంభించిన మైక్రోసాఫ్ట్ సేవలు

- విమానయాన, బ్యాంకింగ్, మీడియా సంస్థల సేవల్లో తీవ్ర అంతరాయం
- ఇబ్బందులు పడ్డ కోట్లాది మంది యూజర్లు, ప్రయాణికులు
- 'క్రౌడ్‌స్ట్రయిక్' అప్‌డేట్ వల్లే ఇదంతా: మైక్రోసాఫ్ట్ వివరణ

వాషింగ్టన్/వెల్లింగ్టన్/న్యూఢిల్లీ/ఫ్రాంక్‌ఫర్ట్: టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో ఒక చిన్న అప్‌డేట్ పెద్ద సమస్యను సృష్టించింది. విండోస్‌కు సెక్యూరిటీ సేవలు అందించే 'క్రౌడ్‌స్ట్రయిక్' సైబర్ సెక్యూరిటీ సంస్థ చేసిన ఫాల్కన్ సెన్సార్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లో లోపం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్స్‌తో పనిచేసే కంప్యూటర్లలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పలు విమానయాన, బ్యాంకింగ్, మీడియా సంస్థలుసహా రైల్వే, టీవీ, రేడియో, ఆస్పత్రి సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. దీంతో కోట్లాది మంది జనం, యూజర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మైక్రోసాఫ్ట్ 365 యాప్స్, సర్వీసెస్ స్తంభించడంతో ఈ సమస్య తలెత్తింది. అయితే అవిశ్రాంతంగా శ్రమించి సమస్యను దాదాపు పరిష్కరించామని మైక్రోసాఫ్ట్ వెల్లడించింది. ''ఇది భద్రతాలోపం, సైబర్ దాడి కాదు. మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తప్పుడు అప్‌డేట్‌ను రన్ చేయడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందని గుర్తించాం. సమస్యను 'ఫిక్స్' చేసేందుకు ప్రయత్నిస్తున్నాం'' అని క్రౌడ్‌స్ట్రయిక్ సీఈఓ జార్జ్ కుర్జ్ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు.

ఆగిన సేవలు.. మొదలైన కష్టాలు


అమెరికాలోని బాల్టిమోర్ ఎయిర్‌పోర్టులో

విమానయాన సంస్థలు తమ కంప్యూటర్లు/పీసీ స్క్రీన్‌లను యాక్సెస్‌చేయలేకపోవడంతో ప్రయాణికులు తమ టికెట్ల బుకింగ్/చెక్ ఇన్ సేవలను పొందలేకపోయారు. విమానాశ్రయాల్లో లక్షలాది మంది ప్రయాణికులు కౌంటర్‌ల వద్ద చాంతాడంత లైన్లలో బారులుతీరారు. అమెరికా, భారత్, బ్రిటన్, న్యూజిలాండ్, హాంకాంగ్, జర్మనీ, కెన్యా, స్విట్జర్లాండ్, ఇటలీ, ఆ స్ట్రేలియాలోని విమానయాన సంస్థలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. శుక్రవారం గంటల తరబడి విమానాలు ఆలస్యం/క్యాన్సిల్ కావడంతో ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌లోనే నిద్రించారు. అమెరికాలో యునైటెడ్ ఎయిర్‌లైన్స్, అమెరికన్ ఎయిర్‌లైన్స్, డెల్టా, అలీజియంట్ విమానయాన సంస్థలు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నాయి. వారాంతం ఆనందంగా గడుపుదామనుకున్న శుక్రవారం పలు దేశాల ప్రజలను చేదు అనుభవంగా మిగిలిపోయింది. భారత్, హాంకాంగ్, థాయిలాండ్ దేశాల విమానయాన సంస్థలు మ్యాన్యువల్‌గా బోర్డింగ్ పాస్‌లు ఇచ్చి సమస్యను ఒకింత పరిష్కరించుకున్నాయి.

రైల్వే, టెలివిజన్ సేవలకూ అంతరాయం

బ్రిటన్‌లో రైల్వే, టెలివిజన్ స్టేషన్లూ కంప్యూటర్ సమస్యలతో ఇబ్బందులు పడ్డాయి. తమ దేశంలోని పోస్టాఫీసులు, ఆస్పత్రుల సేవలు ఆగిపోయాయని ఇజ్రాయెల్, బ్రిటన్, జర్మనీ తెలిపాయి. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లోని రెగ్యులేటరీ న్యూస్ సర్వీస్ అనౌన్స్‌మెంట్స్, నేషనల్ హెల్త్ సర్వీస్‌లు ఆఫ్‌లైన్‌లోకి వెళ్లిపోయాయని బ్రిటన్ ప్రకటించింది. ఆస్ట్రేలియాలో ఏబీసీ, స్కైన్యూస్ వంటి టీవీ, రేడియో చానళ్ల ప్రసారాలు ఆగిపోయాయి.

బ్యాంకింగ్ సేవలకూ దెబ్బ

తమ దేశంలో దేశవ్యాప్తంగా ప్రధాన బ్యాంక్ సేవలు స్తంభించిపోయాయని దక్షిణాఫ్రికా తెలిపింది. బ్యాంక్‌ల వద్దే కాదు, గ్యాస్‌స్టేషన్లు, సరకుల దుకాణాల వద్ద క్రెడిట్, డెబిట్ కార్డులు పనిచేయడం మానేశాయి. ఏఎస్‌బీ, కివిబ్యాంక్ సేవలు ఆగిపోయాయని న్యూజిలాండ్ తెలిపింది. పేమెంట్ వ్యవస్థలు, వెబ్‌సైట్లు, యాప్స్ పనిచేయడం లేదని న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా తెలిపాయి.

భారత్‌లో పరిస్థితి ఏంటి?


చేతితో రాసిచ్చిన బోర్డింగ్ పాస్

భారత్‌లో ఇండిగో, స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా, ఆకాశ ఎయిర్ విమానయాన సంస్థలు ఆన్‌లైన్ చెక్ ఇన్ సమస్యలను ఎదుర్కొన్నాయి. చాలా ఎయిర్‌పోర్ట్‌ల వద్ద పలు విమానాల సర్వీస్‌లు రద్దయ్యాయి. దాదాపు 200 ఇండిగో విమానసర్వీస్‌లు రద్దయ్యాయి. ఆఫ్‌లైన్‌లో మ్యాన్యువల్‌గా లగేజ్ 'చెక్ ఇన్', బోర్డింగ్ పాస్‌లు ఇచ్చి సమస్యను పరిష్కరించారు. లగేజీ చెక్ చేసి బోర్డింగ్ పాస్ రాసివ్వడానికి ఒక్కో వ్యక్తికి 40 నిమిషాలు పట్టిందని కొందరు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే 29 విమానాలు రద్దయ్యాయి.ఇందులో ముంబై, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, కోల్‌కత్తాతో పాటు వివిధ నగరాలకు రాకపోకలు సాగించే విమానాలూ ఉన్నాయి. కొన్ని విమానాలు 1-2 గంటలు ఆలస్యంగా నడిచాయి. విమానాల రద్దయినప్పటికి విమాయనయాన సంస్థలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రకటనలు చేయకపోవడంతో ప్రయాణికులు వెనుదిరిగారు. బీఎస్‌ఈ, ఎన్ఎస్ఈ వంటి స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లు, బ్రోకరేజ్ సంస్థలు, బ్యాంక్‌ల వంటి ఆర్థికరంగ సంస్థల కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం పడలేదు. దేశంలో నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్(ఎన్ఐసీ) నెట్‌వర్క్‌లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదని కేంద్ర ఐటీ మంత్రి ప్రకటించారు.

పేలిన జోకులు

కంప్యూటర్లు మొరాయించడంపై సామాజిక మాధ్యమాల్లో జోకులు పేలాయి. శుక్రవారం ఉదయం నుంచే ఐటీ ఉద్యోగులకు వారాంతం మొదలైందని నెటిజన్లు వ్యాఖ్యానించారు. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మాస్క్ మైక్రోసాఫ్ట్ సంస్థ పెద్ద తల నొప్పి సంస్థ అంటూ కొత్త భాష్యం చెప్పారు. '' ఇది మైక్రో'సాఫ్ట్' కాదు. మాక్రో' హార్డ్. మైక్రోసాఫ్ట్ వాళ్ల అన్ని సర్వీస్‌లు ఆగిపోయాయి ఒక్క నా 'ఎక్స్' తప్ప' అని తన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వ్యంగ్యంగా పోస్ట్‌చేశారు.

ఏమిటీ బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్?:

కంప్యూటర్లపై బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్ దర్శనమిచ్చింది. ఈ ఎర్రర్ కనిపించాక కంప్యూటర్ రీస్టార్ట్ అవడంగానీ షట్‌డౌన్ అవడంగానీ జరుగుతోంది. విండోస్ అప్‌డేట్ అడిగితే చేయొద్దని, పొరపాటున చేస్తే ఆపరేటింగ్ సిస్టమ్‌ను తొలగించి మళ్లీ ఇన్‌స్టాల్ చేయాల్సిన పరిస్థితి వస్తుందని నిపుణులు తెలిపారు. మైక్రోసాఫ్ట్ సంస్థ ఈ సమస్యకు పరిష్కారం కనుక్కున్నాకే కంప్యూటర్లను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఇంటర్నెట్ ఉల్లంఘనలు, హ్యాకింగ్‌ను రియల్‌టైమ్‌లో అడ్డుకునేందుకు క్రౌడ్‌స్ట్రయిక్ సంస్థ తమ సైబర్‌సెక్యూరిటీ సేవలను మైక్రోసాఫ్ట్‌కు ఇస్తోంది. సొంతంగా మ్యాన్యువల్‌గా సమస్య పరిష్కారానికి ప్రయత్నించేవాళ్లకు క్రౌడ్‌స్ట్రయిక్ ఒక చిట్కా చెప్పింది. విండోస్10లో బ్లూస్క్రీన్ ఎర్రర్‌ను ఎలా ట్రబుల్ షూట్ చేయాలో వివరించింది. సిస్టమ్‌ను సేఫ్ మోడ్‌లో లేదా విండోస్ రికవరీ ఎన్విరోన్‌మెంట్‌లో ఓపెన్ చేయాలి. తర్వాత C:/W indowsystem32/d rivers/C rowdStrikeలోకి వెళ్లాలి. అందులో C-00000291•. sys అనే ఫైల్‌ను డిలీట్ చేయాలి. తర్వాత సాధారణంగా సిస్టమ్‌ను బూట్ చేస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

దేవుడు నా వైపే.. గెలుపు నాదే

రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ధీమా

తూటాల దాడి జరిగినా నా సంకల్పం చెక్కుచెదరలేదు	అధికారం అప్పగించండి మిమ్మల్ని తలెత్తుకొనేలా చేస్తా

- అమెరికాను సురక్షితమైన, బలమైన దేశంగా మార్చడమే ధ్యేయం
- మిల్వాకీలో రిపబ్లికన్ జాతీయ సదస్సులో ట్రంప్ ప్రసంగం


గురువారం రాత్రి రిపబ్లికన్ కన్వెన్షన్‌లో ప్రసంగిస్తున్న డొనాల్డ్ ట్రంప్

మిల్వాకీ: హత్యాయత్నం నుంచి తృటిలో తప్పించుకున్న అమెరికా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్(78) సమరోత్సాహంతో ముందుకు సాగుతున్నారు. భగవంతుడు తనవైపు ఉండడం వల్లే పెద్ద ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డానని చెప్పారు. భగవంతుడి దయతోనే మళ్లీ జనం ముందుకు వచ్చానని పేర్కొన్నారు. మరో నాలుగు నెలల్లో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు. హత్యాయత్నం ఘటన తర్వాత తొలిసారిగా మిల్వాకీలో గురువారం రాత్రి జరిగిన రిపబ్లికన్ పార్టీ జాతీయ సదస్సులో ట్రంప్ భావోద్వేగంతో ప్రసంగించారు. రిపబ్లికన్ అభ్యర్థిగా తన నామినేషన్‌ను లాంఛనంగా ఆమోదించారు. తూటాల దాడి జరిగినా తన సంకల్పం చెక్కుచెదరలేదని, అమెరికా ప్రజలకు సేవ చేసేందుకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. దేశాన్ని కాపాడాలన్న నా తపనను ఏ ప్రమాదం, ఏ అవరోధం అడ్డుకోలేవని తేల్చిచెప్పారు. హత్యాయత్నం తర్వాత తనపై ప్రేమాభిమానాలు కురిపించి, మద్దతు ప్రకటించిన ప్రజలకు ట్రంప్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆత్మ విశ్వాసం, ఆశ, బలం అనే సందేశాన్ని మోసుకొని ఈరోజు అమెరికన్ల ముందుకు సగర్వంగా వచ్చానని అన్నారు. పార్టీ సదస్సులో ట్రంప్ ఇంకా ఏం మాట్లాడారంటే...

నూతన యుగానికి ఆరంభం

''మరో నాలుగు నెలల్లో మనం అద్భుతమైన విజయం సొంతం చేసుకోబోతున్నాం. అమెరికా చరిత్రలో నాలుగు అతిగొప్ప సంవత్సరాలకు శ్రీకారం చుట్టబోతున్నాం. మతం, రంగు, జాతితో సంబంధం లేకుండా ప్రజలందరికీ భద్రత, సౌభాగ్యం, స్వేచ్ఛ కల్పించే నూతన యుగాన్ని మనమంతా కలిసికట్టుగా ఆరంభిద్దాం. మన సమాజంలో ప్రజల మధ్య అడ్డుగోలకు తావు లేకుండా చేద్దాం. అమెరికన్లుగా మనది ఒకేబాట, ఒకేమాట. మనం ఐక్యమత్యంగా ఉండాలి. అందరం కలిసి పైకి ఎదగాలి. కలిసి ఉండలేకపోతే నష్టపోతాం. సగం అమెరికాకు కాదు, మొత్తం అమెరికాకు అధ్యక్షుడిగా ఎన్నికయ్యేందుకు బరిలో నిల్చున్నా.

మనం ఒకే దేశం బిడ్డలం

నాపై హత్యాయత్నం జరిగిన సంగతి అందరికీ తెలుసు. అసలేం జరిగిందని చాలామంది అడుగుతున్నారు. నా శరీరం నుంచి అంగుళంలో మూడోవంతు దూరంలో తుపాకీ తూటా దూసుకెళ్లింది. నా తల రక్తంతో తడిసిపోయింది. దేవుడి దయతో ప్రాణాలతో బయటపడ్డా. ఈ విషయం మరోసారి నేను పంచుకోలేను. ఎందుకంటే అది చాలా బాధాకరమైన అనుభవం. మాటల్లో చెప్పలేనిది. నాపై క్రూరమైన దాడి జరిగిన తర్వాత మన ఐక్యత మరింత పెరిగింది. మన సంకల్పం, ఉద్దేశం ఏమాత్రం మారలేదు. అమెరికాను మరోసారి గెలిపించాలి. అమెరికాను మళ్లీ సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన గొప్పదేశంగా మార్చాలి. మనం ఒకే దేశం బిడ్డలం. రాజకీయపరమైన అంశాలు మన మధ్య విభజన రేఖలు గీయకూడదు.

ఈ ఎన్నికలు అత్యంత కీలకం

యావత్తు దేశానికి ఒక దార్శనికతను నిర్దేశించడానికి ఇక్కడికి వచ్చా. ఈ సందర్భంగా దేశంలో ప్రతి పౌరుడికీ స్నేహ హస్తం అందిస్తున్నా. వారికి విధేయత ప్రకటిస్తున్నా. ప్రపంచం ఎన్నడూ చూడని విధంగా అమెరికాను నూతన శిఖరాల వైపు నడిపిద్దాం. నా నాయకత్వంలో అమెరికా మళ్లీ గౌరవం పొందుతున్న విశ్వాసం ఉంది. మన బల సంపన్నతను ఏ దేశమూ ప్రశ్నించలేదు. మన శక్తి సామర్థ్యాలను ఏ శత్రువూ అనుమానించలేరు. మన సరిహద్దులు భద్రంగా ఉంటాయి. మన ఆర్థిక వ్యవస్థ ఉజ్వలంగా మారుతుంది. మన భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవాలంటే విఫలమైన నాయకత్వం నుంచి దేశాన్ని తొలుత రక్షించుకోవాలి. అమెరికా చరిత్రలో ఈ ఎన్నికలు అత్యంత కీలకం.

శత్రుదుర్భేద్యంగా మారుస్తా

అక్రమ వలసలు అమెరికాకు పెద్ద సమస్యగా మారాయి. దక్షిణ సరిహద్దు నుంచి పోటెత్తుతున్న వలసలు, చొరబాట్లు దేశమంతటా కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. అక్రమ వలసల కారణంగా నేరాలు, పేదరికం, వ్యాధులు, విధ్వంసం పెరుగుతున్నాయి. ప్రపంచమంతటా ఇలాంటి వలసల సంక్షోభం కనిపిస్తోంది. మరోవైపు యూరప్, మధ్యప్రాచ్యంలో యుద్ధాలు కొనసాగుతున్నాయి. తైవాన్, కొరియా, ఫిలిప్పైన్స్‌లో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. కేవలం ఆసియా ఖండమే కాదు, మొత్తం భూగోళం నేడు మూడో ప్రపంచ యుద్ధం అనే అంచుపై ఉందని చెప్పక తప్పదు. ఈ పరిస్థితి మారాలన్నదే నా ఆశ. తైవాన్‌ను చైనా చుట్టుముడుతోంది. అమెరికా సమీపంలో రష్యా యుద్ధ నౌకలు, అణు జలాంతర్గాములు చెక్కర్లు కొడుతున్నారు. ఈ విషయాలు ప్రస్తావించేందుకు మీడియా ఇష్టపడడం లేదు. నేను అధికారం చేపట్టిన తర్వాత మన భూభాగాలను శత్రు దుర్భేద్యంగా మారుస్తా.

మార్పునకు సమయమిదే

అమెరికాలో మార్పునకు సమయం ఆసన్నమైంది. ఇప్పుడున్న పరిపాలనను మరో నాలుగేళ్లు మనం భరించలేం. అందుకే మార్పునకు పట్టం కట్టాలి. అమెరికా పౌరుల ఎదుట ఈ క్షణాన ప్రతిజ్ఞ చేస్తున్నా. ద్రవ్యోల్బణ సంక్షోభాన్ని అంతం చేస్తా. వడ్డీ రేట్లను తగ్గిస్తా. మన సరిహద్దును మూసివేస్తా. గోడ నిర్మాణం పూర్తిచేస్తా. అక్రమ వలసలకు పూర్తిగా అడ్డుకట్ట వేస్తా. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి శుభం కార్డు వేసేస్తాం. నేను అధికారంలో ఉండి ఉంటే ఈ యుద్ధాలు అసలు జరిగేవే కాదు. నవంబర్ 5న జరిగే ఎన్నికల్లో నా విజయానికి సహరించాలని అందరినీ సవినయంగా కోరుతున్నా. మిమ్మల్ని తలెత్తుకొనేలా, గర్వపడేలా చేయడమే నా ధ్యేయం.

బైడెన్ కంటే కమల బెటర్

మెజారిటీ డెమొక్రాట్ల అభిప్రాయం

వాషింగ్టన్: అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవాలని బైడెన్‌పై ఒత్తిళ్లు తీవ్రమవుతున్న వేళ ఆయన కంటే కమలా హారిస్ మంచి అధ్యక్షురాలు అవుతారని మెజారిటీ డెమొక్రాట్లు భావిస్తున్నారు. ప్రతి 10 మంది డెమొక్రాటిక్ పార్టీ సభ్యుల్లో ఆరుగురు కమలా హారిస్ అగ్ర రాజ్యాధినేతగా రాణించగలరని అభిప్రాయపడ్డారు. ఇద్దరు ఆమె సామర్థ్యంపై అపనమ్మకం వెలిబుచ్చగా, మరో ఇద్దరు ఎటూ చెప్పలేమని, తమకు అంతగా తెలియదని చెప్పుకొచ్చారు. ఏపీ-ఎన్ఓఆర్‌సీ సెంటర్ ఫర్ పబ్లిక్ ఆఫైర్స్ రీసెర్చ్ నిర్వహించిన పోల్‌లో డెమొక్రాట్లు ఈ మేరకు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ట్రంప్‌తో జూన్ 27న జరిగిన తొలి అధ్యక్ష చర్చలో బైడెన్ తడబడటం, మతిమరపుతో పేలవ ప్రదర్శన కనబర్చిన విషయం తెలిసిందే. అప్పటినుంచి ట్రంప్‌ను ఓడించాలంటే అది కమలకే సాధ్యమవుతుందని, బైడెన్ స్థానంలో ఆమె తమ అధ్యక్ష అభ్యర్థి కావాలని డెమొక్రాట్లు డిమాండ్లు వినిపిస్తున్నారు. ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ.. బైడెన్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ అధ్యక్ష అభ్యర్థిగా వైదొలగడమే పార్టీకి మేలని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. బైడెన్ కొనసాగితే వైట్‌హౌస్‌ను కోల్పోవడమే కాకుండా ప్రతినిధుల సభ, సెనేట్‌లోనూ డెమొక్రాటిక్ పార్టీకి ఎదురుదెబ్బ తగులుతుందని సీనియర్లు ఆందోళన చెందుతున్నారు.

వైదొలగడం లేదు: ప్రచార సారథి

జో బైడెన్ అధ్యక్ష రేసు నుంచి వైదొలగడం లేదని ఆయన ప్రచారబృందం సారథి జెన్ ఒమాలీ డిల్లాన్ శుక్రవారం స్పష్టం చేశారు. అయితే బైడెన్‌కు మద్దతు తగ్గుతున్న విషయాన్ని అంగీకరించారు. 'ఆయనకు 81 ఏళ్లనేది నిజమే.. కానీ ఆయన గెలవగలరని అమెరికా ప్రజల్లో తిరిగి నమ్మకాన్ని పాదుకొల్పడానికి మేము చేయాల్సింది ఎంతో ఉంది' అని డిల్లాన్ అన్నారు. బైడెన్ ఫిట్‌నెస్‌పై సందేహాలు ఉన్నప్పటికీ ఓటర్లు ట్రంప్‌కు ఓటు వేసేందుకు మొగ్గు చూపడం లేదని ఆమె పేర్కొన్నారు.

అమెరికా విలేఖరికి 16 ఏళ్ల జైలు శిక్ష



యెకటేరిన్‌బర్గ్ (రష్యా): అమెరికా కోసం రహస్య పత్రాలు సేకరిస్తూ గూఢచర్యానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ ప్రఖ్యాత వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు చెందిన 32 ఏళ్ల రిపోర్టర్ ఇవాన్ గెర్ష్‌కోవిచ్‌కు రష్యా న్యాయస్థానం 16 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. దీనిని పూర్తిగా కల్పిత సాక్ష్యాలతో సృష్టించిన తప్పుడు కేసుగా అమెరికా అభివర్ణించింది. శుక్రవారం రష్యాలోని సెవెర్డ్‌లోవోస్క్ ప్రాంతీయ కోర్టు జడ్జి ఆంద్రీ మినియేవ్ ఈ తీర్పు చెప్పారు. తీర్పుకు ముందు నీవేమైనా చెప్పేది ఉందా? అని జడ్జి ప్రశ్నించగా లేదు అని ఇవాన్ సమాధానమిచ్చారు. ఇవాన్‌కు 18 ఏళ్ల శిక్ష విధించాలని ప్రభుత్వ లాయర్లువాదించగా జడ్జి 16 ఏళ్ల శిక్ష వేశారు. శిక్ష ఖరారుపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ స్పందించారు. '' జర్నలిస్ట్, అమెరికన్ పౌరుడు అయినందుకే ఇవాన్‌ను బంధించి జైలుపాలుచేశారు. ఐరాస కూడా ఇదే మాట చెప్పింది. అతడిని విడిపించేందుకు అమెరికా తన ప్రయత్నాలు ఇకమీదటా కొనసాగిస్తుంది. పాత్రికేయ వృత్తి నేరం కాబోదు' అని అన్నారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగిశాక అమెరికా జర్నలిస్ట్‌ను రష్యా అరెస్ట్‌చేయడం ఇదే తొలిసారి. యురాల్స్‌గోన్జవోడ్ సిటీలో రష్యా యుద్ధట్యాంకుల తయారీ, రిపేర్ల రహస్య సమాచారాన్ని ఇవాన్ సేకరిస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికాడని ఆరోపిస్తూ 2023 మార్చి 29న ఇవాన్‌ను అరెస్ట్‌చేయడం తెల్సిందే.

పూజపై డిబార్ వేటు!

ట్రైనీ ఐఏఎస్‌పై కఠిన చర్యలకు సిద్ధమైన యూపీఎస్సీ

నకిలీ పత్రాలు, అఫిడవిట్లపై క్రిమినల్ కేసు నమోదు



సాక్షి, న్యూఢిల్లీ: అధికార దర్పం ప్రదర్శించేందుకు ప్రయత్నించి వివాదాలకు కేంద్రబిందువుగా మారిన ప్రొబెషనరీ మహిళా ఐఏఎస్ పూజా మనోరమ దిలీప్ ఖేద్కర్ విషయంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) సీరియస్‌గా స్పందించింది. 2022 సివిల్ సర్వీసెస్ పరీక్షల నిబంధనల ప్రకారం భవిష్యత్ పరీక్షలు, నియామకాల నుంచి మిమ్మల్ని ఎందుకు డిబార్ చేయకూడదో వివరణ ఇవ్వాలని ఆమెకు షోకాజ్ నోటీసు పంపించింది. ''పరీక్ష రాసే 'అవకాశాలు' ఆమె గతంలోనే దాటేశారు. అయినాసరే అర్హత లేకపోయినా గుర్తింపును దాచి తప్పుడు పత్రాలు సమర్పించి సివిల్స్ రాసి అర్హత సాధించారు'' అని యూపీఎస్సీ శుక్రవారం తెలిపింది. ''పాత వివరాలతో అదనంగా ఇంకోసారి పరీక్ష రాయలేనని తెల్సుకుని ఉద్దేశపూర్వకంగా తన పూర్తి పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఫోటోగ్రాఫ్, సంతకం, ఇ-మెయిల్ ఐడీ, మొబైల్ నెంబర్, చిరునామా మార్చేసి గుర్తింపు దాచారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినట్లు మా దర్యాప్తులో తేలింది'' అని యూపీఎస్సీ ప్రకటించింది. తర్వాత ఆమెపై క్రిమినల్ కేసు మోపి సమగ్ర దర్యాప్తు చేయాలని ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఫోర్జరీ, చీటింగ్, వైకల్య కోటా దుర్వినియోగం వంటి నేరాలకు పాల్పడ్డారంటూ ఐపీసీ, ఐటీ, డిజబిలిటీ చట్టాల కింద ఢిల్లీ నేరవిభాగ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తును మొదలెట్టారు. 2023 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్ అయిన పూజ మహారాష్ట్రలోని పుణె జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణలో ఉన్నప్పుడు అదనపు సౌకర్యాలు కావాలని, సొంత కారుకు ఎర్రబుగ్గ తగిలించుకుని తిరిగారు. దీంతో ఆమె సివిల్స్‌లో అర్హత సాధించేందుకు చేసిన నేరాలను మీడియా బహిర్గతంచేసింది. దీంతో ఆమెను పుణె నుంచి వాసిమ్ జిల్లా కలెక్టరేట్‌లో అసిస్టెంట్ కలెక్టర్‌గా బదిలీచేసింది. యూపీఎస్సీ షోకాజ్ నోటీసు నేపథ్యంలో శుక్రవారం ఆమె వాసిమ్ కలెక్టరేట్‌లో పదవిని వదిలి వెళ్లిపోయారు. యూపీఎస్సీకి వచ్చే దరఖాస్తుల పరిశీలన సమగ్రస్థాయిలో, మరింత సునిశితంగా ఉండాలని పూజా ఉదంతం చాటుతోంది.

పూజ తండ్రికి తాత్కాలిక ఉపశమనం

భూ వివాదంలో తుపాకీతో బెదిరించిన కేసులో జూలై 25వ తేదీదాకా అరెస్ట్ నుంచి పూజ తండ్రి దిలీప్‌కు రక్షణ కల్పిస్తూ పుణె సెషన్స్‌కోర్టు ఉత్తర్వులిచ్చింది. ఇదే కేసులో దిలీప్ భార్య మనోరమను మహారాష్ట్ర పోలీసులు ఇప్పటికే అరెస్ట్‌చేసి 20వ తేదీదాకా జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. మరోవైపు మనోరమ భార్యకు చెందిన నిర్వహణలోలేని థర్మోవెరిటా ఇండియా అనే ఇంజనీరింగ్ సంస్థను పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సీల్‌చేశారు. రూ.2.77 లక్షల ఆస్తి పన్ను బాకీ కట్టనందుకు అధికారులు ఇలా చర్యలకు ఉపక్రమించారు. వైకల్య సర్టిఫికెట్ తీసుకునేటపుడు ఈ సంస్థ చిరునామానే పూజ తన ఇంటి అడ్రస్‌గా పేర్కొన్నారు.

బిల్కిస్ బానో దోషులకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

న్యూఢిల్లీ: బిల్కిస్ బానో రేప్ కేసులో ఇద్దరు దోషులకు శుక్రవారం సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. శిక్ష తగ్గింపును కొట్టివేస్తూ ఈ ఏడాది జనవరి 8న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దోషులు రాధేశ్యామ్ భగవాన్ దాస్ షా, రాజుభాయ్ బాబూలాల్ సోనిలు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. సమాన సంఖ్యలో జడ్జీలు ఉన్న ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై తామెలా విచారణ చేపట్టగలమని (రెండు ధర్మాసనాల్లోనూ సమంగా ఇద్దరేసి జడ్జీలు ఉన్నందువల్ల) ప్రశ్నించింది. 2002లో గోద్రా అల్లర్ల అనంతర ఘటనల్లో గర్భవతి బిల్కిస్ బానో సామూహిక అత్యాచారానికి గురయ్యారు. ఆమె కుటుంబ సభ్యులు ఏడుగురు హత్యకు గురయ్యారు. ఈ కేసులో మొత్తం 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. భగవాన్‌దాస్ షా పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం 2022 మే 13వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ క్షమాభిక్ష విధానానికి అనుగుణంగా షాను విడుదల చేసే అంశాన్ని పరిశీలించాల్సిందిగా గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దాంతో గుజరాత్ ప్రభుత్వం అదే ఏడాది ఆగస్టు 15వ తేదీన బిల్కిస్ బానో కేసుల యావజ్జీవ కారాగార శిక్షను అనుభవిస్తున్న 11 మందిని సత్ప్రవర్తన కలిగి ఉన్నారనే కారణంతో క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేసింది. దీనిపై దేశ వ్యాప్తంగా తీవ్ర విమర్శలు తలెత్తాయి. వివిధ రంగాలు చెందిన మేధావులు, ప్రముఖులు ఆరు వేల మంది దోషులకు శిక్ష మినహాయింపును రద్దు చేయాల్సిందిగా సుప్రీంకోర్టును ఒక లేఖలో కోరారు. విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరి 8న వారికి శిక్ష మినహాయింపు సరికాదని తీర్పునిచ్చింది. రెండు వారాల్లోగా దోషులందరూ జైలులో లొంగిపోవాల్సిందిగా ఆదేశించింది. విచక్షణాధికారాలను తప్పుగా వాడారని, అనైతిక పద్ధతుల ద్వారా దోషులకు అనుకూలంగా వ్యవహరించారని గుజరాత్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేసింది. కేసు విచారణ మహారాష్ట్రలో జరిగింది కాబట్టి క్షమాభిక్షను ప్రసాదించే అధికార పరిధి కూడా ఆ రాష్ట్రానిదేనని, గుజరాత్ ప్రభుత్వం మహారాష్ట్ర అధికారాన్ని చట్టవిరుద్ధంగా లాక్కుందని పేర్కొంది. సమానబలం కలిగిన సుప్రీంకోర్టు ధర్మాసనాలు (రెండూ ద్విసభ్య ధర్మాసనాలే) శిక్ష మినహాయింపుపై పరస్పర విరుద్ధ తీర్పులు ఇచ్చాయని, విస్తృత ధర్మాసనానికి ఈ కేసును రిఫర్ చేయాలని పిటిషనర్లు కోరారు. 'ఇదేం పిటిషన్. ఇది ఎలా విచారణార్హం అవుతుంది? ఇది పూర్తిగా తప్పుగా అర్థం చేసుకొని వేసిన పిటిషన్. ఆర్టికల్ 32 కింద పిటిషన్ ఎలా వేస్తారు? సమాన సంఖ్య ఉన్న ధర్మాసనం ఇచ్చిన తీర్పును మేము సమీక్షించలేం' అని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లు శుక్రవారం స్పష్టం చేశారు. దీంతో పిటిషన్ల తరఫున న్యాయవాది రిషి మల్హోత్రా తమ వ్యాజ్యాన్ని ఉపసంహరించుకోవడానికి అనుమతి కోరారు. ధర్మాసనం దీనికి సమ్మతించింది. భగవాన్ దాస్ షా మధ్యంతర బెయిల్‌ను కూడా కోరారు.

పాలస్తీనాను అధీనంలో ఉంచుకోవడం చట్టవిరుద్ధం

అంతర్జాతీయ న్యాయస్థానం

ది హేగ్: పాలస్తీనా ఆక్రమిత ప్రాంతాలను ఇజ్రాయెల్ తమ అధీనంలో ఉంచుకోవడం చట్ట విరుద్ధమని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ న్యాయస్థానం శుక్రవారం స్పష్టం చేసింది. ఆక్రమిత ప్రాంతాల నుంచి వైదొలగాలని, అక్కడ స్థిర నివాసానికి కాలనీల నిర్మాణాన్ని తక్షణం నిలిపివేయాలని సూచించింది. 57 ఏళ్ల కిందట ఆక్రమించిన పాలస్తీనా ప్రాంతాలపై ఇజ్రాయెల్ అజమాయిషీని తప్పుపడుతూ అంతర్జాతీయ న్యాయంస్థానం తీర్పు ఇవ్వడం అసాధారణ విషయంగా పేర్కొంటున్నారు. వెస్ట్‌బ్యాంక్, తూర్పు జెరూసలెంలలో ఇజ్రాయెల్ సెటిల్మెంట్లను నిర్మించడం, విస్తరించడం, ఆక్రమిత ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడం, వాటిపై నియంత్రణ, అక్కడి సహజ వనరులను వినియోగించుకోవడం, పాలస్తీనియన్లపై వివక్షతో కూడిన విధానాలను అమలు చేయడం.. ఇవన్నీ అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనేనని జడ్జీల ప్యానెల్ అభిప్రాయపడింది. ఆక్రమిత ప్రాంతాలపై ఇజ్రాయెల్‌కు సార్వభౌమాధికారం లేదని, పాలస్తీనాలోని ప్రాంతాలను బలవంతంగా ఆక్రమించడం అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనేనని పేర్కొంది. అయితే అంతర్జాతీయ న్యాయ స్థానం ఇచ్చిన ఈ తీర్పుకు కట్టుబడి ఉండాల్సిన, పాటించాల్సిన అవసరం ఇజ్రాయెల్‌కు లేదు. ఇదొక అభిప్రాయం మాత్రమే. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు దీనిపై స్పందిస్తూ.. ఆ ప్రాంతాలు యూదు ప్రజల చారిత్రక మాతృభూమిలో భాగమన్నారు.

పాక్‌లో లాడెన్ సన్నిహితుడి అరెస్ట్



లాహోర్: అల్ ఖైదా సీనియర్ నేత, ఒసామా బిన్ లాడెన్‌కు సన్నిహితుడిగా భావిస్తున్న అమీనుల్ హక్‌ను పాక్ ఉగ్రవాద వ్యతిరేక విభాగం అరెస్ట్ చేసింది. దేశంలో భారీ ఉగ్రదాడులకు పాల్పడేందుకు అతడు చేస్తున్న ప్రయత్నాలను విజయవంతంగా అడ్డుకోగలిగామని ఉగ్రవాద వ్యతిరేక విభాగం డీఐజీ ఉస్మాన్ అక్రమ్ చెప్పారు. నిఘా వర్గాల సమాచారం మేరకు పంజాబ్ ప్రావిన్స్‌లోని గుజ్రాత్ జిల్లా సరాయ్ ఆలంగిర్ పట్టణంలో దాగున్న అతడిని పట్టుకున్నట్లు అక్రమ్ తెలిపారు. ఉగ్రవాదంపై జరుపుతున్న పోరాటంలో ఇదో కీలక విజయమని పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌లో చల్లారని ఉద్రిక్తతలు

- 64కు పెరిగిన మృతుల సంఖ్య
- ఢాకాలో ప్రదర్శనలు, సభలపై ప్రభుత్వం నిషేధం
- జైలుపై ఆందోళనకారుల దాడి
- ఖైదీల విడుదల

ఢాకా: ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోటాకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో ఆందోళనలు తీవ్రంగానే కొనసాగుతున్నాయి. పోలీసులు, అధికార పార్టీ అనుబంధ విద్యార్థి సంఘాలతో ఆందోళనకారులు బాహాబాహీ తలపడుతున్నారు. దేశవ్యాప్తంగా జరిగిన హింసాత్మక ఘటనల్లో శుక్రవారం నాటికి 64 మంది వరకు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా తెలిపింది. గాయపడిన వారి సంఖ్య వందల్లోనే ఉంటుందని పేర్కొంది. అయితే, మరణాలు, క్షతగాత్రుల సంఖ్యపై యంత్రాంగం ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. రాజధాని ఢాకా పరిధిలోని నర్సింగ్డి జిల్లాలో ఉన్న జైలుకు శుక్రవారం రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ముందుగా వారు జైలుపై దాడి చేసి, అందులోని వారందరినీ విడిచిపెట్టారు. 'ఖైదీలంతా పరారయ్యాక ఆందోళనకారులు జైలు భవనానికి నిప్పుపెట్టారు. వెళ్లిపోయిన ఖైదీలు ఎంతమంది అనేది తెలియదు. కానీ, వారి సంఖ్య వందల్లోనే ఉంటుంది' అని ఓ పోలీస్ అధికారి చెప్పినట్లు ఏఎఫ్‌పీ వార్తాసంస్థ వెల్లడించింది. శుక్రవారం ఢాకాలోని ప్రభుత్వ టీవీ కార్యాలయాన్ని సుమారు 1,000 మంది ఆందోళనకారులు ముట్టడించినట్లు ఏఎఫ్‌పీ తెలిపింది. వీరిని చెదరగొట్టేందుకు సరిహద్దు భద్రతా బలగాలు కాల్పులు జరిపినట్లు పేర్కొంది. వీధుల్లో పెద్ద సంఖ్యలో బుల్లెట్లతోపాటు రక్తం మరకలు కనిపించాయని తెలిపింది. ఆందోళనకారులు గురువారం టీవీ కార్యాలయంలో కొంతభాగాన్ని ధ్వంసం చేసి, అక్కడున్న వాహనాలకు నిప్పుపెట్టారు.

దేశవ్యాప్త కర్ఫ్యూ

ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్లను రద్దు చేయాలని కోరుతూ కొద్దిరోజులుగా కొనసాగుతున్న ఆందోళనలు శృతిమించడంతో బంగ్లాదేశ్ ప్రభుత్వం శుక్రవారం రాత్రి నుంచి దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించింది. శాంతిభద్రతలను కాపాడటానికి సైన్యాన్ని రంగంలోకి దింపింది.

సాక్షి హైదరాబాద్

శనివారం । 20 । జూలై । 2024



ప్లీజ్.. అడాప్ట్..

నెహ్రూ జూ పార్క్‌లోని వన్యప్రాణుల దత్తత (అడాప్ట్)కు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కొన్నేళ్లుగా దత్తతను ఆన్‌లైన్‌లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. -10లో



దీర్ఘాయుష్మాన్‌భవ

అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సలకు నిమ్స్ వేదికగా నిలిచింది. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రి మెట్లెక్కిన రోగులను ఆదరిస్తోంది. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.0/23.0

నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురవొచ్చు. గరిష్టంగా 27, కనిష్టంగా 23డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.







విమాన యానం.. అంతరాయం!

శంషాబాద్ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే 29 విమానాలు శుక్రవారం రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. కొన్ని ఫ్లైట్లు గంట నుంచి రెండు గంటల వరకు ఆలస్యంగా నడిచాయి. ముంబై, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతాలకు వెళ్లేవారు గంటల తరబడి నిరీక్షించారు.

ప్రాణాలు తీసిన అతివేగం

లారీని ఢీకొన్న కారు

- ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థుల దుర్మరణం



అస్మిత్



అక్షయ్




ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

దుండిగల్: అతివేగం ముగ్గురు విద్యార్థుల ప్రాణాలను బలిగొంది. మితిమీరిన వేగంతో వచ్చిన కారు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లిలోని వీఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అక్షయ్, అస్మిత్, జస్వంత్, నవనీత్‌తో పాటు మరో స్నేహితుడు హరి కారులో దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్–5 వద్ద దిగారు. అక్కడి నుంచి సర్వీస్ రోడ్డులో బౌరంపేట వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో అక్షయ్, హరి, అస్మిత్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన జస్వంత్, నవనీత్‌లను సూరారంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన విద్యార్థుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. విద్యార్థులు నడిపిన కారుపై ఇప్పటికే అయిదు చలాన్లు నమోదయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘హైడ్రా’ ఆగయా!

తక్షణం అమలులోకి ఈ వ్యవస్థ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- విపత్తు నిర్వహణ, ఆస్తుల రక్షణ, ఇతర విధులు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని ఔటర్‌రింగ్‌రోడ్ (ఓఆర్ఆర్) వరకు ఉన్న ప్రాంతాన్ని తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్)గా పేర్కొంటూ ప్రభుత్వం ఆ ప్రాంతం వరకు విపత్తు నిర్వహణ తదితర అధికారాలతో ‘హైడ్రా’ను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పేరుతో ఏర్పాటైన ఇది విపత్తులను ఎదుర్కొనడంతో పాటు విపత్తు నివారణకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటుంది. తక్షణ స్పందన, రెస్క్యూ ఆపరేషన్ల కోసం రాష్ట్ర,జాతీయ సంస్థల సహకారం తీసుకుంటుంది. విపత్తు నిర్వహణతోపాటు అస్సెట్స్ ప్రొటెక్షన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులతో పాటు కాలానుగుణంగా ప్రభుత్వం అప్పగించే పనుల్ని ఎప్పటికప్పుడు నిర్వహిస్తుంది. జీహెచ్ఎంసీ శివార్లలో వివిధ రంగాల్లో పరిశ్రమలు, జనాభా విస్తృతంగా పెరుగుతున్న నేపథ్యంలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ఓఆర్ఆర్ వరకు ఒకే గొడుగు కింద విపత్తు నిర్వహణ ఉండాలనే తలంపుతో ప్రభుత్వం దీన్ని ఏర్పాటు చేసింది. ప్రత్యేక విభాగంగా ఏర్పాటైన హైడ్రాకు విభాగాధిపతిగా సెక్రటరీ స్థాయికి తగ్గని పోలీసు ఉన్నతాధికారి కమిషనర్‌గా ఉంటారు. ప్రస్తుతం వివిధ సంస్థల పరిధిలో ఉన్న శిక్షలు విధించే అధికారం, లేదా నియంత్రణ చర్యలు తీసుకోవాల్సిన సందర్భాల్లో సదరు సంస్థల సమన్వయంతో సంబంధిత చట్టాలకనుగుణంగా పనిచేస్తుంది. అవసరాన్ని బట్టి సంబంధిత అధికారాలు, బాధ్యతలు హైడ్రాకు అప్పగిస్తారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు (జీఓఎంఎస్ నెంబర్ 99)జారీ చేశారు. ఇది వెంటనే అమల్లోకి వస్తుంది.

చైర్మన్‌గా సీఎం..

హైడ్రా పాలక మండలికి రాష్ట్ర ముఖ్యమంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మున్సిపల్ శాఖ మంత్రి, రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మంత్రి, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, జీహెచ్ఎంసీ మేయర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, రెవెన్యూ (డీఎం) విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐసీసీసీ అధిపతి, హైడ్రా కమిషనర్ సభ్యులుగా ఉన్నారు. వీరితోపాటు సందర్భాన్ని బట్టి సీఎస్ నిర్ణయం మేరకు ఎవరైనా ఒక అధికారి కూడా ఉంటారు.

ముఖ్య విభాగాలు.. బాధ్యతలు

ఆస్తుల రక్షణ విభాగం

- పార్కులు, లేఔట్లు, ఖాళీ ప్రదేశాలు, ఆట స్థలాలు, చెరువులు, నాలాలు, భూభాగాలు, రోడ్లు, క్యారేజ్‌వేలు, ఫుట్‌పాత్‌లు తదితరమైన వాటిని కబ్జాల నుంచి పరిరక్షిస్తుంది.
- జీహెచ్ఎంసీ, ఇతర స్థానికసంస్థలు, హెచ్ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలతో కలిసి చెరువుల కబ్జాలు తొలగిస్తుంది.
- ఆస్తుల పరిరక్షణ, అవసరమైన చర్యలు అమలు చేసేందుకు స్థానిక పోలీసుల సమన్వయంతో పని చేస్తుంది.
- ప్రభుత్వ విభాగాల నుంచి అందే సూచనల మేరకు టౌన్‌ప్లానింగ్ నిబంధనల తనిఖీలు, ప్రజా భద్రతకు ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనాల తొలగింపు వంటి చర్యలు చేపడుతుంది.
- ప్రకటనల ఉల్లంఘనలు, అనుమతి లేని ప్రకటనలకు శిక్షలు విధించే సందర్భాల్లో సంబంధిత యూఎల్‌బీల పరిధిలో వాటి రూల్స్‌కు అనుగుణంగా హైడ్రా పని చేస్తున్నట్లు పరిణిస్తారు.
- సమయ సందర్భాల్ని బట్టి ప్రభుత్వం అప్పగించే పనుల్ని ఎప్పటికప్పుడు నెరవేరుస్తుంది.

విపత్తు నిర్వహణ విభాగం

- హైడ్రాలోని విపత్తు నిర్వహణ విభాగం (డీఆర్ఎఫ్) ఏదైనా విపత్తు, అత్యవసర పరిస్థితి సంభవించినప్పుడు రంగంలోకి దిగి తగిన చర్యలు చేపడుతుంది. రిలీఫ్ పనులు చేస్తుంది
- ఎన్‌డీఎఫ్, ఎస్‌డీఎంఏ, టీజీడీఆర్అండ్ఎఫ్ఎస్ విభాగాలతో పాటు ఇతర రాష్ట్ర, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సహకారం తీసుకుంటుంది. వాటితో పాటు వాతావరణ శాఖ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ వంటి సంస్థల సహకారంతో వాతావరణ సూచనల వంటివి తెలుసుకొని సంబంధిత ప్రభుత్వ విభాగాలను అప్రమత్తం చేస్తుంది. ఎలాంటి విపత్తులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు పోలీసు, జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, హెచ్ఎండీఏ, హెచ్ఎంఆర్, హెచ్‌జీసీఎల్, ఎంఆర్‌డీసీఎల్, టీజీఎస్ పీడీసీఎల్, ఫారెస్ట్, తదితర విభాగాలతో సమన్వయంతో పని చేస్తుంది.
- ప్రత్యేక డేటాబేస్‌ను కలిగి ఉండి, వివిధ మార్గాల ద్వారా సేకరించిన సమాచారంతో భవిష్యత్‌లో ఏర్పడబోయే ఉపద్రవాలు, విపత్తులు అంచనా వేస్తుంది.
- రాష్ట్ర ఫైర్ సర్వీస్ యాక్ట్‌కనుగుణంగా డీజీ అప్పగించిన ఆయా ప్రాంగణాలు తనిఖీ చేసి ఎన్‌ఓసీలు జారీ చేస్తుంది.

లాజిస్టిక్ సపోర్టింగ్ వింగ్

సిబ్బంది నియామకాలు, ఆస్తులు, సామగ్రి, వాహనాల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, ఐటీ, జీఐఎస్‌సర్వీస్ తదితర పనులు నిర్వహిస్తుంది.

ఇతర విధులు

ట్రాఫిక్ పోలీసులతో కలిసి హైడ్రా అధికారులు ట్రాఫిక్ నిర్వహణ చేస్తారు. ముఖ్యంగా భారీ వర్షాల సమయాల్లో వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో, రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాలు, వరద ప్రవాహ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిస్తారు.

టీసీయూఆర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సబ్ కమిటీకి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా, వివిధ విభాగాల అధికారులతో 14 మంది సభ్యులుగా ఉంటారు. ఈ సబ్‌కమిటీ హైడ్రా పాలకమండలికి పాలసీల్లో, ప్రణాళికల్లో, తదితర అంశాల్లో సహకరిస్తుంది. నెలకోసారి లేదా అవసరాన్ని బట్టి ఇది సమావేశమవుతుంది.

సిటీ పోలీసులకు డీజీపీ కితాబు

- కీలక సందర్భాల్లో బందోబస్తు భేష్ అని వ్యాఖ్య
- కమిషనరేట్‌ను సందర్శించిన డాక్టర్ జితేందర్



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ శుక్రవారం తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లోని (టీజీ సీసీసీ) నగర పోలీసు కమిషనరేట్‌ను సందర్శించారు. అక్కడి సమావేశ మందిరంలో నగర పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. గడిచిన కొన్నాళ్లుగా నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, కీలక సందర్భాల్లో బందోబస్తు నిర్వహణ తదితర అంశాల్లో తీసుకున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన సిటీ పోలీసు విభాగానికి కితాబు ఇచ్చారు. నగర ఉన్నతాధికారులను ఉద్దేశించి జితేందర్ మాట్లాడుతూ.. కొన్నేళ్ల క్రితం అమలులోకి వచ్చిన క్యాష్ లెస్ ఈ–చలాన్ మాదిరిగా ప్రతి అంశంలోనూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని, సున్నితాంశాల్లో ఆచితూచి స్పందించాలని సూచించారు. ఫిర్యాదుదారులను పదేపదే ఠాణాల చుట్టూ తిప్పుకోకుండా సత్వరం న్యాయం చేయడానికి ప్రయత్నించాలని స్పష్టం చేశారు. ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకోవడంతో పాటు విజుబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ చెప్పారు. ట్రాఫిక్ విభాగం అధికారులు రద్దీ వేళల్లో కేవలం వాహనాల నియంత్రణ పైనే దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. వివిధ ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్స్‌తో పాటు ఇతర అంశాలను ఎప్పటికప్పుడు మీడియా ద్వారా పౌరులతో పంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వీఐపీ సంస్కృతిని అరికట్టడంతో పాటు సోషల్ మీడియాను నిర్వహించేందుకు సమర్థులతో టీమ్‌ను అభివృద్ధి చేయాలని డీజీపీ అన్నారు. ఈ సమావేశంలో కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, పి.విశ్వప్రసాద్, సంయుక్త సీపీ పరిమళ హనా నూతన్ తదితరులు పాల్గొన్నారు.

రయ్ రయ్ జర్నీ!

నల్లగండ్ల, తెల్లాపూర్ వైపు ప్రయాణం ఇక సులువు

- గోపన్‌పల్లి ఫ్లై ఓవర్‌ను నేడు ప్రారంభించనున్న సీఎం
- రూ.28.5 కోట్ల నిధులతో పనులు చేపట్టిన ఆర్అండ్‌బీ



గచ్చిబౌలి: ఐటీ కారిడార్ నుంచి నల్లగండ్ల, తెల్లాపూర్ గేటెడ్ కమ్యూనిటీలకు ఇక రయ్‌రయ్‌మంటూ వెళ్లొచ్చు. గోపన్‌పల్లి తాండ కూడలిలో ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి కావడంతో శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి వట్టినాగులపల్లి మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ నిర్మాణంలో భాగంగా 2020లో గోపన్‌పల్లి తాండ కూడలిలో ఫ్లై ఓవర్ పనులకు శంకుస్థాపన చేశారు. నాలుగేళ్ల పాటు నిర్మాణ పనులు నత్తనడకన సాగి.. ఆరునెలల క్రితం పూర్తయ్యాయి. ప్రభుత్వం మారడంతో తుది పనులు నిలిచిపోయాయి. ఎట్టకేలకు ఆర్అండ్‌బీ అధికారులు పనులు పూర్తి చేయడంతో ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది.

ట్రాఫిక్ సమస్యకు చెక్..

- గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్లలో గేటెడ్ కమ్యూనిటీలు ఎక్కువగా ఉన్నాయి. తెల్లాపూర్‌లోనూ గేటెడ్ కమ్యూనిటీలు ఉండటంతో ఐటీ ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో నివాసం ఉంటున్నారు. ఉదయం సాయంత్రం సమయంలో గోపన్‌పల్లి తాండ కూడలిలో ట్రాఫిక్ జాం నెలకొంటోంది.



గోపన్‌పల్లి తాండ కూడలిలో...

- నిర్మాణ వ్యయం: రూ.28.5 కోట్లు.
- గౌలిదొడ్డి నుంచి నల్లగండ్ల వైపు 430 మీటర్లు.
- తెల్లాపూర్ వైపు 550 మీటర్లు. వెడల్పు 11.5 మీటర్లు.
- వన్ వే ఫ్లై ఓవర్‌ను వై ఆకారంలో నిర్మించారు.
- రూ.26 లక్షల వ్యయంతో గ్రీనరీ.
- గోపన్‌పల్లి నుంచి టీ కారిడార్‌కు వెళ్లేందుకు తాండ కూడలిలో బీటీ రోడ్డు.

- ఫ్లై ఓవర్ అందుబాటులోకి రావడంతో ఓఆర్ఆర్, ఐటీ కారిడార్ నుంచి నల్లగండ్ల, తెల్లాపూర్ వైపు ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనదారులు వెళ్లొచ్చు. ఉదయం సమయంలో గోపన్‌పల్లి, గోపన్‌పల్లి తాండ నుంచి ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి, ఓఆర్ఆర్ వైపు సాఫీగా వెళ్లడానికి వీలుంటుంది.
- వట్టినాగులపల్లిలోని శ్రీదేవి ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల,అంతర్జాతీయ స్థాయి ప్రైవేటు పాఠశాల, విప్రో సంస్థ–2, సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాల, ఐటీ కంపెనీలకు, పలు గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ల వాసులు రద్దీ లేకుండా ప్రయాణించే అవకాశం.

కేటీఆర్ ట్వీట్‌తో కదలిక

కొద్ది రోజుల క్రితం మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గోపన్‌పల్లి తాండ ఫ్లైఓవర్ ప్రారంభించరా? అంటూ ‘ఎక్స్’ వేదికగా ట్వీట్ చేయడంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. దీంతో సీఎంఓ కార్యాలయం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించడంతో ఆగమేఘాల మీద ఫ్లైఓవర్‌కు తుది మెరుగులు దిద్దుతూ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ఫ్లైఓవర్ నుంచి కిందకు గోపన్‌పల్లి తాండ, గోపన్‌పల్లి వైపు వెళ్లే వాహనాల వేగాన్ని అదుపు చేసేందుకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలి. ఫ్లైఓవర్‌పై వేగ నియంత్రణ చేసేందుకు తగిన బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. వేగ నియంత్రణ కోసం సీసీ కెమెరాలను అమర్చాలి.

నిరంతర శ్రమతోనే విజయ శిఖరాలు



ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరిస్తున్న శిఖా గోయల్

సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ శిఖా గోయల్

రామంతాపూర్: విద్యార్థులు ఒక లక్ష్యం ఏర్పరచుకుని అది సాకారమయ్యే వరకూ నిరంతరం శ్రమిస్తేనే విజయం తథ్యమని తెలంగాణ మహిళా భద్రత సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. శుక్రవారం రామంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన విద్యార్థి నాయకుల నియామకాలతో పాటు వివిధ విషయాల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేసే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతిభ ఏ ఒక్కరి సొత్తు కాదన్నారు. తాను పదో తరగతిలో సాధారణ మార్కులతోనే ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. అయితే.. ఒక లక్ష్యం ఏర్పరచుకుని క్రమశిక్షణతో నిరంతర శ్రమతో ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. అబ్దుల్ కలాం, రవీంద్రనాథ్ ఠాగూర్ చెప్పినట్లు ప్రతి వ్యక్తి కలలు కనాలని.. ఆ కలలు కార్యరూపం దాల్చడానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆమె విద్యార్థి నాయకులుగా ఎన్నికైన వారికి, వివిధ విషయాల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పబ్లిక్ స్కూల్ సొసైటీ అధ్యక్షుడు గుస్తి గనోరియా, ఫయాజ్‌ఖాన్, శ్యాం మోహన్, మర్రి ఆదిత్యారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సల్లారం నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం: కలెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: వర్షా కాలం నేపథ్యంలో సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లోని విద్యార్థులకు డెంగీ, చికున్ గున్యా, విష జ్వరాలు వంటి వ్యాధులు ప్రబలకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాల అధికారులు, గురుకులాల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశుభ్రత, కిచెన్ నిర్వహణ, కుక్ బాధ్యతలు, మెనూ ప్రకారం ఆహారం, సదుపాయాలు, జ్వరం కేసులపై నిఘా, మేజర్ లేదా మైనర్ రిపేర్లు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, ఇతర మెటీరియల్ పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతిగృహాలు, గురుకులాల్లోని విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖ అధికారులు పెరుక యాదయ్య, కోటాజీ, ఆశన్న, ఇలియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో నలుగురి రిమాండ్



నిందితులను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

మణికొండ: భూ వివాదంలో ఎమ్మార్పీఎస్ నాయకున్ని కిడ్నాప్ చేసిన కేసులో నార్సింగి పోలీసులు లోతుగా విచారణ కొనసాగిస్తున్నా రు. నెక్నాంపూర్ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నేత నరేందర్ మాదిగతో పాటు అతని స్నేహితుడు ప్రవీణ్‌కుమార్‌ను ఈనెల 11వ తేదీన కొందరు కిడ్నాప్ చేసి శంషాబాద్ మండల పరిధిలోని ఓ ఫాం హౌస్‌లో బంధించి చిత్రహింసలకు గురిచేసిన విషయం తెలిసిందే. ఈ కేసులోని నిందితులు ముంబైలో తలదాచుకున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు..ఓ ప్రత్యేక టీంను అక్కడకు పంపించారు. ఓ హోటల్‌లో ఉన్న నిందితులు సుజ్జాత్ అలీఖాన్, మీర్ అజ్మత్ అలీఖాన్, షకీల్, మహ్మద్ ఇద్రీస్‌లను ఈ నెల 17న అదుపులోకి తీసుకున్నారు. వీరిని శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వచ్చి విచారణ చేసి రాజేంద్రనగర్ కోర్టు ఎదుట హాజరుపరచారు. దాంతో కోర్టు వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు.

ఫతుల్లాగూడ చెరువు కబ్జాపై సీరియస్

తీవ్రంగా స్పందించిన ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్

- కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరిక
- స్థానికుల ఫిర్యాదుతో స్వయంగా పరిశీలించిన వైనం



ఫతుల్లాగూడ చెరువు కబ్జా వివరాలను స్థానికులను అడిగి తెలుసుకుంటున్న ఏవీ రంగనాథ్

నాగోలు: చెరువుల కబ్జాకు పాల్పడితే ఎలాంటి వారైనా చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు పెడతామని జీహెచ్‌ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవీడీఎం) కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. నాగోలు డివిజన్ బండ్లగూడలోని ఫతుల్లాగూడ చెరువు కబ్జాకు గురవుతోందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఆయన స్వయంగా చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లా రెవిన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి ఇక్కడ పర్యటించిన కమిషనర్...చెరువు కబ్జాలపై ఆరా తీశారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో కొంతమంది అక్రమ లే అవుట్‌లు వేసి..ఇళ్లు నిర్మించి అమాయక ప్రజలకు విక్రయిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. చెరువు కబ్జాపై ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి డాక్యుమెంట్లను రంగనాథ్ పరిశీలించారు. గతంలో ఇక్కడ చెరువు రక్షణ కోసం ఫెన్సింగ్ ఉన్నప్పటికీ, ఆ ఫెన్సింగ్ కూడా తొలగించారని, తప్పుడు సర్వే నెంబర్లతో ప్రభుత్వ స్థలం కబ్జా చేస్తున్నారని స్థానికులు ఆయనకు వివరించారు. మరో మూడు రోజుల్లో తాను వచ్చి..డాక్యుమెంట్లు పరిశీలించి లీగల్ యాక్షన్ తీసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను కబ్జాలను ఎందుకు నిరోధించలేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఫతుల్లాగూడ చెరువును డ్రోన్ల ద్వారా సర్వే చేశారు. అనంతరం ఇక్కడి డీఆర్ఎఫ్ కేంద్రాని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ ప్లానర్ కె.శ్రీనివాస్, రీజనల్ ఫైర్ అధికారి పాపయ్య, ఫతుల్లాగూడ గ్రామస్తులు కాటేపాక జంగయ్య, కటేపాక రవి, యాదయ్య, కిషన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడారంగంలో సమూల మార్పులు తెస్తాం

టీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



ఎల్బీ స్టేడియంలో తనిఖీ చేస్తున్న శివసేనారెడ్డి

అబిడ్స్: క్రీడా రంగంలో సమూల మార్పులు తెచ్చేందుకు కృషి చేస్తామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇతర రంగాలతో పాటు క్రీడా రంగం కూడా వెనుకపడిందన్నారు. శుక్రవారం ఎల్బీస్టేడియంలో టీ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్, ఎండీ సోని బాలదేవి, ఇతర అధికారులతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి విభాగం వద్దకు వెళ్లి సిబ్బంది, కోచ్‌లు, అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు క్రీడారంగాన్ని పెద్దఎత్తున అభివృద్ధి జరపాలని, క్రీడాకారుల సంక్షేమానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఎల్బీస్టేడియంలో అన్ని విభాగాల్లో క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇచ్చి వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. స్కేటింగ్ రింగ్‌ను బాస్కెట్‌బాల్ స్టేడియం అనువైన ప్రదేశం అని ఆ స్థలంలో నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు. ఒక కోటి 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్లు అనురాధ, రవీందర్, శ్రీలత, చంద్రారెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందిపై దాడి చేస్తే చర్యలు తప్పవు

సనత్‌నగర్: విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ అధికారులపై దాడులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ హెచ్చరించారు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోతీనగర్‌లో గురువారం విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ సిబ్బంది గణేష్, శ్రీకాంత్, భాస్కర్‌లపై దాడి జరిగిన విషయం విదితమే. వీరిని శుక్రవారం ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైద్యపరంగా అవసరమైన సహాయాన్ని అందించాలని సర్కిల్ ఎస్ఈ చంద్రశేఖర్, గ్రీన్‌ల్యాండ్స్ డివిజినల్ ఇంజినీర్ సుధీర్‌లను ఆయన ఆదేశించారు.

ఓఆర్ఆర్‌పై మినీ లారీ బోల్తా



కీసర ఓఆర్ఆర్‌పై బోల్తా కొట్టిన మినీ లారీ

కీసర: కీసర ఓఆర్ఆర్‌పై శుక్రవారం ఓ మినీ లారీ బోల్తాకొట్టింది. ఈ సంఘటనలో డ్రైవర్‌తో సహా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మేడ్చల్ నుంచి సేమియా ప్యాకెట్ల లోడ్‌తో నగరంలోని మలక్‌పేటకు వెళ్తున్న వాహనం కీసర ఓఆర్ఆర్ జంక్షన్ దాటిన తరువాత డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కారణంగా డివైడర్‌ను వేగంగా ఢీకొట్టి పల్టీకొట్టింది. ఈ సంఘటనలో డ్రైవర్ జనార్ధన్‌తోపాటు, వాహనంలో ఉన్న మరో వ్యక్తి అశోక్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కీసర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రైవింగ్ చేస్తుండగా గుండెపోటు.. కాలేజీ బస్సు డ్రైవర్ మృతి



రాజు (ఫైల్)

శంషాబాద్ రూరల్: ఓ కళాశాల బస్సు తోలుతున్న సమయంలో డ్రైవర్‌కు గుండెపోటుతో రావడంతో మృతి చెందాడు. బస్సులో ఉన్న విద్యార్థులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు.. శంషాబాద్ మండలంలోని కాచారం వాసి మైలారం రాజు (38) స్థానికంగా ఉన్న ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బస్సు డ్రైవర్. శుక్రవారం ఉదయం నగరం నుంచి బస్సులో విద్యార్థులను తీసుకుని వస్తుండగా.. మార్గం మధ్యలో డ్రైవర్ రాజుకు ఛాతీలో నొప్పి వచ్చింది. బస్సును పక్కకు నిలిపివేయగా.. అతడిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. గుండె నొప్పితో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పాట్‌హోల్స్ పూడ్చివేయాలి: ఆమ్రపాలి

సాక్షి, సిటీబ్యూరో: వర్షాల నేపథ్యంలో నగరంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా జరగాలని, దీనిపై ఆయా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షించాలని జీహెచ్‌ఎంసీ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. శుక్రవారం జోనల్ కమిషనర్లు, అడిషనల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాల కారణంగా రోడ్లపై ఏర్పడిన పాట్‌హోల్స్ ఎప్పటికప్పుడు పూడ్చి వేయాలని తెలిపారు. శానిటేషన్ నిర్వహణతో పాటు, శానిటేషన్ వర్కర్ల హాజరు మరింత మెరుగు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీ కేసులను ఎప్పటికప్పుడు గుర్తించి, సంబంధిత సమాచారాన్ని సకాలంలో అందించాలని, అదేవిధంగా డెంగీ కేసులు పెరగకుండా కట్టుదిట్టమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. చెరువులు, నాలాల వద్ద ఎలాంటి భవన నిర్మాణాల వ్యర్థాలు, సాలిడ్ వేస్ట్ ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ విషయమై సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాల దొంగ అరెస్టు



సయ్యద్ సాహిల్ (ఫైల్)



స్వాధీనం చేసుకున్న వాహనాలు

మోతీనగర్: జల్సాలకు అలవాటు పడి రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసి అమ్ముతున్న ఓ దొంగను అల్లాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సామల వెంకట రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..అల్లాపూర్‌లో ఓ రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనం దొంగతనం జరిగింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అల్లాపూర్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా..గోల్కొండకు చెందిన సయ్యద్ సాహిల్ ఎన్‌ఫీల్డ్ వాహనానికి సంబంధించిన పేపర్లు పరిశీలించారు. అనుమానాస్పదంగా వ్యవహరించడంతో విచారించగా తాను రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాలను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. జగద్గిరిగుట్ట, సనత్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మధురానగర్, అల్లాపూర్, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పలు రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాలను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు దొంగ నుంచి 5 రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాలు, ఒక సెల్‌ఫోన్‌ను రికవరీ చేశారు. ఈ మేరకు సయ్యద్ సాహిల్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

బోనాల ఉత్సవాల్లో భక్తులకు సౌకర్యాలు కల్పించండి

అధికారులను ఆదేశించిన సీఎస్ శాంతికుమారి

సాక్షి, సిటీబ్యూరో: ఉజ్జయిని మహంకాళి బోనాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఆది, సోమవారాల్లో ఈ ఉత్సవాలు జరుగనుండటంతో తీసుకుంటున్న చర్యలపై ఆమె శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సీఎస్ కోరారు. ఆలయానికి భక్తులు వచ్చే, వెళ్ళే మార్గాల్లో క్యూ లైన్ల కోసం బారికేడింగ్ ఏర్పాటు చేశామని అధికారులు ఆమెకు వివరించారు. ట్రాఫిక్ ఆంక్షలు విధించి, ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు అధికారులు తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం రెండు 500 కెవీ ట్రాన్స్‌ఫార్మర్లు, డీజిల్ జనరేటర్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్లతో స్థలం కబ్జాకు యత్నం

- అడ్డుకున్న అధికారులు.. పోలీసులకు ఫిర్యాదు
- సహకరించిన సీసీఎల్ఏ ఉద్యోగిపై కేసు నమోదు



ప్రభుత్వ స్థలం

బంజారాహిల్స్: ఖరీదైన ప్రభుత్వ స్థలానికి సంబంధించి ఫోర్జరీ క్రమబద్ధీకరణ డాక్యుమెంట్లు రూపొందించి మోసగించిన సీసీఎల్ఏ ఉద్యోగిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఎలీ ప్రసాద్ ఆస్పత్రి పక్కన 300 గజాల ప్రభుత్వ స్థలం ఉండగా ఇది ల్యాండ్ బ్యాంక్ పార్సిల్‌లో కూడా రికార్డుల్లో నమోదై ఉంది. అయితే ఈ స్థలంపై మహ్మద్ ఖాజా అనే వ్యక్తికి జీఓ 166 కింద రెగ్యులరైజేషన్ అయినట్లుగా సీసీఎల్ఏలో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న కొత్త సుహాస్ ఫోర్జరీ క్రమబద్ధీకరణ డాక్యుమెంట్లు తయారుచేసి..రూ.కోటిన్నర దాకా వసూలు చేసి ఇచ్చాడు. ఈ స్థలం క్రమబద్ధీకరించబడిందని, తన వద్ద రెగ్యులరైజేషన్ పత్రాలు కూడా ఉన్నాయని మహ్మద్ ఖాజా ఈ స్థలం చుట్టూ ఇటీవల బ్లూషీట్స్ నిర్మిస్తుండగా సమాచారం అందుకున్న షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు వాటిని నేలమట్టం చేశారు. అయితే తనకు ఈ స్థలం జీఓ 166 కింద క్రమబద్ధీకరించారని మహ్మద్‌ఖాజా సంబంధిత పత్రాలను షేక్‌పేట మండల తహశీల్దార్ వై.అనితారెడ్డికి చూపించారు. రికార్డులు తిరగేసిన తహశీల్దార్ ఈ జీఓ కింద క్రమబద్ధీకరించిన పత్రాలు నకిలీవని, ఫోర్జరీ సంతకాలు అని, ఎవరు చేశారని ప్రశ్నించారు. సీసీఎల్ఏలో పనిచేస్తున్న కొత్త సుహాస్ ఈ డాక్యుమెంట్లు ఇచ్చారని ఖాజా తెలిపారు. సీసీఎల్ఏలో కూడా డాక్యుమెంట్లు పరిశీలించగా అక్కడ కూడా ఈ రికార్డులు లేకపోవడంతో ప్రభుత్వ స్థలంపై నకిలీ పత్రాలు తయారుచేసిన కొత్త సుహాస్‌పై, కబ్జాకు యత్నించిన ఖాజాపై చర్యలు తీసుకోవాలంటూ తహశీల్దార్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కొత్త సుహాస్‌పై ఐపీసీ సెక్షన్ 420, 467, 468, 471 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాతావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిది


మొక్కలు నాటుతున్న అంబేడ్కర్ వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సుధారాణి తదితరులు

బంజారాహిల్స్: ప్రాణులను కాపాడే భూమిని, వాతావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈ.సుధారాణి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంయుక్తంగా విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఈ.సుధారాణి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటడం ఆనందంగా ఉందన్నారు. పర్యావరణం పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. అనంతరం అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.పుష్పా చక్రపాణి, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు ప్రొఫెసర్ ఐ.ఆనంద్‌పవార్, ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్, గుంటి రవీందర్, పల్లవి కబ్డే, డాక్టర్ ఎల్వీకే రెడ్డి, డాక్టర్ ఎస్.రజని, డాక్టర్ బానోత్‌ధర్మ, ఇంజనీర్ లక్ష్మీప్రసాద్, డైరెక్టర్లు, డీన్స్, అన్ని శాఖల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సదరన్ సర్టిఫికెట్ కోసం ఐదేండ్లుగా పాట్లు!

కనికరించని అధికారులు


దివ్యాంగురాలైన అంజమ్మ

రహమత్‌నగర్ : సదరన్ సర్టిఫికెట్ కోసం ఐదేండ్లు ఓ దివ్యాంగురాలు అధికారులు చుట్టు తిరుగుతున్నా ఫలితం లేకుండాపోయింది. దీంతో ప్రభుత్వం అందించే పింఛన్ ఆమెకు అందని ద్రాక్షలాగానే మారింది. వివరాల ప్రకారం... ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ నర్సపెల్లికి చెందిన రాములు, అంజమ్మ దంపతులు పాతికేళ్ల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బోరబండ డివిజన్‌లోని సాయిబాబానగర్‌లో స్థిర పడ్డారు. రాములు అడ్డ కూలీగా పనులు చేస్తుండగా, అతని భార్య చేపలు విక్రయిస్తు ఉండేది. ఈ క్రమంలోనే 2019లో తన అత్తగారి గ్రామమైన నర్సపెల్లికి వ్యాన్‌లో వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తన ఎడమ చేతిని కోల్పోయింది. అప్పటి నుంచి సదరన్ సర్టిఫికెట్ కోసం అధికారులు చుట్టు తిరుగుతూనే ఉంది. ప్రభుత్వాలు మారిన అంజమ్మకు ఇప్పటి వరకు సదరన్ సర్టిఫికెట్ మాత్రం రాలేదు. దీంతో ఆ దివ్యాంగురాలు పింఛన్ పొందే అవకాశం లేకుండా పోయింది. భర్తకు కూలీ పనిదొరిన నాడు తినడం లేందంటే పస్తులుండే పరిస్థితి నెలకొంది. తనకు సదరన్ సర్టిఫికెట్ ఇప్పిస్తే దాంతో వచ్చే పింఛన్‌తో కుటుంబ అవసరాలు కొంత మేరకు తీరుతాయని అంజమ్మ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని తనకు సదరన్ సర్టిఫికెట్ ఇప్పించి పింఛన్ వచ్చేలా చేయాలని అంజమ్మ కోరుతుంది.

పర్యావరణ రక్షణకు నడుం బిగిద్దాం



నిమ్స్‌మేలో జరిగిన సదస్సులో పాల్గొన్న పి.ఆర్.మెహతా తదితరులు

వెంగళరావునగర్: నానాటికీ పర్యావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు జీవ జాతికి ప్రమాదకరంగా మారాయని తక్షణమే ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా నాబెట్ బోర్డు చైర్మన్ ప్రేమ్ రాజ్ మెహతా తెలియజేశారు. యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రోస్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (నిమ్స్‌మే) కేంద్ర ప్రభుత్వ శిక్షణా సంస్థలో శుక్రవారం సీఎస్ఐఆర్, నీరి సంయుక్త ఆధ్వర్యంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ అండ్ పాలసీ మేకింగ్ (ఈఆర్‌పీఎం) అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో మెహతా మాట్లాడుతూ పరిశ్రమలు విస్తరిస్తున్న నేపథ్యంలో పర్యావరణాన్ని పరిరక్షించడానికి మెరుగైన విధానాలను అవలంబించేందుకు నిపుణులతో ఈ సమావేశం నిర్వహించడం ఆనందించదగ్గ విషయమన్నారు. అదేవిధంగా ఆయా రంగాల్లోని నిపుణులు ఇచ్చే సూచనలు, సలహాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి అమలుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. కాగా దేశవ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక ప్రతినిధులు, అధికారులు, పరిశోధకులు నేడు తరలివచ్చి తమ సందేశాలను పర్యావరణ కోసం సూచనలు ఇవ్వడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐఆర్, నీరి డైరెక్టర్ అతుల్ నారాయణ్ వైద్య, చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ షేక్ బాషా, నిమ్స్ మే డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్. గ్లోరీ స్వరూప, డాక్టర్ సంచితా జిందాల్, డాక్టర్ టీపీబీపీ ఎస్ రామకృష్ణలతో పాటుగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు తమ సలహాలు, సూచనలు అందజేశారు.

మొక్కలు నాటడమే కాదు పరిరక్షించాలి


మొక్కను నాటుతున్న బాబా ఫసీయుద్దీన్, సేవానాయక్

రహమత్‌నగర్ : ప్రతి వ్యక్తి ఓ మొక్కను నాటి దానికి పరిరక్షించాలని జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం సైట్ 2 ఎస్ఆర్ఆర్‌పురంలోని రిజర్వాయర్‌లో అధికారులతో ఆయన కలసి ఆయన మొక్కలు చాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు మనిషికి ప్రాణవాయువును అందించడమే కాకుండా, వాతావరణ కాలుష్యాన్ని తొలగిస్తాయన్నారు. డివిజన్‌లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో విధిగా మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సర్కిల్19 డీఎంసీ సేవా ఇస్లావత్ నాయక్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ ద్వారా మొక్కలు అందించడం జరుగుతున్నదన్నారు. మొక్కలు నాటితే సరిపోదని, వాటిని సంరక్షించాలని సూచించారు. హర్టికల్చర్ మేనేజర్ యూసుఫ్, సూపర్‌వైజర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఆ శోక్, నరసింహ మహేష్‌గౌడ్, ఇమ్రాన్ తదితరులు
పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ.....
డివిజన్‌లోని వీకర్స్ సెక్షన్, శిల్పినగర్ బస్తీల్లో అనారోగ్యంతో బాధపడ్తున్న రమణమ్మ, గిరిచారిలను కార్పొరేటర్ శుక్రవారం వారి నివాసాలకు వెళ్లి పరామర్శించి, మనోధైర్యాన్ని నింపారు. వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం

వెంగళరావునగర్: గత కొన్నేళ్ళుగా పేరుకుపోయిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు)ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మధురానగర్‌లోని మహిళా శిశు సంక్షేమశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా అంగన్‌వాడీలకు తగిన న్యాయం చేయడం లేదని అన్నారు. గత సర్కార్ అవలంబించిన విధానాలను నేటి ప్రభుత్వం కూడా అమలు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్-10 ను తక్షణమే రద్దు చేయాలని చేయడంతోపాటు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయం లోనికి వెళ్ళి మరోసారి చర్చలు జరిపారు. చర్చలు సఫలం కావడంతో యూనియన్ నేతలు ధర్నా విరమించారు. కాగా వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్, పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్, మధురానగర్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐలు, ఏఎస్ఐలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ ధర్నాలో యూనియన్ అధ్యక్షురాలు సునీత, కోశాధికారి మంగతో పాటుగా రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తరలి వచ్చారు.

అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూంలు ఇవ్వాలి

లిబర్టీ: అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షులు నాగిళ్ల నవీన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు వెంటనే చొరవ తీసుకొని అర్హులైన నిరుపేదలైన వారందరికీ నగరంలోని వివిధ ప్రాంతాలలో నిర్మించిన డబుల్ బెడ్‌రూ మ్‌లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని విన్నవించారు. లిబర్టీ ప్లాజాలోని సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో లక్షలాది మంది నిరుపేదలు నివాసం లేక ఫుట్‌పాత్‌లపై మురికివాడల్లో చెట్ల కింద జీవనం సాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మురికివాడలో కనీస సౌకర్యాలకు నోచుకోక దయనీయ జీవితాలు వెళ్లదీస్తున్న దారిద్ర్య రేఖ కొద్దిగా ఉన్న పేదలకు డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. నగరంలో పలు ప్రాంతాల్లో బహుళ అంతస్తులతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తయి ఉన్నాయని వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికీ పేదలకు పంపిణీ చేసిడ ఆదుకోవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు.

డేంజర్‌గా ఓపెన్ నాలాలు!

ఓవైపు ప్రమాదాలు... మరో వైపు ప్రబలుతున్న విషజ్వరాలు

- ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు
- ఓటు రాజకీయాలతోనే సరిపెడుతున్న నేతలు..
- సొంతంగా స్లాబ్ వేసుకుంటున్న అధికారుల అడ్డగింపు


ఫిలింనగర్ బీజేఆర్‌నగర్‌లో ప్రమాదకరంగా పైకప్పు లేని ఓపెన్ నాలా..

ఫిలింనగర్: ఎన్నికలు వచ్చినప్పుడు ఓట్ల కోసం రాజకీయ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు వేయించుకున్నాక ముఖం చాటేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఆర్భాటంగా ఇచ్చిన హామీలను పక్కన బెడుతున్నారు. వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై ఉండడం లేదు. ఏళ్ల తరబడి సమస్యలతో బస్తీవాసులు సతమతమవుతున్నా, ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నా ఇటు జీహెచ్ఎంసీ అధికారులకు, అటు ప్రజాప్రతినిధులకు ఏమాత్రం పట్టడం లేదు. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు అవకతవకలు జరిగినప్పుడు వసూళ్ల కోసం వాలిపోయే ప్రజాప్రతినిధులు తమ కళ్ల ముందే ప్రమాదం కనిపిస్తున్నా స్పందించిన పాపాన పోవడం లేదు.

ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బీజేఆర్ నగర్ బస్తీలో ఓపెన్ నాలా స్థానికులకు తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. నాలా పైకప్పు వేయాలని స్థానికులు గత 20 సంవత్సరాల నుంచి ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా సమస్య ఎక్కడ వేసిన గొంగడి అక్కడే చందంగా మారింది. బీజేఆర్‌నగర్‌ను ఆనుకొని ఆర్కే చికెన్ సెంటర్ నుంచి కొత్తగా పెట్టిన వైన్‌షాపు వరకు ఓపెన్ నాలాతో ప్రమాదాలే కాకుండా దుర్గంధం, దుర్వాసన, వ్యర్థాలు, ఈగలు, దోమలు నరకాన్ని చూపిస్తున్నాయి. పైకప్పు నిర్మించాలని వందల సార్లు వినతి పత్రాలు సమర్పించినా జీహెచ్ఎంసీ సర్కిల్-18 ఇంజనీర్లు స్పందించిన పాపానపోలేదు. ఇటీవల ఓ నివాసితుడు ఈ దుర్గంధం, దుర్వాసన భరించలేక నాలా పైకప్పు వేసుకుందామని ప్రయత్నిస్తే టౌన్ ప్లానింగ్ అధికారులు వచ్చి దానిని కూల్చివేయడమే కాకుండా ఆయనను చీవాట్లు పెట్టారు. మేము వేసే దాకా ఆగాలి తప్పితే.. మీరు వేసుకోవడం కుదరదంటూ హెచ్చరించారు. జీహెచ్ఎంసీ వేయక, స్థానికులు నిర్మించుకుంటుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేసి వీరిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ స్పందించి నాలా పైకప్పు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మేం నిర్మించుకుంటే సమస్య ఏంటి?



ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ఎంపీలు గత పాతికేళ్ల నుంచి మారుతున్నారు తప్పితే బీజేఆర్‌నగర్ నాలా పైకప్పు మాత్రం నిర్మించాలనే ఆలోచన ఏ ఒక్కరికీ రావడం లేదు. వందకు పైగా వినతిపత్రాలు సమర్పించాం. ఈ నాలాలో పడి ఒకరు చనిపోయారు. వాహనాలు పల్టీలు కొడుతూ నాలాలో పడుతున్నాయి. మేం నిర్మించుకుంటుంటే ఇంజనీర్లు వద్దంటున్నారు.

–నడిమింటి కృష్ణ, బీజేఆర్‌నగర్.

వరద వచ్చిందంటే నరకమే



వరదలు వస్తున్నాయంటే బస్తీకి ప్రమాదం పొంచి ఉన్నట్లు కనిపిస్తోంది. వరద ధాటికి స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. నాలా పైకప్పు లేకపోవడంతో పొరపాటున ఎవరైనా పడితే ప్రాణాలు పోయినట్లే. జీహెచ్ఎంసీ ఇంజనీర్లు వెంటనే నాలా పైకప్పు నిర్మించాలి. లేకపోతే ఎంతటి ఆందోళనకైనా సిద్ధమే.

– ఎం.జగన్, బస్తీవాసి.

దుర్గంధంతో చచ్చిపోతున్నాం



మా బస్తీలో ఓపెన్ నాలాతో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. మురుగు పేరుకుపోయి దుర్గంధం, దుర్వాసనలతో నరకం చూస్తున్నాం. ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పాతికేళ్లుగా స్లాబ్ నిర్మించకపోవడంతో బస్తీవాసులు నిర్మిద్దామని ముందుకువస్తే అధికారులు వద్దంటున్నారు.

– హనుమంతు, బస్తీవాసి

ఉత్సాహంగా రెయినీడే వేడుకలు




ఆత్మకూరి రామారావు స్కూల్‌లో రెయినీ డే వేడుకల్లో చిన్నారులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని బీవీబీపీ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో శుక్రవారం రెయినీడే వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. చిట్టిపొట్టి చిన్నారులు గొడుగులు, రెయిన్‌కోట్లతో స్కూల్‌కు వచ్చి సందడి చేశారు. వర్షంపై పాటలు, రైమ్స్, డ్యాన్స్‌లు చేస్తూ ముచ్చటగొల్పారు. పేపర్లతో రంగురంగుల పడవలు చేసి నీటిలో వదులుతూ చిన్నారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఘనంగా అమ్మవారికి కుంకుమార్చన



లక్డీకాపూల్: ఆషాఢ మాసం రెండో శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారికి ఘనంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాయలంలోని బాలాజీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వంశీ స్వామి నిర్వహించిన అమ్మవారి కుంకుమార్చనలో పాల్గొనడం తమ భాగ్యంగా భావించి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహనీయుల స్ఫూర్తితో దేశం కోసం పనిచేయాలి

లిబర్టీ: మహనీయుల స్ఫూర్తితో యువత దేశం కోసం పని చేయాల్సిన అవసరం ఉందని లోక్‌దళ్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకటరాజేశ్వరరావు అన్నారు. దేశం కోసం ఎంతో మంది మహనీయులు తమ ప్రాణాలను పణంగా పెట్టారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు బ్రిటీష్ సామ్రాజ్యవాదంపై పోరు సలిపిన యోధుడు మంగళ్ పాండే అని కొనియాడారు. స్వాతంత్ర్య యోధుడు మంగళ్‌పాండే జయంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చూసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోపిడీ, అణచివేతకు గురవుతున్న ప్రజలను సంఘటితం చేసి పోరాటాలకు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో పి.వీ.శ్రీనివాసరావు, పి.వీ.సంకీర్త తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతితో ఆట మర్చిపోలేని ఓ అనుభూతి

డెంటల్ క్లినిక్‌ను ప్రారంభించిన సైనా నెహ్వాల్


డెంటల్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న సైనానెహ్వాల్

బంజారాహిల్స్: రాష్ట్రపతి ద్రౌపదిముర్ముతో తాను ఆడిన బ్యాడ్మింటన్ ఆట తనకు మరచిపోలేని అనుభూతి అని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో వి.లిటిల్ పీడియాట్రిక్ డెంటల్ క్లినిక్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతితో తాను స్నేహపూర్వకంగా ఆడిన బ్యాడ్మింటన్ ఆట పట్ల అనుభవాలను పంచుకున్నారు. రాష్ట్రపతి కూడా బ్యాడ్మింటన్ మంచి అనుభవం ఉన్న క్రీడాకారిణి అని వెల్లడించారు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో క్వాలిటీ డెంటల్ క్లినిక్‌లు మరిన్ని రావాల్సిన అవసరం ఉందన్నారు.

శాకంబరిగా రాజరాజేశ్వరి దేవి



ఫిలింనగర్: ఆషాఢ మాసం సందర్భంగా ఫిలింనగర్ దైవసన్నిధానంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారిని భిన్న రకాల కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో శాకంబరి దేవిగా అలంకరించారు. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చారు.

చీరలోనే మగువల అందం : సినీ నటి రాశి



శ్రీనగర్‌కాలనీ: మగువల అసలైన అందం చీరలోనే ఉందని, మన సంప్రదాయ కళలకు మరింత గుర్తింపు రావాలంటే చేనేతకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించి వారి ఉత్పత్తులను ధరించాలని ప్రముఖ సినీనటి రాశి అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో శుక్రవారం బెంగాల్ హ్యాండ్లూమ్ ఆర్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిల్క్ ఆఫ్ ఇండియా సిల్క్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారులు తమ ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలతో పాటు వన్‌గ్రామ్ గోల్డ్, పలు ఫ్యాన్సీ వస్తువులను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నట్లు నిర్వాహకులు సోమనాథ్, అభిజిత్ తెలిపారు. ఈనెల 25 వరకూ ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు.

డాక్టర్ కిషన్ సేవలు వెలకట్టలేనివి



ఖైరతాబాద్: వాసవి హాస్పిటల్ వ్యవస్థాపకులు దివంగత డాక్టర్ పి.కిషన్ వైద్య రంగానికి అందించిన సేవలు వెలకట్టలేనివని ప్రముఖ వ్యాపారవేత్త పొద్దగూరి విశ్వేశ్వర్‌రావు రన్వీర్ అన్నారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని వాసవి హాస్పిటల్‌లో డాక్టర్స్, నర్సెస్, హాస్పిటల్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు చైర్మన్ గౌరిశెట్టి చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రావు రన్వీర్ మాట్లాడుతూ ఓ వైపు కార్పొరేట్ హాస్పిటల్‌లో లక్షలాది ఫీజులు తీసుకుంటుంటే పేద ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో డాక్టర్ కిషన్ వాసవి హాస్పిటల్‌ను స్థాపించారన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన వైద్యులు, నర్సులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త, వాసవి హాస్పిటల్ చైర్మన్ గంజి రాజమౌళిగుప్త, ప్రధాన కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్, కోశాధికారి సి.రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి



వెంకటేశ్వరకాలనీ: అభివృద్ధి పనులు తొందరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి కోరారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులపై కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి శుక్రవారం జీహెచ్ఎంసీ ఎస్ఈ రత్నాకర్‌తో చర్చించారు. కొత్తగా మంజూరైన డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణానికి రోడ్డు కటింగ్‌కు అనుమతులు ఇవ్వాల్సిందిగా ఆమె కోరారు. భారీ వర్షాలు కురవక ముందే పనులు ప్రారంభమయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఎరుకల కుల సమస్యలపై పోరాడుతా

ఆదివాసీ, ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా సాయి


సాయికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎరుకల సంఘం రాష్ట్ర నాయకులు

రహమత్‌నగర్: తెలంగాణ ఆదివాసీ, ఎరుకల రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎస్పీఆర్‌హిల్స్ ఎస్ఎస్‌బీనగర్‌కు చెందిన సాయి నియామకమైయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, ప్రధాన కార్యదర్శి కూతాడి రవికుమార్ రాజుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ ఎరుకల కుల సమస్యలపై పోరాడుతానని హామీ ఇచ్చారు. అనంతరం ఎరుకల సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు సాయిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి వనం రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో ఆభరణాలు చోరీ

బంజారాహిల్స్: హెయిర్ రిమూవల్ ట్రీట్‌మెంట్‌కు వెళ్లిన యువతి బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... సైనిక్‌పురిలో నివసించే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-1లోని సిటీ సెంటర్ మాల్‌లో ఉన్న మాకియో స్కిన్ సీ క్లినిక్‌లో హెయిర్ రిమూవల్ ట్రీట్‌మెంట్‌కు కోసం ఈ నెల 16న వెళ్లింది. ట్రీట్‌మెంట్‌లో భాగంగా ఆభరణాలు తొలగించాలని చెప్పడంతో వాటిని హ్యాండ్‌బ్యాగ్‌లో ఉంచి నిర్వాహకురాలు అయేషాకు ఇచ్చింది. ట్రీట్‌మెంట్ తర్వాత బ్యాగ్‌ను మరిచిపోయి ఇంటికి వెళ్లిపోయింది. ఇంటికి వెళ్లాక చూసుకుని అయేషాకు ఫోన్ చేయగా క్లినిక్ బంద్ చేశానని, తెల్లవారు చేయాలని ఆమె చెప్పింది. దీంతో ఈ నెల 17న బాధితురాలు రెండుసార్లు అయేషాకు ఫోన్ చేయగా బ్యాగ్‌లో రెండు ఉంగరాలు మాత్రమే ఉన్నాయని, మిగతా బంగారు ఆభరణాలు లేవని చెప్పింది. దీంతో బాధితురాలు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బంజారాహిల్స్ క్రైమ్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 305 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాప్‌టాప్ ఇస్తానని మోసం

వెంగళరావునగర్ : ల్యాప్‌టాప్ ఇస్తానని మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్ నివాసి కృష్ణారావుకు కృష్ణకాంత్ పార్క్ వద్ద అర్వపల్లి రామ్మూర్తితో పరిచయం అయింది. తన వ్యాపారాలు గురించి రామ్మూర్తి చెబుతూ తన వద్ద ల్యాప్ టాప్ ఉందని, తక్కువ ధరకే విక్రయిస్తానని చెప్పాడు. దీంతో కృష్ణారావు రెండు దఫాలుగా రూ. 23వేలు ఇచ్చాడు. అయితే రామ్మూర్తి మాత్రం ల్యాప్‌టాప్ ఇవ్వకుండా మూడు నెలలుగా తిప్పుతుండటంతో రామ్మూర్తిపై మధురానగర్ పీఎస్‌లో కృష్ణారావు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్యూటీకి వెళ్లిన యువతి అదృశ్యం

వెంగళరావునగర్ : డ్యూటీకి వెళ్ళిన యువతి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివసించే రాము చెఫ్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. అతని భార్య సోదరి కుమార్తె అయిన 18 ఏళ్ళ యువతి అమీర్‌పేటలోని షాపింగ్‌మాల్‌లో పని చేస్తుంది. ఈనెల 18న ఉదయం ఆ యువతి డ్యూటీకి వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఆ సమయంలో అతని బావ మరిదికి గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. తాను పలాసా జిల్లా నుంచి మాట్లాడుతున్నానని, షాపింగ్ మాల్‌లో పని చేసే యువతి బాయ్‌ఫ్రెండ్ అని చెప్పుకొచ్చాడు. తాను ఆ యువతి పెళ్ళి చేసుకుంటున్నట్టుగా ఫోన్‌లో చెప్పి కట్ చేసి స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో రాము హుటాహుటిన షాపింగ్‌మాల్‌కు వెళ్ళి చూడగా ఆ యువతి మాల్‌కు రాలేదని చెప్పారు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ రావడంతో రాము మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రెయిలీ ప్రెస్‌ను కాపాడాలి

డ్వాబ్ సంస్థ ప్రధాన కార్యదర్శి చొక్కారావు



పానుగోటి చొక్కారావు

చాదర్‌ఘాట్: అంధుల కోసం రాష్ట్రంలో ఉన్న బ్రెయిలీ పుస్తకాల ప్రింటింగ్ ప్రెస్‌ను కాపాడాలని డ్వాబ్ సంస్థ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు అన్నారు. నల్గొండ క్రాస్ రోడ్డులోని జాతీయ వికలాంగుల పార్కులో శుక్రవారం ఆయన మాట్లాడారు. సిబ్బంది లేక మలక్‌పేటలోని బ్రెయిలీ ప్రెస్ మూత పడే ప్రమాదముందని, వెంటనే సిబ్బందిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. నెల రోజుల క్రితం బ్రెయిలీ ఎడిటర్ ఉద్యోగ విరమణ చేశారని, అందులో పనిచేసే బైండర్ వేరే డిపార్ట్‌మెంట్‌లో డిప్యుటేషన్‌పై వెళ్లాడని, సిబ్బంది లేక పుస్తకాల ముద్రణ ఇబ్బందికరంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి గౌరవ వేతనం ఇచ్చి కొత్తవారికి శిక్షణ ఇప్పించాలని కోరారు. అదేవిధంగా వికలాంగుల సహకార సంస్థ ఎండీ చొరవ తీసుకొని బ్రెయిలీ ప్రెస్‌ను అత్యాధునిక టెక్నాలజీతో పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వ బ్రెయిలీ ప్రెస్ మనుగడకు తానే కేంద్ర ప్రభుత్వంతో సంబంధిత శాఖ మంత్రికి దృష్టి తీసుకెళ్లి సమస్యను వివరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పరమేష్, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

పతకాలు సాధించి సత్తాచాటుతున్న పారా అథ్లెట్స్

సాక్షి, సిటీబ్యూరో: పారా అథ్లెట్లను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణించేందుకు అవసరమైన శిక్షణ, వనరులను సమకూర్చడానికి ఆదిత్య మెహతా ఫౌండేషన్ కట్టుబడి ఉందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఆదిత్యమెహతా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫౌండేషన్‌లో శిక్షణ పొందిన పారా అథ్లెట్స్ బెంగళూరులోని శ్రీకంఠీరవ స్టేడియంలో జరిగిన 13వ జాతీయ జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో సత్తాచాటారని తెలిపారు. మొత్తం 16 పతకాలు సాధించారని వివరించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయ(జేఎన్వీ) సహకారంతో ఆదిత్య మెహతా ఫౌండేషన్‌లో శిక్షణ పొందారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సాధించిన పతకాలపై గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తామని తెలిపారు.

ఆర్మీ జవాన్లకు రాఖీలు పంపిన విద్యార్థినులు



రాఖీలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ పద్మావతి, విద్యార్థులు

సనత్‌నగర్: రానున్న రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్మీ జవాన్లకు రాఖీలను పంపించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో పాటు విద్యార్థినులు మొత్తం 78 రాఖీలను దేశ సైనికులకు పంపించాల్సిందిగా కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి చేతులమీదుగా సంస్కృతి ఫౌండేషన్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంస్కృతి ఫౌండేషన్ మెంబర్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నర్సింహులు, సరిత, మధుకర్‌రావు, సరోజినీ చక్రవర్తి, ఇతర అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.


ఆపరేషన్ ముస్కాన్‌తో చిన్నారుల జీవితాల్లో వెలుగు



ఆపరేషన్ ముస్కాన్-10 పోస్టర్ ఆవిష్కరిస్తూ..

సాక్షి, సిటీబ్యూరో: బాలకార్మికులు, భిక్షాటన చేస్తున్న వీధి బాలలను గుర్తించి వారి జీవితాల్లో వెలుగు నింపాలని హైదరాబాద్ అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి పిలుపునిచ్చారు. హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశం మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-10 సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎలాంటి ఆశ్రయం, నిరాధారణకు లోనైనా పిల్లలను గుర్తించేందుకు అన్ని శాఖలు సమష్టితో పనిచేయాలని అన్నారు. రెవెన్యూ సిబ్బంది వృత్తిపరమైన, వ్యక్తిగతమైన బాధ్యతగా శ్రద్ధతో పనిచేయాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం చేపడుతున్న ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ఇప్పటికీ 89 మంది బాల కార్మికులను, వీధి బాలలను గుర్తించి ఆశ్రయం కల్పిస్తున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ ఆపరేషన్ ముస్కాన్ 10 పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వైద్య అధికారి డాక్టర్ వెంకట్, డీఈఓ రోహిణి, ఏసీపీ ఆంజనేయులు, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ జాన్సన్, డీసీపీఓ శ్రీనివాస్, ఆర్డీఓ మహిపాల్, ఎస్‌హెచ్ఓలు, కార్మిక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

21న శ్రీవైష్ణవ సేవా సంఘం రజతోత్సవం



శ్రీవైష్ణవ సేవా సంఘం రజతోత్సవ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రమణాచారి, వేణుగోపాలచారి

లక్డీకాపూల్: శ్రీవైష్ణవ సేవా సంఘం ఈ నెల 21న రజతోత్సవ వేడుకలను జరుపుతున్నట్లు సంఘం అధ్యక్షులు తిరువెంగళాచార్యులు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రజతోత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను మాజీ ఐఏఎస్ అధికారి రమణాచార్యులు, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. స్ఫూర్తిదాయకమైన రీతిలో అనేక ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతున్న సంఘం ఆవిర్భవించి 21 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ వేడుకలను జరుపుకుంటున్నట్లు తెలిపారు. మన్నెగూడలోని జీఎంఆర్ శారదా కన్వెన్షన్‌లో నిర్వహించే ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా జీయర్ స్వామి హాజరవుతారన్నారు. విశిష్ట అతిథులుగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పురస్కారాలు, వివిధ జిల్లాలకు చెందిన విశిష్ట వ్యక్తులకు సన్మానం చేస్తామని తెలిపారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. సమావేశంలో శ్రీవైష్ణవ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి సేనాపతి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లీజ్.. అడాప్ట్..









- జూ పార్కులో దత్తతకు ఆహ్వానం
- పెద్దఎత్తున ప్రచారంతో అనూహ్య స్పందన
- స్వయంగా ఆహారం అందించే వెసులుబాటు
- ఉత్సాహం చూపుతున్న విద్యార్థులు
- సీఎస్ఆర్‌లో భాగంగా సాఫ్ట్‌వేర్ సంస్థలు

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని వన్యప్రాణుల దత్తత(అడాప్ట్)కు ప్రజల నుంచి స్పందన కోసం జూ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కొన్ని సంవత్సరాల నుంచి దత్తతను ఆన్‌లైన్‌లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నెహ్రూ జులాజికల్ పార్క్‌ను సందర్శించిన సందర్శకుల్లో కొందరే దత్తతకు ముందుకు వస్తున్నారు. ఎస్‌బీఐ బ్యాంకుతో పాటు వివిధ కంపెనీలు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు వన్యప్రాణుల దత్తతను నిర్విరామంగా కొనసాగిస్తున్నాయి. పాఠశాల విద్యార్థులు, ఐటీ కంపెనీలు సీఆర్‌సీలో భాగంగా వన్యప్రాణుల దత్తతను కొంత కాలంగా కొనసాగిస్తున్నారు. నెహ్రూ జూలాజికల్ పార్క్‌ను వినోద ప్రదేశంగా కాకుండా విశ్వవిద్యాలయంగా అనేక కొత్త విషయాలను నేర్పించేలా కృషి చేస్తున్నారు. దీంతో సంవత్సరం పొడవునా వచ్చే ప్రతి కార్యక్రమాన్ని జూలో విస్తృతంగా నిర్వహిస్తుండటం, దత్తతపై జోరుగా ప్రచారం చేస్తుండటంతో కొంతకాలంగా చక్కటి స్పందన లభిస్తోంది.

దత్తత దాతలకు జూలో వెసులుబాటు..

నెహ్రూ జూలాజికల్ పార్కులో వన్యప్రాణులను దత్తత తీసుకున్న దాతల పేర్లు ఆయా ఎన్‌క్లోజర్ వద్ద బోర్డు ఏర్పాటు చేస్తారు. ఆయా వన్యప్రాణులకు స్వయంగా ఆహారం అందించే వెసులుబాటు కల్పిస్తారు. జూలో ఉచిత ప్రవేశాన్ని కూడా కల్పిస్తారు.

జూ పార్కులో దత్తతకు సంబంధించిన వన్యప్రాణుల వివరాలు..

వన్యప్రాణులు	రోజుకు	నెలకు	సంవత్సరానికి
ఎలిఫెంట్, జిరాఫీ	రూ.5 వేలు	రూ.25 వేలు	రూ.5 లక్షలు
టైగర్, లయన్	రూ.2వేలు	రూ.25 వేలు	రూ.3 లక్షలు
పాంతర్, జాగ్వార్, చీత,	రూ.వెయ్యి	రూ.10 వేలు	రూ.1.5 లక్షలు
బియార్, చింపాంజీ రిహినో, హిప్పో	రూ.వెయ్యి	రూ.10 వేలు	రూ.2 లక్షలు
హైనా, ఉల్ఫ్, జాకల్,	రూ.వెయ్యి	రూ.10 వేలు	రూ.లక్ష
స్మాల్ క్యాట్స్, వైల్డ్ డాగ్ బాబూన్స్, లాంగూర్ తదితర	రూ.వెయ్యి	రూ.10 వేలు	రూ.లక్ష
క్రోకడైల్, వాటర్ మానీటర్,	రూ.500	రూ.5 వేలు	రూ.50 వేలు
లీజర్డ్, యనిమల్స్ కింగ్ కోబ్రా, పైథాన్	రూ.వెయ్యి	రూ.10 వేలు	రూ.లక్ష
కామన్ కోబ్రా, ర్యాట్ స్నేక్, మానిటర్ లీజర్డ్	రూ.500	రూ.5వేలు	రూ.50వేలు
స్మాల్ బర్డ్స్ (5)	రూ.500	రూ.5వేలు	రూ.50వేలు
ఆస్ట్రిచ్ (ఫ్లైట్‌లెస్)	రూ.వెయ్యి	రూ.10 వేలు	రూ.లక్ష
రేహా, ఈము, ఫ్లైట్‌లెస్	రూ.వెయ్యి	రూ.10వేలు	రూ.లక్ష
మకావ్ (1)	రూ.వెయ్యి	రూ.10 వేలు	రూ.లక్ష
మీడియం సైజ్ బర్డ్స్(1), వాటర్ బర్డ్స్(1)	రూ.వెయ్యి	రూ.10 వేలు	రూ.లక్ష

బోనాలకు రావాలంటూ కేసీఆర్‌కు ఆహ్వానం



సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లో ఈ నెల 21న జరిగే బోనాలకు హాజరు కావాల్సిందిగా మాజీ ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్‌రావుకు శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ ఆహ్వానించారు. తన కుటుంబ సభ్యులతో కలిసి ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన పద్మారావుగౌడ్ ఆహ్వాన పత్రాన్ని కేసీఆర్‌కు అందజేశారు. కార్యక్రమంలో పద్మారావుగౌడ్ కుమారులు కిషోర్, రామేశ్వర్, కళ్యాణ్, త్రినేత్ర, టీఆర్ఎస్ నాయకుడు సుంకు రాంచందర్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు ఉధృతం

3.50 కేజీల గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఎక్సైజ్ శాఖ దాడులను ఉధృతం చేసింది. గంజాయి, డ్రగ్స్ సరఫరాపై ఉక్కుపాదం మోపింది. ధూల్‌పేట్ ప్రాంతంలో 24 గంటల పాటు దాడులను కొనసాగిస్తున్నారు. ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన దాడుల్లో గంజాయి, గంజాయి చాక్లెట్లు పట్టుబడ్డాయి. వికారాబాద్‌లో 250 గ్రాముల గంజాయి, ఉప్పల్‌లో 425 గాముల గంజాయి చాక్లెట్స్, సరూర్‌నగర్ 500, బాలానగర్‌లో 250, మూసాపేట్‌లో 200 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. ధూల్‌పేట్‌లో 1.3 కిలోల గంజాయిని, మేడ్చల్ ఎక్సైజ్ పరిధిలో 780 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెప్పారు. ఈ ఘటనల్లో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి, పలు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

శాస్త్రోక్తంగా ప్రారంభమైన
లాల్‌దర్వాజా బోనాలు



చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ 116వ బోనాల ఉత్సవాలు శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రాతో కలిసి శిఖర పూజ, ధ్వజారోహణ గావించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అంతకుముందు ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహయ్య శర్మ అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్ కలశస్థాపన పూజలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సతీమణి కొత్తకోట సుచరితరెడ్డి ఉత్సవాల బ్రోచర్‌ను విడుదల చేశారు. అమ్మవారికి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎ.మాణిక్ ప్రభుగౌడ్ కుటుంబ సభ్యులు తొలిబోనం సమర్పించారు. జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న, దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్, ఛత్రినాక ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్, ఆర్ఎస్.బ్రదర్స్ అధినేత వెంకటేశ్వర్లు, కమిటీ ప్రధాన కార్యదర్శి బి.మారుతీ యాదవ్, కన్వీనర్ జి.అరవింద్ కుమార్ గౌడ్, కోశాధికారి పి.సతీష్ ముదిరాజ్, కమిటీ ప్రతినిధులు విష్ణుగౌడ్, కె.వెంకటేష్, ఎ.మాణిక్ ప్రభుగౌడ్, సి.రాజుకుమార్ యాదవ్, ఎ.వినోద్ కుమార్, ఎ.చంద్రకుమార్, శేషు నారాయణ, రవి పాల్గొన్నారు.

బోనాలకు బందోబస్తు: సీపీ

లాల్‌దర్వాజా బోనాల జాతర ఉత్సవాలకు వెయ్యి మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆనవాయితీలో భాగంగా లాల్‌దర్వాజా బోనాలను కొత్వాల్ స్థానంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ప్రజలకు ఈ పండుగ ఎంతో ముఖ్యమైందన్నారు. ఉత్సవాలను జరుపుకునేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కమిటీ సభ్యులంతా ఐకమత్యంగా ఉంటూ ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

బ్యాంకులను ప్రైవేటీకరిస్తే ప్రజలకు ఇబ్బందులే..



ర్యాలీలో రాంబాబు, బీఎస్.మధుసూదన్, కోటిరెడ్డి, వినయ్‌కుమార్

అబిడ్స్: కేంద్ర ప్రభుత్వం బ్యాంకులను ప్రైవేటీకరిస్తే ప్రజలు సహించరని ఆల్ ఇండియా ఐబియా సెక్రెటరి రాంబాబు, కెనరా బ్యాంక్ తెలంగాణ సెక్రెటరి బీఎస్.మధుసూదన్, సెంట్రల్ కమిటీ సభ్యుడు కోటిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ బ్యాంకులు బడుగు బలహీన వర్గాలతో పాటు అన్నివర్గాల ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐబియా దేశమంతటా శుక్రవారం ఆందోళన చేపట్టింది. అందులో భాగంగా ట్యాంక్‌బండ్ సెక్రటేరియట్ నుంచి ఐమాక్స్ వరకు పెద్ద ఎత్తున ఐబియా ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన రాంబాబు, బీఎస్.మధుసూదన్, కోటిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరిస్తే ప్రజలు తీవ్ర మోసాలకు గురవుతారన్నారు. దేశం నలుమూలలా 736 ప్రైవేటు బ్యాంకులు మూతపడ్డాయని వారు వివరించారు. ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరణ చేయనివ్వమని తమ యూనియన్ అడ్డుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సీఎం ప్రత్యేక చొరవ

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి



అర్జీదారుడి సమస్య తెలుసుకుంటున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి

లక్డీకాపూల్: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తుదారులను ఆయన స్వయంగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈక్రమంలో సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజావాణిని ఆశ్రయించిన అర్జీదారులకు తప్పకుండా ఉపశమనం లభిస్తుందంటూ భరోసా కల్పించారు. ప్రజావాణికి మొత్తం 545 దరఖాస్తులు రాగా అందుకు రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 95 ఉన్నాయి. పౌరసరఫరాల శాఖకు సంబంధించి 84, విద్యుత్ శాఖకు సంబంధించి 82, సంబంధించి 79 దరఖాస్తులు, పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు 47, ఇతర శాఖలకు సంబంధించి 158 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రానికి స్వర్ణం ఖాయం

విజయపథంలో తెలంగాణ సెయిలర్లు

సాక్షి, సిటీబ్యూరో: సాగర్ వేదికగా మాన్‌సూన్ రెగట్టా ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ సెయిలర్లు గోవర్ధన్ పల్లార, దీక్షిత కొమరవెల్లి, ఒడిశాకు చెందిన అలియా సబ్రీన్‌లు సత్తాచాటారు. అండర్-16 ఆప్టిమిస్ట్ ఫ్లీట్ విభాగంలో గోవర్ధన్ స్వర్ణంతో పాటు మాన్‌సూన్ రెగట్టా ట్రోఫీని ఖాయం చేసుకున్నాడు. దీక్షితకు రజతం ఖాయం అవ్వగా.. తెలంగాణకే చెందిన రిజ్వాన్ మొహమ్మద్ అనూహ్యంగా ముందుకొచ్చి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. అండర్-18 అంతర్జాతీయ 420 మిక్స్‌డ్ డబుల్స్‌లో తనుజా కామేశ్వర్ - గణేష్ పీర్కట్ల, వైష్ణవి వీరవంశం -శ్రవణ్ కత్రావత్ చెరో 14 పాయింట్లతో స్వర్ణం, రజతం కోసం పోటాపోటీగా తలపడుతున్నారు.



హైదరాబాద్ నగరం మెడికల్ క్యాపిటల్

- చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- మహిళా దక్షిత సమితి, బన్సీలాల్ మలానీ నర్సింగ్ కళాశాల స్నాతకోత్సవం



విద్యార్థికి పట్టా అందజేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

హఫీజ్‌పేట్: హైదరాబాద్ నగరం మెడికల్ క్యాపిటల్‌గా మారిందని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. చందానగర్‌లో మహిళా దక్షిత సమితి, బన్సీలాల్ మలానీ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు స్నాతకోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌ను మెడికల్ హబ్‌గా మార్చేందుకు దేశ ప్రధాని నరేంద్రమోదీ తీసుకుంటున్న చర్యలతో సాధ్యమవుతోందన్నారు. హైదరాబాద్ నగరానికి చికిత్సల కోసం పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, అమెరికా, ఇంగ్లాండ్, ఇటలీ దేశాలకు చెందిన వారు వచ్చి ఇక్కడి వైద్య సేవలను పొందుతున్నట్లు చెప్పారు. నగరంలో డాక్టర్లు, నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వారు విదేశాలకు కూడా వెళ్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఉత్తరప్రదేశ్, గుజరాత్ నుంచి వచ్చిన వారి ఆర్థిక సహాయంతో కొనసాగించడం అభినందించదగ్గ విషయమన్నారు. భారత ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావు ఈ సంస్థలకు చందానగర్‌లో స్థలం ఇచ్చారని, భారత రాష్ట్రపతిగా ఉండే ప్రణబ్‌ముఖర్జీ, భారత ఉపరాష్ట్రపతి వెంకటయ్యనాయుడు వంటి ప్రముఖుల ఈ విద్యాసంస్థకు వచ్చారని ఆయన గుర్తు చేశారు. నా పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో సేవా దృక్పథంతో పని చేసే వారు ఉన్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. పేద పిల్లలకుదారి, ఉపాధి, చదువు అందించే కోర్సులకు ఏర్పాట్లు చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. మహిళా దక్షిత సమితి అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 7వేల మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారన్నారు. బీఎస్సీ నర్సింగ్ సీట్లను 50 నుంచి 140కి పెంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సభ్యుడు డాక్టర్ రమేష్ దమాని, డాక్టర్ రామ్‌విలాస్ సబూ, జైరాజ్ ఇస్పాత్ లిమిటెడ్ ఎడీ సజ్జన్‌కుమార్ గొయెంకా, పారిశ్రామికవేత్త ప్రకాష్ గొయెంకా, షాలిన్‌మంత్ర, ఎండీఎస్ కార్యదర్శి అనుజామలాని, ప్రిన్సిపల్ హెచ్.సుశీల, అధ్యాపకులు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీర్ఘాయుష్మాన్‌భవ

అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సలకు నిమ్స్ వేదికగా నిలిచింది. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రి మెట్లెక్కిన రోగులను అక్కున చేర్చుకుని ఆదరిస్తోంది. తీవ్రమైన నొప్పుల నుంచి ఉపశమనం కల్పిస్తోంది. వాస్తవానికి రిఫరల్ ఆస్పత్రి అయిన నిమ్స్‌లోని వైద్యులు ఆరోగ్య సమస్య ఏదైనప్పటికీ సవాల్‌గా తీసుకుని విజయవంతంగా వైద్యసేవలు అందిస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా వేగంగా కొట్టుకుంటున్న గుండెకు కళ్లెం వేయడం, ఊపిరితిత్తుల్లోంచి గుండెవైపు దూసుకుపోయిన బాణాన్ని చాకచక్యంగా బయటకు తీసి రోగికి పునర్జన్మ ప్రసాదించడాన్ని పేర్కొనవచ్చు. అందుకే ఇక్కడి వైద్యులు అందిస్తున్న సేవలకు రోగులు, వారి బంధువులు నీరాజనాలు పలుకుతున్నారు. కొంత మంది ప్రత్యక్షంగా వచ్చి వైద్యులను కలిసి తమ కృతజ్ఞతలు తెలుపుతుండగా మరి కొంతమంది సోషల్ మీడియా వేదికగా తమ సంతోషాన్ని పంచుకుంటున్నారు. - లక్డీకాపూల్



- నిమ్స్‌కు పెరుగుతున్న రోగుల తాకిడి
- పేదలకు ఆరోగ్య ప్రధాయినిగా గుర్తింపు
- అందుబాటులోకి మరిన్ని వైద్య సేవలు
- అత్యవసర రోగులకు పునర్జన్మ ప్రసాదిస్తూ..
- అందరి మన్ననలు పొందుతున్న వైద్యులు

నిమ్స్ అంటే పేదల ఆస్పత్రి అనుకుంటే పొరపాటే.. ఇక్కడ అధికార అనధికార ప్రముఖులు ఎంతో మంది కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుకుంటున్నారు. ఈ క్రమంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ నిమ్స్‌లో ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకుని తద్వారా ఉన్నతస్థాయి అధికారులు నిత్యం వైద్య సేవలు అందుకుంటున్నారు.

ఆరోగ్యశ్రీ సేవలకు కేంద్రంగా..

నిమ్స్ ప్రస్తుతం ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు అండగా నిలుస్తోంది. ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ పథకాల ద్వారా ఇక్కడ ఎంతో మంది మెరుగైన వైద్యసేవలను పొందుతున్నారు. దీంతో 1500 పడకలు, 100 పడకల అత్యావసర విభాగంలో నిత్యం రోగులతో నిమ్స్ కిటకిటలాడుతోంది. పడకల సామర్థ్యానికి మించి రోగులు వస్తున్నప్పటికీ సాధ్యమైనంత వరకు చికిత్స అందిస్తున్న పరిస్థితి. ఇటీవల కాలంలో ఓపీ రోగుల సంఖ్య 3 వేలకు దాటిపోయింది. సాధారణ రోగులు రూ.100లతో ఓపీ కార్డు తీసుకుంటే 14 రోజుల పాటు సేవలు పొందవచ్చు. ఓపీ కార్డు కాలపరిమితి ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్, ఎస్‌సీసీఎల్, ఈఎస్ఐలకు కూడా 14 రోజులే. అదే ఆరోగ్యశ్రీ రోగులకు నెల రోజులు వెసులుబాటు. ఈ క్రమంలో సంవత్సరానికి 7 లక్షల మంది ఓపీడీ సేవలు పొందుతుండగా.. అందులో 3 లక్షల మంది ఆరోగ్యశ్రీ లబ్ధిదారులే. ఇక ఆరోగ్యశ్రీ డే కేర్ డయాలసిస్ సేవలను 70 వేల మంది, 3 వేల మంది ఆరోగ్యశ్రీ కీమోథెరపీ డే కేర్ సేవలను పొందుతున్నారు. ఈ నేపథ్యంలో పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా యాజమాన్యం ఓపీ సేవలకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రత్యేక సేవలను పరిశీలిద్దాం.

ఓపీడీ బ్లాక్, అంకాలజీ బ్లాక్..

అవుట్ పేషెంట్ విభాగం భవనంలో ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీ, జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ ఎండోక్రైనాలజీ, హెమటాలజీ, గైనకాలజీ, క్లినికల్ ఫార్మాకాలజీ అండ్ థెరపటిక్స్, మెడికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, స్టాఫ్ క్లినిక్ సేవలు పొందవచ్చు. ఇందుకు సాధారణ రోగులకు ఓపీ కార్డు జారీ కేంద్రాలు 5, నిమ్స్ సిబ్బంది, సీజీహెచ్ఎస్, ఈహెచ్ఎస్ నిమ్స్‌లకు 2 కౌంటర్లు, ఈహెచ్ఎస్ మిత్రాకు 1, వెల్‌నెస్ సెంటర్ దగ్గర డే కేర్ డయాలసిస్ సేవలకు ఒకటి చొప్పున కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఇక ఆరోగ్యశ్రీ రోగులకు రెండు, ఆరోగ్య మిత్రకు రెండు చొప్పున కౌంటర్ నెం.39లో కౌంటర్లు ఉన్నాయి.

మిలీనియం బ్లాక్..

మిలీనియం బ్లాక్‌లో న్యూరాలజీ, న్యూరోసర్జరీ, రుమటాలజీ విభాగాల సేవలకు సాధారణ రోగులకు ఏడు ఓపీ కౌంటర్లు కాగా. ఆరోగ్యశ్రీ రోగులకు ప్రత్యేకంగా రెండు కౌంటర్లు ఉన్నాయి.

స్పెషాలిటీ బ్లాక్‌లో..

స్పెషాలిటీ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, డెర్మటాలజీ, డెంటల్ సేవలకు పేయింగ్ కౌంటర్లు 5, ఒక ఈహెచ్ఎస్ మిత్ర కౌంటర్ ఉన్నాయి. ఆరోగ్యశ్రీ రోగులకు రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. నాల్గో అంతస్తులో సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ జెనెటిక్స్, పల్మనాలజీ విభాగాలకు సంబంధించి రెండు పేయింగ్ కేంద్రాలున్నాయి. ఐదో అంతస్తులో వాస్క్యులర్ సర్జరీ, మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, మెడికల్ జెనిటిక్స్ విభాగాలకు 3 సాధారణ ఓపీ కౌంటర్లు, ఆరో అంతస్తులో యూరాలజీ విభాగానికి ఒక పేయింగ్ కౌంటర్ ఉన్నాయి.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌, శనివారం, 20, జూలై, 2024





నేతి రుచులు

మాదాపూర్‌లో ఆకట్టుకుంటున్న రామేశ్వరం కేఫ్‌

- శని, ఆదివారాల్లో ప్రముఖులు, సినీతారలు
- స్వచ్ఛమైన నెయ్యితో అల్పాహారం తయారీ
- మసాలా టీ, ఫిల్టర్‌ కాఫీల ఘుమఘుమలు
- టెంపుల్‌ థీమ్‌తో ఆకట్టుకుంటున్న కేఫ్‌

స్వచ్ఛమైన నేతితో తయారు చేసిన అల్పాహారాలకు కేరాఫ్‌ అడ్రస్‌గా మాదాపూర్‌లోని రామేశ్వరం కేఫ్‌ నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నగరంలోని ఆహార ప్రియులు ఒక్కసారైనా ఈ కేఫ్‌లో నేతితో తయారు చేసిన ఆహారపదార్థాలు రుచిచూడక మానరు. ఇక వారాంతాల్లో అయితే నగరవాసులు టోకెన్ల కోసం కౌంటర్‌ వద్ద క్యూ కడుతుంటారు. వీరితోపాటు ప్రముఖులు, సెలబ్రిటీలు సైతం రామేశ్వరం కేఫ్‌ను విజిట్‌ చేస్తుంటారంటే ఆశ్చర్యం కలగక మానదు. - మాదాపూర్‌





మాదాపూర్‌లోని రామేశ్వరం కేఫ్‌లో అల్పాహారానికి ఓ ప్రత్యేకమైన రుచి ఉంది. అందుకే నగరవాసులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి మరీ ఇక్కడి టిఫిన్‌లను రుచి చూస్తుంటారు. టెంపుల్‌ థీమ్‌తో ఏర్పాటు చేసిన ఈ హోటల్‌ చూడడానికి ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ప్రముఖులు, సినీతారలు సైతం వచ్చి చాయ్‌ను ఆస్వాదిస్తుంటారు. దాదాపు 150 రకాలకుపైగా టిఫిన్స్‌, స్నాక్స్‌, భోజనం, మాక్‌టైల్స్‌, జూసులు అందుబాటులో ఉంటాయి.

రోజుకు 800 టోకెన్లు..

ప్రతి రోజు 800వందల నుంచి 1000 మంది టోకెన్‌లు తీసుకుంటుంటారు. ఇక శని, ఆదివారాల్లో 1200 నుంచి 1400 వందల వరకూ టోకెన్స్‌ తీసుకుంటుంటారు. టెంపుల్‌ వంటకాలను ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. రైస్‌లో టెంపుల్‌ పులహోర, బిసిబెల్లాబాత్‌, కర్డ్‌రైస్‌, గొంగూరరైస్‌లు అందుబాటులో ఉన్నాయి.
టిఫిన్స్‌లో స్పైసీ వడ, చక్కెర పొంగలి, నెయ్యి దోశ, నేతి ఇడ్లీ ఇక్కడ ప్రత్యేకంగా నిలుస్తాయి.

రకరకాల దోశలు...

మల్టీ గ్రెయిన్‌ దోశ, బటర్‌ మసాలా దోశ, ఘీ పొడి దోశ, మసాలా దోశ, రవ్వ మసాలా దోశ, ఘీ రాగి దోశ, ఘీ ఆనియన్‌ దోశ, ఘీ ఆనియన్‌ ఊతప్పం, గార్లిక్‌, పుదీనా, మసాలా, ఉప్మా, జైన్‌ మసాలా దోశలు ప్రత్యేక ఫ్లేవర్‌తో తయారు చేయడంతో వీటి కోసం అల్పాహార ప్రియులు ఎగబడుతుంటారు. వీటితోపాటు సాంబార్‌ వడ, పెరుగు వడ, క్యారెట్‌ హల్వా, మిర్చి బజ్జీ, వంటి వెరైటీలూ భలే రుచిగా ఉంటాయని ఆహార ప్రియులు చెబుతుంటారు.



పసందైన పానీయాలు

బ్లాక్‌కాఫీ, బాదంమిల్క్‌, బూస్ట్‌, కాఫీ, హార్లిక్స్‌, లెమన్‌టీ, మసాలా బటర్‌మిల్క్‌, వివిధ రకాల పళ్ల రసాల మిల్క్‌షేక్‌లు అందుబాటులో ఉంటాయి.

నేడు 'ఆరంభ్‌' చిత్రప్రదర్శన

మాదాపూర్‌: స్థానిక చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌గ్యాలరీలో శనివారం ఆరంభ్‌ పేరిట చిత్రప్రదర్శనను ఏర్పాటు చేయనున్నారు. 28 మంది చిత్రకళాకారులు వేసిన చిత్రాలను ప్రదర్శించనున్నారు. రెండు రోజుల పాటు అందుబాటులో ఉండే ఈ ప్రదర్శన ఉదయం 11గంటలకు ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు.



సమయం తక్కువ ఇస్తున్నారు.. సృజన ఎక్కువ ఆశిస్తున్నారు.. యాడ్‌ ఫిల్మ్‌ రంగం గురించి ఇలా చెబుతున్నారు యమునా కిషోర్‌. తెలుగులో సినిమా దర్శకులు అంటే బోలెడన్ని పేర్లు చెప్పగలమేమో గానీ, ప్రచార చిత్రాల దర్శకులు అంటే మనం భూతద్దం పెట్టి వెతకాల్సిందే. అలా వెతికితే దొరికే పేర్లలో ముందుంటారు యమునా కిషోర్‌. అచ్చ తెలుగు ప్రచార చిత్రాల దర్శకుడిగా ప్రస్తుతం ఆయన టాప్‌ గ్రేడ్‌లో ఉన్నారు. నాగార్జున, వెంకటేష్‌, మహేష్‌బాబు, రానా, అఖిల్‌, రామ్‌ చరణ్‌.. వంటి స్టార్స్‌తో వర్క్‌ చేయడంతో పాటు ఎవరూ ఊహించని విధంగా కె.విశ్వనాథ్‌, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, యాంకర్‌ సుమ.. వంటివారిని యాడ్స్‌లోకి తీసుకొచ్చి ట్రెండ్‌ సెట్టర్‌గా మారారు. 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అనుభవాలను పంచుకున్నారు.. ఆ విశేషాలు.. -సాక్షి, సిటీబ్యూరో

యాడ్‌ ఆన్‌..

స్వర్గసీమ, సువర్ణభూమి, ఆర్‌ఎస్‌ బ్రదర్స్‌, నూజివీడు సీడ్స్‌, కావేరీ సీడ్స్‌... వంటి ఎన్నో పేరున్న బ్రాండ్స్‌కి పనిచేశారు యాడ్‌ డైరెక్టర్‌ యమునా కిషోర్‌. దాదాపు 17 ఏళ్ల క్రితం అంటే 2007లో సంస్కారవంతమైన సోప్‌ ద్వారా ఈ రంగంలోకి వచ్చాను. అప్పటి నుంచీ ప్రతి ఏటా ఏదో ఒక టాప్‌ యాడ్‌ రావడం వల్ల అప్పటి నుంచి విజయవంతమైన యాడ్‌ ఫిల్మ్‌ మేకర్‌గా ఈ రంగంలో ఉన్నాను. ఇప్పటి వరకూ సెకండ్‌ ఇన్నింగ్స్‌ అనేదే లేదు. కేవలం కరోనా సమయంలో తప్ప ఎప్పుడూ ఖాళీగా లేను.

- క్రియేటివిటీ.. క్వాలిటీ రెండూ కావాలి
- తక్కువ సమయంలో ఎక్కువ పని
- ఈ రంగంలో అవకాశాలు పుష్కలం
- యాడ్‌ డైరెక్టర్‌ యమునా కిషోర్‌



అడ్వర్టైజ్‌మెంట్స్‌ రంగం గతం కంటే ఎక్కువ అవకాశాలు అందిస్తోంది. కొత్త కొత్త విభాగాలు వస్తుండడం వల్ల చాలా మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. నటీనటుల మేకప్‌ కోసం ఒకప్పుడు

అవకాశాలు పుష్కలం...

సినిమా వాళ్లని వినియోగించే వారు. ఇప్పుడు యాడ్‌ ఫిల్మ్‌ కోసం ప్రత్యేకంగా నియమించుకుంటున్నారు. అలాగే స్టైలింగ్‌, కాస్ట్యూమ్‌ డిజైనింగ్‌, లాంగ్వేజ్‌ కో-ఆర్డినేటర్లు, ఇంటిమసీ కో-ఆర్డినేటర్లు, ఫుడ్‌ స్టైలిస్ట్స్‌, నెయిల్‌ క్లోజ్‌గా చూపాలంటే నెయిల్‌ మోడల్స్‌, లెగ్స్‌ని క్లోజ్‌గా చూపాలంటే లెగ్‌ మోడల్స్‌.. ఇక ఆర్ట్‌ డిపార్ట్‌మెంట్‌లో కూడా అనేక విభాగాల నుంచి అవకాశాలు పెరిగాయి.

సెలబ్రిటీల రెమ్యునరేషన్‌ భారీగా ఉంటోంది. కాబట్టి..సెలబ్రిటీ ఇచ్చే ప్రతి నిమిషం అత్యంత విలువైనదే. సెలబ్రిటీకి సినిమాల తరహాలోనే యాడ్‌ ప్లాట్‌ చెప్పి ఒప్పించాలి. వాళ్లు ఇచ్చిన టైమ్‌లో ఎన్ని వీలైతే అన్ని యాడ్స్‌ తీసేయాలి. అది యాడ్‌ ఫిల్మ్‌ మేకర్‌కి పెద్ద టాస్క్‌గా మారుతోంది. అందుకే చేయి తిరిగిన యాడ్‌ ఫిల్మ్‌ మేకర్స్‌నే సెలక్ట్‌ చేస్తున్నారు. ఉదాహరణకి నేను మహేష్‌ బాబుతో ఓ యాడ్‌ షూట్‌ కోసం వర్క్‌ చేశాను. ఆ యాడ్‌లో భాగంగా షాప్‌ కీపర్‌తో, పారిశ్రామిక వేత్తలతో, ఓ ఇంట్లో కుటుంబ సభ్యులతో మహేష్‌ మాట్లాడతారు.. ఇవన్నీ మూడు వేర్వేరు తరహా నేపథ్యాలు కలిగినవి. అయితే ఈ మూడూ ఒకే సమయంలో షూట్‌

సెలబ్రిటీతో వర్క్‌ సంక్లిష్టమైన టాస్క్‌...

చేయడానికి మూడు సెట్లు ఒకే చోట వేశాం. సెలబ్రిటీలు ఇచ్చిన సమయం వృథా కాకుండా వారి నుంచి గరిష్ట ప్రయోజనం పొందడం ఇందులోని ముఖ్యమైన అంశం.





సెలబ్రిటీల్లా.. సంస్థల యజమానులు

యాడ్‌ ఫిల్మ్‌కి సంస్థ యజమానులే మోడల్స్‌గా మారడం అనేది చాలా కాలం క్రితమే మొదలైనా.. లలితా జ్యుయలర్స్‌ యాడ్‌ తర్వాత బాగా పెరిగింది. చాలా మంది అదే దారిలో ప్రయత్నం చేస్తున్నారు. అయితే అతి కొద్ది మంది మాత్రమే సక్సెస్‌ అవుతున్నారు. ఉదాహరణకు స్వర్గసీమ రియల్‌ ఎస్టేట్‌ సంస్థకు చెందిన చంద్రశేఖర్‌ గారి గురించి చెప్పొచ్చు. ఆయనతో మేం రూపొందించిన యాడ్‌ ఫిల్మ్‌ కోసం ఒకే రోజు 25 క్యారెక్టర్లు షూట్‌ చేశాం. ఆయన పూర్తి స్థాయి ప్రొఫెషనల్‌ ఆర్టిస్ట్‌లా వరుసగా క్యారెక్టర్లు మారుతున్నా ఏ మాత్రం విసుగు చెందకుండా ప్రతి పాత్రలోనూ లీనమై చేశారు. అలాంటి అంకిత భావం ఉంటే తప్ప సంస్థ యజమాని అయినంత మాత్రాన వాళ్లు చేసిన యాడ్స్‌ హిట్‌ కావు.

క్రియేటివిటీతో పాటు స్పీడ్‌ కూడా..

యాడ్‌ ఫిల్మ్‌ తయారయ్యాక ప్రదర్శించడానికి ఒకప్పుడు టీవీలు లాంటి ఒకటో రెండో మాత్రమే ఉండేవి. సోషల్‌ మీడియా ఆగమనం తర్వాత విభిన్న రకాల వేదికలు వస్తున్నాయి. యాడ్స్‌ రూపకల్పన సమయంలోనే వాటిని ప్రదర్శించే వేదికల్ని కూడా దృష్టిలో పెట్టుకుంటున్నారు. ముఖ్యంగా ఈ రంగంలో వేగం, అదే సమయంలో సృజనాత్మకత కూడా పెరిగింది. ఇప్పుడు వీక్షకులు ఎక్కువ నిడివి ఉండే యాడ్స్‌ చూడడం లేదు. కాబట్టి వారిని కొన్ని సెకన్లలోనే ఆకట్టుకునేలా యాడ్‌ తీయగలగాలి. అదే సమయంలో క్రియేటివిటీ మిస్‌ కాకుండా చూసుకోవాలి.





మలచుకుంటేనే.. గెలుచుకుంటాం..

యాడ్‌ ఫిల్మ్‌ మేకింగ్‌ని ప్రేమించి రావాలి. కానీ ఈ రంగంలోకి వచ్చేవారిలో సినిమాలకు వెళ్తూ వెళ్తూ మధ్యలో సరదాగానో టైంపాస్‌గానో చేసేవాళ్లు ఎక్కువ. పూర్తి స్థాయిలో ఈ ఫీల్డ్‌లోనే స్థిరపడాలి అనుకునేవారు తక్కువ. యాడ్‌ ఫిల్మ్‌కి సినిమా కన్నా ఎక్కువ కష్టపడాలి. రూపొందించే దర్శకుడికి సమాజం పట్ల అవగాహన, సమకాలీన మార్పుల మీద పట్టు అవసరం. ఆధునిక పోకడల్ని అందిపుచ్చుకుంటూ, మారుతున్న ట్రెండ్‌కు తగ్గట్టుగా మనల్ని మనం మలచుకుంటూ డైనమిక్‌గా ఉన్నంత కాలం అవకాశాలు పుష్కలంగా వస్తూనే ఉంటాయి.

ఆంపిల్‌ ర్యాంప్‌

ఉత్సాహంగా వార్షికోత్సవ వేడుకలు

వారంతా సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు.. నిత్యం కంప్యూటర్లతో తలమునకలవుతుంటారు.. అయితేనేం.. మోడల్స్‌కు మేమేం తీసిపోమంటూ.. అలవోకగా ర్యాంప్‌ వాక్‌ చేశారు.. అంతేకాదు.. ఆహూతులను ఆసాంతం అలరించారు. గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌ ఈ వేడుకకు వేదికైంది.. 'ఆంపిల్‌ లాజిక్‌' సంస్థ 15వ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం ఉత్సాహభరిత వాతావరణంలో సంస్థ ఉద్యోగులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.. క్రీడల, ఇతర పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు సంస్థ ప్రోత్సాహకాలను అందజేసి, సత్కరించింది. ఉద్యోగుల సహకారంతో సంస్థ దినదినాభివృద్ధి చెందుతుందని సీఈఓ మన్నె వెంకన్న చౌదిరి పేర్కొన్నారు.
- లక్డీకాపూల్‌





3న శిల్పకళా వేదికలో
చింగ్‌ హార్ట్స్‌..

- బాలికల ఆలనా పాలనలో సాయి సేవా సంఘ్‌..
- 35వ వార్షికోత్సవం నేపథ్యంలో మంగ్లీ లైవ్‌ కాన్సర్ట్‌ : రూ.లక్ష విరాళం

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ నేపథ్య గాయిని మంగ్లీ స్వరాలతో నగరంలోని శిల్పకళా వేదికగా 'చింగ్‌ హార్ట్స్‌' పేరుతో లైవ్‌ మ్యూజిక్‌ కన్సర్ట్‌ను నిర్వహించనున్నారు. ఆగస్టు 3న జరగనున్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రామానాయుడు స్టూడియోస్‌ వేదికగా సింగర్‌ మంగ్లీ, జబర్దస్త్‌ ఫేం బుల్లెట్‌ భాస్కర్‌, సంస్థ సభ్యులు అరుణ ప్రదీప్‌, విజయలక్ష్మి, సాయి గౌరీ, శ్రీ వల్లి ఆవిష్కరించారు.

35వ వార్షికోత్సవం నేపథ్యంలో..

నిరాదరణకు గురైన బాలికలు, అనాథ చిన్నారులకు అన్నీ తామై చూసుకుంటోంది నగరంలోని సాయి సేవా సంఘ్‌ సామాజిక సేవా సంస్థ. 35వ వార్షికోత్సవం సందర్భంగా చిన్నారుల సహాయార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇప్పటి వరకూ దాదాపు 2 వేల మంది బాలికలకు ఉచిత విద్య, వసతితో పాటు వారికి అవసరమైన సంపూర్ణ ఆరోగ్య సంరక్షణను అందిస్తుంది. నృత్యం, సంగీతం వంటి విభిన్న కళల్లో శిక్షణ అందిస్తుంది.

ఆ సంస్థ వల్లే.. ఈ స్థాయికి...

ఏ ఆధారం లేని బాలికల ఆలనా పాలనా చూసుకోవడం అనిర్వచనీయమని మంగ్లీ అన్నారు. తనని కూడా ఆర్‌టీడీ అనే సంస్థ చేరదీయడం వల్లే ఈ స్థాయికి ఎదిగానని గుర్తు చేసుకున్నారు. ఇంతటి సేవను అందిస్తున్న సాయి సేవా సంఘ్‌ సంస్థ కోసం తాను కన్సర్ట్‌లో పాడుతున్నానని, బుక్‌ మై షో టిక్కెట్ల ద్వారా వచ్చే డబ్బునే కాకుండా వ్యక్తిగతంగా లక్ష రూపాయలను విరాళంగా అందిస్తానని ప్రకటించారు. ఇందులో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్‌ ధనసరి సీతక్కతో పాటు జబర్దస్త్‌ ఫేం ఆటో రామ్‌ ప్రసాద్‌, బుల్లెట్‌ భాస్కర్‌, నాటీ నరేష్‌ వంటి ప్రముఖులు ఇందులో పాల్గొననున్నారు.



ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన..

వినుకొండ శివారు విఠంరాజుపల్లిలో అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాష్ట్రపతి పాలన విధించాలి

రాష్ట్రపతి, ప్రధాని, హోంమంత్రికి ఆధారాలతో నివేదిస్తాం • వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన సాగుతోంది. గత 45 రోజులుగా శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఏ సామాన్యుడిని కదిలించినా ఇదే ఆవేదన వ్యక్తం అవుతోంది. టీడీపీ నాయకులు ఎవరినైనా కొట్టొచ్చు.. ఎవరి ఆస్తులనైనా ధ్వంసం చేయొచ్చు.. హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడొచ్చనే రీతిలో పాలన నడుస్తోంది. అరాచకాలను అరికట్టాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. ఈ పరిస్థితిలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం రాష్ట్రపతి పాలన విధించాలి. ఇందుకు సంబంధించి రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోం మంత్రిని కలిసి అన్ని ఆధారాలను నివేదిస్తాం'అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలో టీడీపీకి చెందిన వ్యక్తి చేతిలో దారుణ హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ దిగజారుడు రాజకీయాలపై కచ్చితంగా తమ పార్టీ నిరసన గళాన్ని వినిపిస్తుందన్నారు. బుధవారం తమ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి రాష్ట్రంలోని పరిస్థితులు యావత్తు దేశానికి తెలిసేలా ఢిల్లీలో ధర్నా చేపడతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కొనసాగుతున్న దురాగతాలను రాష్ట్రపతి, ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లేందుకు వారి అపాయింట్‌మెంట్ కోరామన్నారు. అసెంబ్లీలో ఉభయ సభల వేదికగా గవర్నర్ ప్రసంగం సమయంలో ఆటవిక పాలనపై ప్రశ్నిస్తామన్నారు. ప్రజా సంక్షేమాన్ని అమలు చేయకుండా దౌర్జన్యాలతో తెలుగుదేశం పార్టీ భీతావహ వాతావరణాన్ని సృష్టిస్తోందని మండిపడ్డారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

పోలీసుల ప్రేక్షక పాత్ర

రాష్ట్రంలో దారుణమైన ఆటవిక చర్యలను అరికట్టాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. చివరికి టీడీపీ నాయకుల దాడుల్లో బాధితులైన వ్యక్తులు పోలీసుల వద్దకు వచ్చి గోడు వెళ్లబోసుకుంటుంటే తిరిగి బాధితులపైనే తప్పుడు కేసులు బనాయించే పరిస్థితి దాపురించింది. ఇలాంటి నీచ సంస్కృతి రాష్ట్రంలో రాజ్యమేలుతుండటం సిగ్గుచేటు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏపీలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని చెప్పడానికి వినుకొండలో రషీద్ దారుణ హత్య పెద్ద ఉదాహరణ. గతంలో పల్నాడు జిల్లాలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించే అధికారి రవిశంకర్ ఎస్పీగా ఉంటే తెలుగుదేశం నాయకులు తమ పలుకుబడితో ఆయన్ను తప్పించేశారు. అనంతరం వారికి అనుకూలంగా పనిచేసే బింధు మాధవ్‌ను ఎస్పీగా తెచ్చుకుని అరాచక పర్వానికి తెరలేపారు. బిందు మాధవ్ ఎన్నికల సమయంలో అత్యంత దారుణంగా వ్యవహరించడంతో ఎన్నికల కమిషన్ స్వయంగా సస్పెండ్ చేసింది. తర్వాత మరో మంచి అధికారి మల్లికా గార్గ్‌ను ఈసీ నియమిస్తే.. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమెను సైతం పంపించేశారు. చంద్రబాబుకు, టీడీపీ నాయకులకు సహాయ సహకారాలు అందించరనే కారణంతో మల్లికా గార్గ్‌ను తప్పించారు. ఇప్పుడు టీడీపీకే మద్దతు పలికే శ్రీనివాస్ అనే వ్యక్తికి పల్నాడు ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. కొత్త ఎస్పీ వచ్చిన రెండు, మూడు రోజుల్లోనే అత్యంత పాశవికంగా నడిరోడ్డుపై, ప్రజలంతా చూస్తుండానే కత్తులతో నరికి రషీద్‌ను దారుణంగా హత్య చేశారు. రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీకి చెందిన సాను భూతిపరులను భయభ్రాంతులకు గురిచేసి, బెదిరించేందుకే అమాయకుడు, సాధారణ ఉద్యోగి అయిన రషీద్‌ను క్రూరంగా హత్య చేయడం దుర్మార్గం.

> గత 45 రోజుల్లో 36 రాజకీయ హత్యలు జరిగాయి. 300కుపైగా హత్యాయత్నాలు, టీడీపీ నాయకుల వేధింపులు తాళలేక 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇళ్లలోకి చొరబడి 560 చోట్ల ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేశారు. షాపులను కాల్చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుల చీనీ చెట్లు నరికేస్తున్నారు. 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులను సైతం ధ్వంసం చేశారు. ఇంతటితో ఆగకుండా వెయ్యికిపైగా దౌర్జన్యాలు, దాడులకు పాల్పడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి దారుణంగా తయారైందని చెప్పడానికి ఇంత కంటే నిదర్శనం అవసరమా?
> – వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

మీడియా ముసుగులో దిగజారుడు తనం

రాష్ట్రంలో దారుణాలు జరుగుతుంటే పోలీసు వ్యవస్థ టీడీపీకే కొమ్ముకాస్తోంది. వీరితో పాటు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 వంటి సంస్థలు మీడియా ముసుగులో దిగజారిపోయి ప్రవర్తిస్తున్నాయి. రషీద్ హత్య ఉదంతాన్ని తప్పుదోవ పట్టించేలా చేస్తున్న దుష్ప్రచారానికి సమాజం సిగ్గుతో తలదించుకుంటోంది. జిలానీకి చెందిన మోటార్ బైక్‌కు వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తులు నిప్పు పెటడ్డంతోనే ఇప్పుడు ఈ హత్యకు పాల్పడినట్టు అసత్యాలు ప్రచారం చేయడం సిగ్గుచేటు. వాస్తవానికి మోటార్ బైక్ జిలానీది కాదు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఆసిఫ్ అనే వ్యక్తిది. ఆ బైక్‌ను టీడీపీకి చెందిన మాజీ చైర్మన్ షమీమ్, టీడీపీ స్టేట్ సెక్రటరీ ఆయూబ్ ఖాన్, మరికొంత మంది టీడీపీ నాయకులు తగలబెట్టి, ఆసిఫ్‌ను తీవ్రంగా గాయపరిచారు. దీనిపై ఈ ఏడాది జనవరి 17నే పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఇదంతా జరగలేదన్నట్టు ఎల్లో మీడియా సృష్టించి, పోలీసులు కేసు కూడా పెట్టలేదని చెబుతోంది. కొత్తగా వచ్చిన ఎస్పీ సైతం ఘటన జరిగిన గంటల్లోనే బయటకు వచ్చి వ్యక్తిగత కక్షలతో జరిగిందంటూ తప్పుడు మాటలు మాట్లాడుతూ, అబద్ధాలు చెబుతున్నారు.

ఎంపీలను తిరగనివ్వట్లేదు

రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి తన పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పుంగనూరులో తిరగకూడదా? మా మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటికి వెళితే.. ఆ ఇంటిని దిగ్బంధం చేసి ఇంటి మీద రాళ్లు వేసి, రెడ్డెప్ప కారుకు నిప్పు పెట్టారు. ఇవన్నీ పోలీసుల సమక్షంలోనే జరిగాయి. ఇంతకన్నా శాంతి భద్రతలు దిగజారిన పరిస్థితులు ఎక్కడైనా ఉంటాయా? చివరికి ఏ స్థాయిలోకి వ్యవస్థ దిగజారిపోతోందంటే అమ్మాయిల మీద అత్యాచారాలు జరుగుతున్నా కూడా పోలీసులు పట్టించుకోవడం లేదు. చంద్రబాబే పట్టించుకోవద్దని చెప్పడంతో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. మా ప్రభుత్వంలో ఏ రోజు టీడీపీ వాళ్లను కొట్టండి, చంపండి, వారికి పథకాలు ఇవ్వద్దు అని చెప్పలేదు. ఏ అక్కచెల్లెమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లినా ఏదైనా ఆపద వస్తే మొబైల్ ఫోన్‌లో 'దిశ'యాప్ ద్వారా పోలీసులను సంప్రదిస్తే వెంటనే రక్షించే వ్యవస్థను తెచ్చాం.

ఈ సంబంధాలేంటి?

రషీద్ హత్యపై పోలీసులు కేసు పెట్టామని అంటున్నారు. ఈ కేసు జిలానీ అనే వ్యక్తి మీద మాత్రమే పెట్టారు. జిలానీకి.. టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో సత్సంబంధాలు ఉన్నాయి. ఎమ్మెల్యేతో ఫొటోలు దిగాడు. ఆయన భార్యకు కేక్‌లు తినిపించాడు. ఆ పార్టీ నాయకులు షమీమ్ ఖాన్‌తో సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ క్రమంలో వారందరి పేర్లు ఎందుకు ఎఫ్ఐఆర్‌లో లేవు? ఇదేంటి మరి? (ఒక ఫొటో చూపుతూ) ఇందులో జిలానీ స్వయంగా ఇక్కడి ఎమ్మెల్యే భార్యకు కేక్ తినిపిస్తున్నాడు. లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా వారు కేక్ కట్ చేయడం.. ఆ కేక్‌ను ఈ జిలానీ స్వయంగా ఎమ్మెల్యే భార్యకు తినిపించడం కళ్లెదుటే కనిపిస్తోంది. అంటే వీళ్ల మధ్య సంబంధాలు ఎంత బలంగా ఉన్నాయో చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం కావాలా? (ఎమ్మెల్యేతో, అయూబ్‌ఖాన్, షమీమ్‌ఖాన్‌తో జిలానీ దిగిన ఫొటోలు చూపారు) మరి వీళ్లెవరూ కేసులో ఎందుకు లేరు? వారిపై కేసు ఎందుకు నమోదు చేయలేదు? ఇంతకన్నా అన్యాయం ఏమైనా ఉంటుందా? రషీద్‌ను ఫ్యాక్షన్ మూలాలున్న వ్యక్తిగా చిత్రీకరించడం దారుణం. ఆ కుటుంబం ఏం పాపం చేసిందని ఒక మనిషిని చంపారు? అంతటితో ఆగకుండా కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నారు. హత్యకు గురైన వ్యక్తులకు సానుభూతి తెలపకుండా తప్పుడు ప్రచారం చేయడం దారుణం. చంద్రబాబు క్షమాపణ చెప్పాలి. పోలీసులు ప్రేక్షక పాత్ర వీడాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం అవ్వవు అని ప్రజలకు విశ్వాసం కల్పించాలి. పోలీసులు వాళ్ల విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలి.

తాడేపల్లి టు వినుకొండ.. ఏడున్నర గంటలు

- అశేష ప్రజాభిమానం మధ్య వైఎస్ జగన్ పర్యటన ఆలస్యం
- జోరు వానలోనూ తరగని జనాభిమానం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అండగా ఉంటాం

దోషులకు శిక్ష పడేలా చేద్దాం • రషీద్ కుటుంబ సభ్యులకు వైఎస్ జగన్ భరోసా



రషీద్ తల్లిదండ్రులను ఓదారుస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మీ కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రషీద్ కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. రెండు రోజుల క్రితం తెలుగుదేశం గూండాల చేతిలో రషీద్ దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం వినుకొండకు రోడ్డు మార్గంలో వచ్చిన ఆయన సాయంత్రం ఐదున్నర గంటలకు రషీద్ నివాసానికి చేరుకున్నారు. రషీద్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రషీద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రషీద్ సోదరుడు ఖాదర్.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హత్య జరిగిన తీరును సెల్‌ఫోన్‌లో చూపించి వివరించారు. తన సోదరుడు వైఎస్సార్‌సీపీలో పని చేస్తున్నాడనే కక్షతోనే హత్య చేయించారని, ఈ హత్య వెనుక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఉన్నారని చెప్పారు. రషీద్ తల్లి బడేబీ మాట్లాడుతూ.. తన కుమారుడు తన పనేంటో తాను చూసుకునేవాడని, ఎలాంటి గొడవలకు వెళ్లవాడుకాదన్నారు. ఎమ్మెల్యే మనుషులు తన కొడుకును టార్గెట్ చేసి హత్య చేయించారని కన్నీళ్ల పర్యంతమయ్యారు. జిలానీ.. రషీద్‌ను అన్నా అని పిలుస్తుంటాడని, కేవలం రాజకీయ కక్షతోనే నరికి చంపేశారని ఆవేదన వ్యక్తం చేసింది. మద్యం షాపులో సూపర్‌వైజర్‌గా చేస్తున్న తన తమ్ముడు ఎనిమిది గంటలకు షాపు క్లోజ్ చేస్తాడని, ఆ సమయంలో నిందితుడు వెనుక నుంచి వచ్చి హత్య చేశాడని ఖాదర్ వివరించాడు. దీనిపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందిస్తూ 'చంపుకునేంత కక్షలు లేవు.. ఎందుకలా జరిగింది.. రాష్ట్రమంతా అతలాకుతలంగా మారింది.. పోలీసులు కూడా పట్టించుకోవడం లేదు.. మన ఊళ్లల్లో మనం ఉండేందుకు కూడా వీలు లేకుండా పోయింది. మన ఎమ్మెల్యేలపై కూడా రాళ్లు వేయించిన పరిస్థితి. రషీద్ హత్యకు సంబంధించి దోషులకు తప్పకుండా శిక్ష పడేలా చేద్దాం. మీకు ఎలాంటి కష్టం వచ్చినా, మిమ్మల్ని ఎవరు ఇబ్బంది పెట్టించినా నేరుగా హైకోర్టులో కేసు వేసి, అన్ని రకాలుగా అండగా ఉంటాం. న్యాయం జరిగేలా చూస్తాం. మీకు ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటాం. చేస్తే మంచి చేయాలి. ఈ ప్రభుత్వంలో మంచి చేసే పరిస్థితి లేదు. ఎలాంటి ఇబ్బంది లేకుండా మీ వెంట నేనుంటాను'అని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ప్రజల దృష్టి మళ్లించడానికే
విధ్వంసకాండ

- అలవిగాని హామీలిచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు
- ఈ పథకాలన్నీ ఎప్పుడిస్తారని అడుగుతున్న జనం
- దిక్కుతోచకే అరాచకాలు, దాడులు, హత్యలు, హత్యాయత్నాలకు ఊతం
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపాటు

సాక్షి, అమరావతి: అలవిగాని హామీలిచ్చి, అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు.. వాటిని అమలు చేయలేక వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే విధ్వంసాలు, దాడులు, హత్యలు, హత్యాయత్నాలను ప్రోత్సహిస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. పల్నాడు జిల్లా వినుకొండలో టీడీపీకి చెందిన వ్యక్తి చేతిలో దారుణ హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు తప్పుడు వాగ్దానాలతో, ప్రజలను మోసం చేసి సీఎం అయ్యారన్నారు. 'గత ప్రభుత్వంలో ప్రతి త్రైమాసికానికి విద్యా దీవెన అందించాం. జనవరి, ఫిబ్రవరి, మార్చి త్రైమాసికానికి సంబంధించిన విద్యా దీవెన ఇంకా ఇవ్వలేదు. ఏప్రిల్, మే, జూన్ కూడా అయిపోయింది. రెండు త్రైమాసికాల నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. అదే జగన్ సీఎంగా ఉండి ఉంటే ఏప్రిల్‌లో వసతి దీవెన, రైతు భరోసా, అమ్మ ఒడి, సున్నా వడ్డీ, మత్స్యకార భరోసా డబ్బులు ఇప్పటికే వచ్చి ఉండేవి. ఈ రోజు ప్రతి అక్కచెల్లెమ్మ ఎదురు చూస్తోంది. 'పిల్లలను బడికి పంపితే జగన్ ఒక్కరికే అమ్మ ఒడి కింద రూ.15 వేలు చొప్పున ఇస్తాడు. అదే నేను అధికారంలోకి వస్తే ఎంత మంది పిల్లలను బడికి పంపితే అంత మందికి అమ్మ ఒడి ఇస్తాం' అని చంద్రబాబు చెప్పారు. ఇంట్లో నలుగురు పిల్లలుంటే నలుగురికి రూ.15 చొప్పున రూ.60 వేలు ఇస్తాం అని ఆయన హామీ ఇచ్చారు. ఎన్నికల్లో చెప్పినట్టు 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికి నెలకు రూ.1,500 ఇవ్వండని ఈ రోజు ప్రతి అక్కచెల్లెమ్మ అడుగుతోంది. రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రకారం 2.10 కోట్ల మందికిపైగా అక్కచెల్లెమ్మలు ఉన్నారు. ఇందులో పెన్షన్‌లు తీసుకుంటున్న వారిని పక్కన పెట్టినా 1.50 కోట్ల మంది మాకు రూ.1,500 ఎప్పుడిస్తావ్ అని నిలదీస్తున్నారు. ప్రతి పిల్లాడు అడుగుతున్నాడు. జగన్ మామ మా అమ్మకు రూ.15 వేలు ఇచ్చేవాడు.. మీరు తల్లికి వందనం ఇస్తాం అన్నారు. ఎప్పుడు ఇస్తారని అడుగుతున్నారు. రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామన్నారు. 50 లక్షల మంది రైతన్నలు పెట్టుబడి సాయం ఏమైందంటున్నారు. ఏప్రిల్‌లో ఇవ్వాల్సిన సున్నా వడ్డీ డబ్బులు ఎందుకు ఇవ్వలేదని అక్కచెల్లెమ్మలు అడుగుతున్నారు. మత్స్యకార భరోసా రూ.20 వేల చొప్పున ఎప్పుడిస్తారని మత్స్యకారులు అడుగుతున్నారు. వీటన్నింటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కోసమే విధ్వంసం సృష్టిస్తున్నారు' అని మండిపడ్డారు.

హై రైజింగ్!

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో హైరైజ్ నిర్మాణాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. గతంలో పాతిక ఫ్లోర్ల భవనం అంటే వామ్మో అనుకునే పరిస్థితి. కానీ, ఇప్పుడు 50 అంతస్తులపైనే నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. స్కై స్క్రేపర్లలో నివాసం అనేది స్టేటస్ సింబల్‌గా మారిపోవడంతో ప్రవాసులు, ఎంటర్‌ప్రెన్యూర్లు, బ్యూరోక్రాట్ల అభిరుచి మేరకు డెవలపర్లు పోటాపోటీగా ఆకాశహర్మ్యాలను నిర్మిస్తున్నారు. దీంతో పశ్చిమ హైదరాబాద్‌లో తలెత్తి చూస్తే తప్ప అపార్ట్‌మెంట్ కనిపించని పరిస్థితి!



దేశంలో హైరైజ్ ప్రాజెక్ట్‌లకు పెట్టింది పేరు ముంబై. ఇక్కడ భూమి లభ్యత తక్కువ కాబట్టి వర్టికల్ నిర్మాణాలు సహజమే. కానీ, హైదరాబాద్‌లో భూమి లభ్యత ఉన్నప్పటికీ అధిక ధరల కారణంగా డెవలపర్లు హైరైజ్ ప్రాజెక్ట్‌లను చేయక తప్పని పరిస్థితి. మరోవైపు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులున్న ప్రాంతంలో నివాసం ఉండేందుకు కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తుండటంతో ఎత్తయిన గృహ సముదాయాలు వెలుస్తున్నాయి.

వెస్ట్‌లోనే ఎక్కువ..


షేక్‌పేట, రాయదుర్గం, మదీనాగూడ, ఖాజాగూడ, పుప్పాలగూడ, గండిపేట, కోకాపేట, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కొండాపూర్ వంటి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాల్లోనే ఎక్కువగా హైరైజ్ ప్రాజెక్ట్‌లు నిర్మాణంలో ఉన్నాయి. ప్రవాసులు, హెచ్ఎన్ఐలు సెకండ్ డెస్టినేషన్‌గా హైదరాబాద్‌లో లగ్జరీ అపార్ట్‌మెంట్ ఉండాలని కోరుకుంటున్నారు. అధిక అద్దెలు, ఆస్తుల విలువల పెంపు కారణంగా పెట్టుబడిదారులు ఇలాంటి ప్రాజెక్ట్‌లను ఎంచుకుంటున్నారు. దీంతో అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులున్న పశ్చిమ హైదరాబాద్‌లోనే ఆకాశహర్మ్యాలు ఎక్కువగా వస్తున్నాయి. భవనం ఎత్తు పెరిగే కొద్దీ నిర్మాణ వ్యయం పెరుగుతుంది కాబట్టి హైరైజ్ ప్రాజెక్ట్‌లలో అపార్ట్‌మెంట్ల ధరలు ప్రీమియంగానే ఉంటాయి.

కిటికీలో నుంచి సిటీ వ్యూ..

ప్రస్తుతం నగరంలో 200 మీటర్ల ఎత్తు అంటే 50 నుంచి 59 అంతస్తుల హైరైజ్ ప్రాజెక్ట్‌లు నిర్మాణంలో ఉన్నాయి. ప్రవాసులు, హైనెట్ వర్త్ ఇండివిడ్యువల్స్, ఎంటర్‌ప్రెన్యూర్లు, ఐటీ, ఫార్మా రంగాల్లోని ఉన్నతోద్యోగులు ఎక్కువగా ఆకాశహర్మ్యాలలో ఉండేందుకు ఇష్టపడుతున్నారు. హైరైజ్ ప్రాజెక్ట్‌ల ఎంపికకు మరో ప్రధాన కారణం సిటీ వ్యూ. 200 మీటర్ల ఎత్తులోని అపార్ట్‌మెంట్ కిటికీలో నుంచి చూస్తే సిటీ మొత్తం కనిపిస్తుంది. ఉదయం, సాయంత్రం సమయాల్లోని నగరంలోని పరిసరాలను ఆస్వాదించవచ్చు. అంతేకాకుండా హైఎండ్ కుటుంబాలు, అభిరుచులు కలిగిన నివాసితులు ఒకే చోట ఉండటంతో వారి మధ్య సామాజిక బంధం మరింత బలపడుతుంది. జీవన నాణ్యత మెరుగవుతుంది.

స్వచ్ఛమైన గాలి, వెలుతురు..

అత్యంత ఎత్తులో అపార్ట్‌మెంట్ ఉంటుంది కాబట్టి వాహనాల ధ్వని, వాయు కాలుష్య సమస్యలూ ఉండవు. ఏకాంతం కోరుకునేవారికి అనువైన గృహాలివే. పైగా ఇంట్లోకి ధారాళమైన గాలి, వెలుతురు, సూర్యరశ్మి వస్తాయి. ఈ ప్రాజెక్ట్‌లకు చేరువలోనే అంతర్జాతీయ విద్యా, వైద్య సంస్థలు, వినోద కేంద్రాలు, నిత్యావసరాలు అన్నీ లభ్యమవుతాయి. ఇంట్లో ఉన్నంత సేపు కుటుంబ, వృత్తి, కెరీర్ వంటి వ్యాపకాలపై ఫోకస్ చేయవచ్చు. వీటిల్లో క్లబ్ హౌస్‌తో పాటు వాకింగ్, జాగింగ్ ట్రాక్‌లు, స్విమ్మింగ్ పూల్, జిమ్, డేకేర్ సెంటర్, మెడిటేషన్ హాల్స్, వెయిటింగ్ రూమ్స్ వంటి అన్ని రకాల ఆధునిక వసతులుంటాయి. సీసీటీవీ కెమెరాలు, సెక్యూరిటీతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉంటాయి.

> **మౌలిక వసతులను కల్పించాలి**
>
> 
>
> పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు గృహాలను అందించాలంటే హైరైజ్ నిర్మాణాలే సరైనవి. కాకపోతే ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు అవసరమైన రహదారులు, నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలి.
> – ప్రశాంత్ రావు, డైరెక్టర్, పౌలోమీ ఎస్టేట్స్

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి ఆలయం వద్ద సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లి

తిరుమల / శ్రీకాళహస్తి: సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లి శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున కుటుంబసభ్యులతో కలసి ఆమె అభిషేకసేవలో పాల్గొన్నారు. ఆమెకు రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనాన్ని, ఆలయాధికారులు ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.అలాగే, కాగా, జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని కూడా జస్టిస్ హిమ కోహ్లి దర్శించుకుని రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు.

థర్డ్ పార్టీ ఏజెన్సీకి భూముల విలువల సవరణ!

- పంజాబ్ తరహాలో ప్రైవేట్ సంస్థతో మదింపు చేయించే యోచన
- ఆ తర్వాతే విలువలు సవరించాలనుకుంటున్న సర్కారు
- మంత్రి పొంగులేటి ప్రత్యేక కసరత్తు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని భూములు, ఆస్తుల విలువల సవరణ ప్రక్రియను థర్డ్ పార్టీ ఏజెన్సీకి అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. పంజాబ్‌లో గత ఏడాదిలో జరిగిన విలువల సవరణ ప్రక్రియలో సహకరించిన ఏజెన్సీతో మాట్లాడి తెలంగాణలో కూడా ఆ ఏజెన్సీ చేత భూములు, ఆస్తుల విలువలను మదింపు చేయించాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భావిస్తున్నట్టు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ల శాఖ ఇప్పటికే చేసిన ప్రతిపాదనలను ఏజెన్సీ ఇచ్చిన నివేదికతో సరిపోల్చి శాస్త్రీయ పద్ధతిలో సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు ఏజెన్సీ ప్రతినిధులతో సంప్రదింపులు జరుగుతున్నాయని తెలిసింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 1 నుంచి అమల్లోకి రావాల్సిన కొత్త విలువలు నిర్ధారణ అయ్యేందుకు మరికొంత సమయం పడుతుందని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలంటున్నాయి.

మార్కెట్, ప్రభుత్వ విలువలు ఒక దగ్గరకు..

గతంలో ఎప్పుడూ సవరణ నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత భూములు, ఆస్తుల విలువలను సవరించకుండా ఉండలేదు. కానీ తొలిసారిగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం నోటిఫికేషన్ గడువు ముగిసిన తర్వాత కూడా కొత్త విలువలు అమల్లోకి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కసరత్తే కారణమని, శాస్త్రీయ పద్ధతిలో విలువలను పెంచడం ద్వారా అటు ప్రజలకు భారం పడకుండా, ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోందని తెలుస్తోంది. ఈ ప్రక్రియపై ప్రత్యేకంగా దృష్టి సారించిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలోనూ ప్రభుత్వ ఉద్దేశాన్ని తేల్చి చెప్పారు. కర్ణాటక తరహాలో మార్కెట్ విలువ, ప్రభుత్వ విలువలను ఒక దగ్గరకు తెచ్చే ప్రయత్నం చేయాలని, తద్వారా ఎక్కువ విలువలకు ప్రజలు రిజిస్ట్రేషన్‌కు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

> **ప్రజలపై భారం పడకుండా స్టాంపు డ్యూటీ తగ్గింపు!**
>
> ప్రజలపై అధిక భారం పడకుండా ఉండేందుకు అవసరమైతే స్టాంపు డ్యూటీని ఒకటి లేదా ఒకటిన్నర శాతం తగ్గించే ప్రతిపాదనలపై కూడా నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఈ కోణంలోనే థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా మరింత శాస్త్రీయంగా భూములు, ఆస్తుల విలువల మదింపు జరుగుతుందని, ఆ మేరకు విలువలను సవరించడం ఉభయతారకంగా ఉంటుందనేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది.



సీఎం రేవంత్‌కు బోనాల ఆహ్వానపత్రిక అందజేస్తున్న అర్చకులు. చిత్రంలో మేయర్

మహంకాళి బోనాలకు రండి

సీఎం రేవంత్‌కు అర్చకుల ఆహ్వానం

సాక్షి హైదరాబాద్: ఈనెల 21వ తేదీన సికింద్రాబాద్ మహంకాళి బోనాల ఉత్సవాలకు రావాలని ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో ఆలయ ఈవో మనోహర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు రామతీర్థ శర్మ, వేద పండితుడు వేణుమాధవ్ శర్మ సీఎంను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ ఎంపీ ఎం.అనిల్‌కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు పాల్గొన్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కూడా కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు.

'డ్రగ్స్‌ను తరిమేద్దాం'పోస్టర్ ఆవిష్కరణ

'డ్రగ్స్‌ను తరిమేద్దాం'అంటూ సీనియర్ జర్నలిస్టు ఎ.కొండల్‌గౌడ్ పాడిన పాట పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, తెలంగాణ ప్రభుత్వ పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కోడూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో మార్పు కనిపించాలి

- అధికారులకు పంచాయతీరాజ్ మంత్రి సీతక్క ఆదేశం




సాక్షి, హైదరాబాద్: గ్రామీణ స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసినందున అధికారులు మరింత శ్రద్ధ, బాధ్యతతో పని చేయాలని మంత్రి సీతక్క సూచించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి, క్షేత్ర స్థాయి సిబ్బందికి సలహాలు, సూచనలివ్వాలన్నారు. గ్రామాల్లో మార్పు కనిపించకపోతే సరిగా విధులు నిర్వర్తించని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం సచివాలయం నుంచి పీఆర్ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్‌తో కలసి మంత్రి సీతక్క డీఆర్డీవో, డీపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా వంటి రోగాలకు కారణమయ్యే దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో జ్వరాలు వెలుగు చూసిన వెంటనే ఇంటింటి ఫీవర్ సర్వేలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పచ్చదనం, స్వచ్ఛదనం పెంపొందించేందుకు వారంరోజుల పాటు స్పెషల్ డ్రైవ్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 20-7-2024

బ్యూటిప్

బనానా ఫేస్ ప్యాక్



బాగా పండిన అరటి పండు గుజ్జు అర కప్పు తీసుకుని అందులో టీ స్పూన్ తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి 15 నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. వారానికి రెండుసార్లు ముఖానికి ఈ ప్యాక్ వేస్తుంటే పిగ్మెంటేషన్, సన్నని గీతలు, ముడతలు తొలగిపోయి చర్మం యవ్వనాన్ని సంతరించుకుంటుంది.



స్ఫూర్తి



కూతురి కోసం పంటనే పండించింది

తల్లిగుణం అందరి మేలు కోరుతుంది. కూతురి అనారోగ్య సమయంలో డ్రాగన్ ఫ్రూట్ తినిపించాలని వెతికితే దాని ఖరీదు సామాన్యులకు అందుబాటులో లేదనిపించిందామెకు. తన కూతురు లాంటి వాళ్లు ఎందరో ఈ పండుకు దూరం కావలసిందేనా అని బాధ పడింది. పట్టుదలతో ఏకంగా పంటే పండించింది. డ్రాగన్ ఫ్రూట్ రైతు రేణుక కథ ఇది.

'మీ అమ్మాయికి ప్లేట్‌లెట్స్ బాగా పడిపోయాయి. ప్లేట్‌లెట్స్ పెరగడానికి డ్రాగన్ ఫ్రూట్ తినిపించమ్మా' అని డాక్టర్ చెప్పిన మాట ఆ తల్లిని డ్రాగన్ పంట స్వయంగా సాగు చేసే వరకు తీసుకువెళ్లింది.

కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన రేణుక, పరశురాములు దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు. ఇంటర్ చదువుతున్న కూతురు విజయకు కరోనా కాలంలో నుస్తీ చేసింది. కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయని గుర్తించిన వైద్యులు ప్లేట్‌లెట్స్ పెరగడానికి డ్రాగన్ ఫ్రూట్ తినిపించమని చెప్పారు.

దాంతో తల్లి రేణుక కామారెడ్డి పట్టణంలో పండ్ల దుకాణాలన్నింటా డ్రాగన్ ఫ్రూట్ కోసం తిరిగితే ఎక్కడా దొరకలేదు. ఆఖరుకు ఒక సూపర్ మార్కెట్‌లో దొరికాయి. ఒక్కో పండు రూ.180 చెప్పారు. అంత ఖరీదా అని ఆశ్చర్యపోయింది రేణుక. అంత రేటు పెట్టాల్సి వచ్చినందుకు చిన్నబుచ్చుకుంది. అయినా సరే కొనుగోలు చేసి తీసుకువెళ్లి కూతురికి తినిపించింది. ఆమె ఆరోగ్యం మెరుగుపడిన తరువాత ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకువెళ్లారు.

మనం ఎందుకు పండించకూడదు?

రేణుకకు చదువు లేదు. కానీ వ్యవసాయం మీద మంచి పట్టు ఉంది. రేణుక భర్త పరశురాములు కూడా చదువుకోకున్నా ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయాలన్న ఆశ ఉంది. అంతవరకూ సంప్రదాయ సేద్యం చేస్తున్న ఆ ఇద్దరూ కూర్చుని 'డ్రాగన్ ఫ్రూట్' గురించి చర్చించుకున్నారు. 'మనం పండించి తక్కువకు అమ్ముదాం' అంది రేణుక. ఆ తర్వాత భర్తతో కలిసి డ్రాగన్ ఫ్రూట్ సాగు పద్ధతుల గురించి పిల్లలతో కలిసి యూ ట్యూబ్‌లో చూసింది. ఆ పంట పండించాలన్న నిర్ణయానికి వచ్చిన రేణుక, పరశురాములు జగిత్యాల జిల్లాలోని అంతర్గాంలో డ్రాగన్ ఫ్రూట్ కు సంబంధించిన మొలకలు దొరుకుతాయని తెలుసుకున్నారు. ఓ రోజు అక్కడికి వెళ్లి పంట సాగు గురించి వారితో మాట్లాడారు. ఎకరంలో సాగు చేయడానికి ఎంత ఖర్చు అవుతుందో, ఎన్ని మొక్కలు అవసరమవుతాయో అడిగి తెలుసుకున్నారు. వాళ్లిచ్చిన సూచనల మేరకు ఇంటికి చేరుకున్న తరువాత ఎకరం పొలం దుక్కి దున్నారు. చుట్టూరా ఇనుపజాలీతో కంచె ఏర్పాటు చేశారు. మొక్కల కోసం స్తంభాలు, కర్రలను ఏర్పాటు చేసుకున్నారు. అలాగే డ్రిప్ సౌకర్యం కల్పించుకున్నారు. పొలం తనఖా పెట్టి రూ.3 లక్షలు, అలాగే డ్వాక్రా సంఘం నుంచి రూ. 2 లక్షలు అప్పు తీసుకుని పంట సాగు మొదలుపెట్టారు.

43 పండ్లు దక్కాయి

పంట సాగు చేసిన తొలి ఏడాది నలభై మూడు పండ్లు మాత్రమే చేతికందాయి. దాంతో మరిన్ని మెళకువలు తెలుసుకుని మరింత కష్టపడి సాగు చేయడంతో రెండో ఏడాదికి వచ్చేసరికి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దళారులకు అమ్మితే గిట్టుబాటు కాదని భార్య, భర్త ఇద్దరూ గంపల్లో పండ్లను పెట్టుకుని సిద్దిపేట, మెదక్, కామారెడ్డి తదితర పట్టణాలకు తీసుకు వెళ్లి ఒక్కో పండు. వంద నుంచి రూ.150 వరకు అమ్ముకుంటే రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈసారి రూ.4 లక్షలు ఆదాయం సమకూరుతుందన్న నమ్మకంతో ఉన్నారు. పది పదిహేనేళ్లపాటు పంట వస్తుందని, తాము అనుకున్నదానికన్నా ఎక్కువే సంపాదిస్తామన్న ధీమాతో ఉన్నారు.

– ఎస్.వేణుగోపాలాచారి, సాక్షి, కామారెడ్డి



ఇదేం పంట అన్నారు

నా బిడ్డ ఆరోగ్యం కోసం డ్రాగన్ ఫ్రూట్ కొనడానికి దుకాణాలన్నీ తిరిగినా దొరకలేదు. ఆ రోజే అనిపించింది. ఇంత మంచి పండు మాలాంటి పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండాలని. మేమిద్దరం కలిసి పంట సాగుకు నిర్ణయం తీసుకున్నాం. మొదట్లో అందరూ ఇదేం పంట అని పెదవి విరిచారు. ఇప్పుడు పంటను చూసి మెచ్చుకుంటుంటే ఎంతో సంతోషం అనిపిస్తుంది. మా దగ్గరకి చాలా మంది వచ్చి పండ్లు కొంటున్నారు.

– రేణుక, డ్రాగన్ ఫ్రూట్ సాగుదారు



నేడు ఇంటర్నేషనల్ మూన్ డే

చల్లని రాజా ఓ చందమామా

చందమామ రావే... జాబిల్లి రావే.. అని ఎంత పిలిచినా దగ్గరకు రాని చందమామ దగ్గరకు మనిషే వెళ్లాడు. జూలై 20, 1969 నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడి పై కాలు మోపిన రోజు. అతడే చెప్పినట్టు అది 'మానవ జాతి ముందంజ'. అయినా సరే... నేటికీ చందమామ ఒక నిగూఢ దీపం. రహస్యాల మయం. మానవజాతికి ఈ రేరాజు ఆత్మీయుడు, అందమైన స్నేహితుడు, ప్రియతముడు, మేనమామ. అతని చుట్టూ ఎన్నో కథలూ గాథలూ కల్పనలు. నేడు 'ఇంటర్నేషనల్ మూన్ డే'. కాబట్టి శశికాంతుని సంగతులు కొన్ని...

కుందేలు ఇలా వచ్చిందట!

చంద్రుడిపై కుందేలు అనేది అందమైన అబద్ధమైనా అది మనకు అమితంగా ఇష్టమైన అబద్ధం! అసలు మన కుందేలు అక్కడెక్కడో ఉన్న చంద్రుడిపైకి ఎలా చేరింది? ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంలో ఉన్న ఒక నమ్మకం ప్రకారం.... బుద్ధుడు ఊరూరా తిరిగి, బోధనలు చేసి అలిసిపోయాడు. ఆకలితో ఉన్నాడు. ఇది గమనించిన జంతువులు తమకు తోచిన పరిధిలో బుద్ధుడు తినడానికి రకరకాల పదార్థాలు తీసుకువచ్చాయి. పాపం! ఒక కుందేలు దగ్గర మాత్రం ఏమీ ఉండదు. 'నన్ను తిని మీ ఆకలి తీర్చుకోండి' అంటూ మంటల్లో దూకి చనిపోతుంది కుందేలు. కుందేలు ఆత్మత్యాగానికి చలించిన బుద్ధుడు దానికి అమరత్వాన్ని ప్రసాదిస్తాడు. చంద్రుడిపై ఉండి కనువిందు చేసేలా వరమిస్తాడు.

మూడుసార్లు పుట్టాడు...

ఎవరైనా సరే ఒక్కసారే పుడతారు. పురాణాల ప్రకారం చంద్రుడు మాత్రం మూడుసార్లు పుట్టాడు. అందుకే చంద్రుడిని త్రిజన్మి అని కూడా అంటారు. చంద్రుణ్ణి మొదటిసారి బ్రహ్మ సృష్టించాడు. రెండోసారి అత్రి మహర్షి కన్నుల నుంచి ఉద్భవించాడు. రాక్షసులు, దేవతల క్షీర సాగర మథనంలో లక్ష్మీదేవితో పాటు చంద్రుడు పునర్జన్మ పొందాడు.

డస్ట్‌బిన్ కాదు...

మనిషంటేనే నిరంతరం చెత్తను పారబోస్తుండే జీవి. అతడా చెత్త వేయడానికి భూగ్రహం సరిపోక చంద్రుని మీదా బోలెడంత పారబోస్తున్నాడు. పనికి రాకుండా పోయిన రోవర్లూ, విఫలమైన రాకెట్లూ, పంపిన ఉపగ్రహాలూ, ఆస్ట్రొనాట్ల బూట్లూ, బ్లాంకెట్లూ ఇలాంటివెన్నో అక్కడ. అంతరిక్ష ప్రయాణికులు బ్యాగుల్లో పోసి అక్కడ పారబోసిన యూరిన్ బ్యాగులే 100కు పైగా ఉన్నాయక్కడ. ఇలా ఇప్పటివరకూ చంద్రుడి మీద మనిషి పారబోసిన చెత్త బరువు ఎంతో తెలుసా? అక్షరాలా 2,27,000 కిలోలు.

చంద్రకంపాలు

మనకు భూకంపాలలాగే చంద్రుడి మీదా చంద్రకంపాలు వస్తుంటాయి. ఇంగ్లిషులో మూన్ క్వేక్స్. ఇవి మళ్లీ నాలుగు రకాలు. చాలా లోతుగా వచ్చేవి డీప్ క్వేక్స్, ఉల్కలేవైనా చంద్రుణ్ణి ఢీకొడితే వచ్చేవి మీటియోరైట్ ఇంపాక్ట్స్, సూర్యుడి ఉష్ణోగ్రతతో వచ్చేవి థర్మల్ క్వేక్స్... ఇవి మూడూ ఒక రకం. కానీ 'షాలో మూన్ క్వేక్స్' మాత్రం చాలా భయంకరం. భూకంపం సెకన్లపాటు కొనసాగితేనే మహా ఉత్పాతం కదా... కానీ చంద్రకంపం దాదాపు పదినిమిషాలు మొదలుకొని అరగంట పాటూ అదేపనిగా వస్తుంది.

లూనార్ స్మెల్...

చంద్రునికో వాసన కూడా ఉంటుంది. దాన్నే 'లూనార్ స్మెల్' అంటారు. అక్కడ వాతావరణం ఉండదు. అప్పుడు స్మెల్ ఎలా అనే అనుమానం రావచ్చు. అపోలో-11కు చెందిన ఆస్ట్రొనాట్స్ అందరి స్పేస్ సూట్‌లకు అంటుకుపోయి ఒకే లాంటి వాసన కొట్టడంతో ఈ విషయం తెలిసొచ్చింది. ఘాటైన మెటాలిక్ స్మెల్‌లాగా. క్రాకర్స్ కాలిపోయాక బాగా మండిన గన్‌పౌడర్‌లా ఉండే వాసన ఇదంటూ ఖచ్చితంగా తెలిపినవాడు హరిసన్ జాక్ స్మిత్ అనే అపోలో-17 కు చెందిన సైంటిస్ట్ ఆస్ట్రొనాట్.



ధారాసింగ్ ముందే అడుగు పెట్టాడు

'ఇదెలా సాధ్యం!' అనుకోవద్దు. సినిమాల్లో ఏదైనా సాధ్యమే కదా! విషయంలోకి వస్తే....1967లో హిందీలో 'చాంద్ పర్ చదాయి' అనే సినిమా వచ్చింది. ఈ సినిమాలో ప్రఖ్యాత రెజ్లర్ ధారాసింగ్ వ్యోమగామి ఆనంద్ పాత్రలో నటించాడు. తన అసిస్టెంట్ 'భాగు'తో కలిసి చంద్రుడిపై అడుగు పెట్టిన ఆనంద్ అక్కడ మాన్‌స్టర్‌లతో వీరోచితంగా పోరాడుతాడు. ఈ ఫైటింగ్ విషయం ఎలా ఉన్నా 'చంద్రయాన్' లాంటి సందర్భాలలో ఈ సినిమాలోని స్టిల్స్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటాడు అతడి కుమారుడు విందు ధారాసింగ్.

ఆఖరి మజిలీ...

పాపం... అప్పుడప్పుడూ అతడు శశికాంతుడా శ్మశానమూ అనే డౌటు కూడా వస్తుంటుంది. చంద్రుడి మీద తమ చితాభస్మం పడాలని చాలా మంది భూలోక వాసుల కోరిక. అందుకే 450 బీసీ కాలం నుంచే కొందరు తమ చితాభస్మాన్ని చంద్రుడి మీద పడేలా ఎత్తైన ప్రదేశం నుంచి ఆకాశంలోకి విసిరేయమని వీలునామా రాసేవారు. యూజీన్ షూమాకర్ అనే ఆస్ట్రొనాట్‌కు చంద్రుని మీదకు వెళ్లాలని కోరిక. అయితే అతడు ఓ శారీరక లోపం కారణంగా చంద్రుణ్ణి చేరలేకపోయాడు. కానీ ఏనాటికైనా చంద్రుణ్ణి చేరాలన్న అతడి కోరిక నెరవేరకుండానే కారు యాక్సిడెంట్‌కు గురై 1997 లో మరణించాడు. అతడి కోరికను ఎలాగైనా తీర్చాలనుకున్న నాసా... అతడి భార్య, పరిశోధనల్లో సహచరి అయిన కరోలిన్ దగ్గర్నుంచి అనుమతి తీసుకుని లూనార్ ప్రాస్పెక్టర్ అనే ఉపగ్రహోపకరణంతో చంద్రుడిపైన దక్షిణ ధ్రువంలోని ఓ క్రేటర్‌లోకి సమాధయ్యేలా చితాభస్మాన్ని జల్లి 1998లో అతడి కోరిక తీర్చారు. ఆ తర్వాత ఎలాన్ మస్క్ లాంటివాళ్లు తమ స్పేస్ ఎక్స్‌తో 2019లో 152 మంది చితాభస్మాల్ని అంతరిక్ష వైతరణిలో నిమజ్జనం చేశారు.

మూన్ డస్ట్ ఫీవర్

ప్రస్తుతానికి ఎవరు పడితే వారు ఎప్పుడంటే అప్పుడు వెళ్లడానికి చంద్రుడేమీ పిక్నిక్ స్పాట్ కాదు. మామూలు వ్యక్తులు చంద్రుడి మీదకి వెళ్లడం సాధ్యం కాదు. అక్కడ ఉండే దుమ్మూధూళికి మూన్ డస్ట్ అని పేరు. అది పీల్చడం ఎంతో ప్రమాదకరం. స్పేస్ సూట్ తొడుక్కుని వెళ్లినా బట్టల్లోకి చేరిపోతుంది. అది 'లూనార్ హే ఫీవర్' అనే సమస్యకు దారితీస్తుంది. దీన్నే మూన్ డస్ట్ ఫీవర్ అని కూడా అంటారు.

హెల్త్ ఫ్యాక్ట్

సీసాతో పాలు పడుతున్నారా?

బిడ్డకు ఎప్పుడూ తల్లిపాలు పట్టడమే చిన్నారికి మేలు చేస్తుంది. కేవలం తల్లికి పాలు పడని సందర్భాల్లో మాత్రమే పోత పాలు పట్టాలి. ఇవి రెండు రకాలుగా ఉంటాయి.



పాడి పశువుల పాలు: ఆవు, గేదె, మేక వంటి పాడి పశువుల పాలు ఇవ్వవచ్చు.

డబ్బా పాలు: మార్కెట్లో అమ్మే పిల్లల కోసం ఉద్దేశించిన పాల పౌడర్‌ను ఉపయోగించి కలిపి ఇచ్చేవి. గేదె వంటి పాడి పశువుల పాలైనా / డబ్బాపాలైనా సీసాలో పోసి తాగిస్తారు. సీసాతో పాలు పట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి...

- సీసానూ, పాలపీకను సబ్బు నీళ్లతో శుభ్రంగా కడగాలి.
- కడిగాక పాల సీసాను పదినిమిషాలు మరిగే నీళ్లలో ఉంచాలి. పాల పీకనూ కనీసం రెండు నిమిషాల పాటు వేడి నీళ్లలో ఉంచాలి.
- బిడ్డకు పాలు పట్టిన వెంటనే పక్క మీద పడుకోబెట్టకూడదు. మొదట బిడ్డను భుజంపై వేసుకుని వీపుపై నెమ్మదిగా తడుతూ ఉండాలి. తేన్పు వచ్చే వరకు ఇలా చేయాలి.
- ఒకసారి తాగాక సీసాలో మిగిలిన పాలను పారబోయాలి.
- నిద్రపోయే సమయంలో బిడ్డకు పాలు తాగించకూడదు.
- పాలు తాగించే సమయంలో బిడ్డను ఒళ్లో పడుకోబెట్టి పాలు పట్టాలి.

గమనం



వయసు ఆపని పరుగు

సాధారణంగా 53 ఏళ్ల వయస్సులో ఉన్న ఫ్యాషన్ డిజైనర్‌ని మీ లక్ష్యాలేమిటి? అంటే.. ప్రపంచమంతా బొటిక్స్ తెరవడమో మరొకటో అంటారు. కానీ ప్రపంచవ్యాప్తంగా ప్రధాన మారథాన్‌లను పూర్తి చేయడం అన్నారంటే అది డిజైనర్ నమ్రత జోషిపురా అయి ఉంటారు. అందుకే ఇప్పుడామె బాలీవుడ్ టాప్ డిజైనర్ మాత్రమే కాదు ఇంటర్నేషనల్ మారథాన్ రన్నర్ కూడా. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ కార్యక్రమంలో తనను తాను 'సిక్స్ స్టార్ ఫినిషర్' అని సగర్వంగా పరిచయం చేసుకున్న ఢిల్లీ డిజైనర్ నమ్రత సాక్షితో పంచుకున్న విశేషాలు...



'స్కూల్‌లో, కాలేజ్‌లో ఉండగా హాకీ ఆడేదాన్ని. బీకామ్ చేసినా సృజనాత్మక రంగంలోనే భవిష్యత్తు బాగుంటుందని ఫ్యాషన్ డిజైనింగ్‌లోకి వచ్చాను. ఢిల్లీ నిఫ్ట్‌లో కోర్సు చేస్తున్నపుడు నా టైమ్ పూర్తిగా దానికే కేటాయించాల్సి వచ్చేది. దాంతో ఫిట్‌నెస్, హాకీ అన్నీ అటకెక్కాయి. అయితే వాకర్స్‌కు బెస్ట్ సిటీ అయిన న్యూయార్క్‌లో ఉన్నప్పుడు సుదూరాలు నడవడం అలవాటై ఫ్యాషన్ రంగంలో బిజీగా ఉంటూనే మినీ మారథాన్స్‌లో పాల్గొన్నా. ఆ క్రమంలోనే ఎనిమిదేళ్ల క్రితం ప్రపంచంలోని 6 పెద్ద మారథాన్స్ పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నా. ఢిల్లీ మారథాన్‌తో మొదలుపెట్టి 2018లో లండన్, 2019లో చికాగో, 2021లో బోస్టన్, 2022 బెర్లిన్‌లో తాజాగా టోక్యో మారథాన్ పూర్తి చేశాను'

ఆగని పరుగు..

'వెర్టిగో, ఆస్తమా, పోస్ట్ మెనోపాజ్ సమస్యలు నన్ను బాధించేవి. రెండు సార్లు కోవిడ్‌తో బాధపడినప్పటికీ మారథాన్స్‌కు ట్రైనింగ్ షెడ్యూల్‌ను కోల్పోలేదు, అయితే ఢిల్లీలో కాలుష్యం వల్ల ఆరు బయట రన్ కష్టమైంది. ట్రెడ్‌మిల్‌పై 25–30 కిలోమీటర్లు పరిగెత్తడం కష్టతరమైన పని. ఇవి దృష్టిలో పెట్టుకుని శిక్షణలో మార్పులు చేస్తూ వచ్చిన నా కోచ్ నకుల్ బుట్టాకు థ్యాంక్స్ చెప్పాలి'

మహిళ... గుర్తించాలి తన కల...

'తన కప్పు ఖాళీగా ఉంచుకుని పక్కనవారి కప్పుని నిండేలా చేయడం అసాధ్యం. ఇంటికోసం మాత్రమే కాదు. తన పట్ల కూడా మహిళకు బాధ్యత ఉండాలి. శారీరక, మానసిక, భావోద్వేగపరమైన ఆరోగ్యాలు కాపాడుకుంటూ వ్యక్తిగత లక్ష్యాలు సాధించుకోవాలి'

ఆగను... అలుపెరుగను...

'ఫ్యాషన్ రంగంలో కూడా మరింతగా విస్తరించాలి.. కొత్త స్టోర్స్ ప్రారంభించాలి. నా తదుపరి లక్ష్యం కొన్ని ట్రయల్ రన్నింగ్ ఈవెంట్‌లు. ఎంతకాలం వీలైతే అంత కాలం పరుగు తీస్తూనే ఉంటా' అంటున్న నమ్రత తన కలను నెరవేర్చుకోవాలని కోరుకుందాం.

– సత్యబాబు

సీజన్

గోరింటా పూసిందీ...

ఆషాఢమాసపు వర్షపు జల్లులకు కొత్త చివుర్లు తొడిగి, నిండా ఆకులతో ఉల్లాసంగా కనిపిస్తుంది గోరింట చెట్టు. అత్తవారింటి నుంచి పుట్టింటికి చేరిన నవ వధువు, మరదలిని ఆటపట్టించే వదినలు, అజమాయిషీ చేస్తూ తిరిగే అత్తలు, ఆటపాటలతో సందడి చేసే యువతులు.. అందరినీ కట్టిపడేసి కుదురుగా కూర్చోబెట్టి, ఎర్రని పంట కోసం ఎదురు చూపుల సహనాన్ని అలవాటు చేస్తుంది గోరింట.

- ఎర్రగా పండిన చేతులను చూసుకొని ఎంతగానో మురిసిపోయే వనితలు గోరింటాకును సౌభాగ్యానికి ప్రతీకగానూ భావిస్తారు. గోరింటాకు ప్రాముఖ్యతను తెలుసుకోవడమే కాదు మహిళలంతా ఒకచోట చేరి, వేడుకలా మార్చుకుంటున్నారు. వివాహ వేడుకల్లో మెహిందీ ఫంక్షన్‌కు ఉన్న ప్రాధాన్యత ఆషాఢం గోరింటాకుకూ వర్తింపజేస్తున్నారు.





ఈ కాలమే ఎందుకంటే..

- ఆషాఢంలో వర్షాలు పడుతుంటాయి. ఇన్ఫెక్షన్లు, అంటువ్యాధుల వ్యాప్తికి అవకాశాలు ఎక్కువ. అలాగే, చల్లబడిన బయటి వాతావరణానికి, శారీరక వేడికి సమతుల్యత లోపిస్తుంది. దీనిని బ్యాలెన్స్ చేసే శక్తి గోరింటాకుకు ఉంటుందనేది పెద్దలు చెప్పే మాట.
- వర్షాల కారణంగా నీళ్లలో తరచూ పాదాలు తడుస్తుంటాయి. ఇలాంటప్పుడు పాదాల చర్మానికి సూక్ష్మ క్రిముల వల్ల ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది.
- గోళ్లకు కూడా గోరింటాకు పెట్టడం వల్ల గోళ్లు పెళుసు బారడం, గోరుచుట్టు రావడం వంటి సమస్యలు దరిచేరవు.

ఫుట్ కేర్



వర్షాకాలంలో పాదాల సంరక్షణ

- వర్షానికి పాదాలు మురికిపట్టినట్లు ఉంటే... పన్నీరు మూడు టేబుల్ స్పూన్‌లు, నిమ్మరసం రెండు టేబుల్ స్పూన్‌లు, గ్లిజరిన్ టేబుల్ స్పూన్ ఒక కప్పులో వేసుకుని బాగా కలిపి పాదాలకు పట్టించాలి. అరగంట తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. పమిస్ స్టోన్ లేదా మామూలు బాడీ బ్రష్‌తో రుద్ది కడగాలి
- పాదాలు దుర్వాసన వస్తుంటే... బకెట్‌లో పావు వంతు చన్నీటిని తీసుకుని అందులో టేబుల్ స్పూన్ పన్నీరు, టేబుల్ స్పూన్ నిమ్మరసం, టేబుల్ స్పూన్ ఉడుకులోన్ కలిపి అందులో పాదాలను అరగంట సేపు ఉంచాలి. తర్వాత గోరువెచ్చటి నీటితో పాదాలను బాగా రుద్ది కడగాలి.

హెల్దీ డైట్

వీట్ గ్రాస్ స్మూతీ



కావలసినవి: తాజా పండ్ల ముక్కలు – కప్పు (అరటి, మామిడి లేదా బెర్రీలు); వీట్ గ్రాస్ పౌడర్– టేబుల్ స్పూన్; పాలకూర– కప్పు; బాదం పాలు లేదా పండ్ల రసం – కప్పు; తేనె – టేబుల్ స్పూన్.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ & వెల్‌నెస్ కోచ్

తయారీ: పండ్ల ముక్కలు, పాలు, వీట్ గ్రాస్ పౌడర్, పాలకూర, తేనె అన్నింటినీ కలిపి మిక్సీలో వేసి మెత్తగా బ్లెండ్ చేస్తే వీట గ్రాస్ స్మూతీ రెడీ. పిల్లలు బాగా ఇష్టపడతారు.

పోషకాలు: విటమిన్ ఏ, సీ, కే, ఈ...లతోపాటు ఫోలేట్, పొటాషియం, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం సమృద్ధిగా ఉంటాయి. సుమారుగా 250 కేలరీలు, ప్రొటీన్ 4 గ్రాములు, కార్బోహైడ్రేట్లు 50 గ్రాములు, ఫైబర్– 6 గ్రాములు, చక్కెరలు– 35 గ్రాములు, ఫ్యాట్– 3 గ్రాములు.

ప్రయోజనాలు: ఈ స్మూతీలో ఆల్కలైన్ ప్రాపర్టీస్ ఎక్కువ. ఇవి దేహంలోని వ్యర్థాలను తొలగించడంతోపాటు రక్తాన్ని, కాలేయాన్ని శుభ్రపరుస్తాయి. వ్యాధి నిరోధక శక్తి వృద్ధి అవుతుంది. ఇందులో ఉపయోగించే పాలకూర వంటివి సేంద్రియ ఎరువులతో పండినవైతే మంచిది. రసాయన ఎరువులతో పండిన ఆకులు ఉపయోగించేటట్లయితే ఆకులను ఉప్పు నీటిలో నానబెట్టి శుభ్రం చేయాలి.

హెల్త్ టిప్స్



ద్రాక్షపండ్లలో పిండి పదార్థాలు, చక్కెర పదార్థాలతో పాటు విటమిన్ -ఎ, విటమిన్-బి 1, విటమిన్ సి, విటమిన్ -కె వంటి విటమిన్లు, క్యాల్షియం, ఐరన్, ఫాస్పరస్ లాంటి ఖనిజ లవణాలు మెండుగా ఉంటాయి. ద్రాక్షవల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. మూత్రపిండ సమస్యలతో బాధపడే వారికి మంచి ఔషధంగా పనిచేస్తుంది. కొలెస్ట్రాల్‌ను అదుపు చేయడం, క్యాన్సర్‌ను ఎదుర్కోవడంలో ద్రాక్ష ఉపయోగపడుతుంది. ఆస్తమా, గుండె జబ్బులు, అజీర్ణం, మైగ్రెయిన్.. ఇలా చాలా రుగ్మతలకు ద్రాక్ష అద్భుతంగా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వీటిని పండ్లుగానే తినడంతో పాటు పానీయంగా, సలాడ్లుగా కూడా తీసుకోవచ్చు.



రొయ్యల్లో కొవ్వులు, విటమిన్లు, ప్రొటీన్లు, సోడియం, మెగ్నీషియం వంటి ఖనిజ లవణాలు వుంటాయి. రొయ్యలు క్యాన్సర్‌ను నిరోధిస్తాయి. దంతాలకు, ఎముకలకు మేలు చేస్తాయి. కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కళ్లకు, చర్మానికి మంచిది.



బీట్‌రూట్ రసం తీసుకున్న వారికి రక్తపోటు అదుపులో ఉంటున్నట్లు కొన్ని అధ్యయనాల్లో వెల్లడి అయ్యింది. ఇది కూడా మెదడుకు మేలు చేసేదే. కాబట్టి బీట్‌రూట్‌ను ఆహారంలో భాగంగా చేసుకోవటం మంచిదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.



ఆషాఢంలో అల్ల నేరేడు

ఆషాఢమాసంలో నేరేడు పండు తినాలని పెద్దలు చెబుతారు. ఎందుకంటే, ఆషాఢంలో ఎండ వేడిమి తగ్గి, శరీరం నుంచి చెమట రూపంలోనూ, మూత్రం రూపంలోనూ నీరు అధికంగా విడుదల అవుతుంది. వాతావరణంలోని మార్పు జీర్ణకోశాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. అందువల్ల ఈ సీజన్‌లో నేరేడు పండు తినడం చాలా మంచిదని పెద్దలు చెబుతారు.

అతి మూత్రవ్యాధికి నేరేడు మంచి మందనీ, వెంట్రుకలను కూడా కరిగించి అరగించే శక్తి దానికి ఉందనీ జీవశాస్త్రంలో పాఠాలుగా చదువుకుంటాం. దీనిని బట్టి అర్థం చేసుకోవలసింది ఏమిటంటే, వాతావరణంలోని మార్పులకు దేహం సరయ్యే విధంగా, ఆ కాలంలో ప్రకృతి అందించే నేరేడుని ఔషధంలా ఉపయోగించాలని, శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్స్ అనే విషపదార్థాలను బయటకు పంపించడానికి నేరేడు మంచి మందనీ. దానిని తీసుకోవడం వల్ల శారీరక ఆరోగ్యం బాగుంటుందనీ గ్రహించాలి.

నేరేడు మనకు ఇంకా ఏవిధంగా ఉపయోగపడుతుందో చూద్దాం.

- చాలా కాలంగా కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు పంపటానికి నేరేడు పండ్లను తినటం మంచిది.
- పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలకు కోసేసి బయటికి పంపే శక్తి నేరేడు పళ్ళకు ఉంది.
- రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. వ్యాధి తీవ్రతను తగ్గిస్తుంది.
- మూత్ర సంబంధ సమస్యల నుండి ఉపశమనాన్ని కలిగిస్తుంది.
- నీరసం, నిస్సత్తువ ఉన్న వారు నేరేడు పండును తింటే తక్షణ శక్తి వస్తుంది.
- వెన్నునొప్పి, నడుం నొప్పి, మోకాళ్ల నొప్పులు, నయం అవుతాయి.
- జిగట విరేచనాలతో బాధపడే వారు నేరేడు పండ్ల రసాన్ని రెండు నుంచి మూడు చెంచాల చొప్పున తాగితే రోగికి శక్తి రావడంతోపాటు పేగుల కదలికలు నియంత్రణలో ఉంటాయి.
- కాలేయం పనితీరును క్రమబద్ధీకరించడానికి లేదా శుభ్రపరచడానికి నేరేడు దివ్యౌషధంలా పనిచేస్తుందని కొన్ని అధ్యయనాలు తేల్చాయి.
- ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్లు మెదడుకు, గుండెకు ఔషధంగా పనిచేస్తాయి.
- జ్వరంగా ఉన్నప్పుడు ధనియాల రసంలో నేరేడు రసం కలిపి తీసుకుంటే.. శరీర తాపం తగ్గుతుంది.
- మూత్రం మంట తగ్గడానికి నిమ్మరసం, నేరేడు రసం రెండు చెంచాల చొప్పున నీళ్లలో కలిపి తీసుకోవాలి.
- పిండి పదార్థాలు, కొవ్వు భయం ఉండదు కనుక నేరేడు పండ్లను అధిక బరువు ఉన్నవారు.. మధుమేహం రోగులు సైతం వీటిని రోజుకు ఆరు నుంచి ఎనిమిది దాకా తినవచ్చు.

వీరు తినకూడదు..

అయితే నేరేడు పండ్లను గర్భిణీలు ఎటువంటి పరిస్థితులలో తినకూడదు.నేరేడు అరగడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి.. ఉప్పు వేసి అప్పుడప్పుడు తీసుకోవాలి.

భోజనమైన గంట తరువాత ఈ పండ్లు తీసుకుంటే.. ఆహారం జీర్ణమవుతుంది. అధికంగా తీసుకుంటే.. మలబద్ధకం సమస్యతోపాటు.. నోట్లో వెగటుగా ఉంటుంది.

స్టడీ

హాయిగా నిద్రపోతున్నారా?



చిన్న పిల్లలకి నిద్ర చాలా ముఖ్యం. సుఖమైన నిద్ర వారి ఎదుగుదలను ప్రభావితం చేయడమే కాదు.. వారిలో రోగనిరోధక శక్తిని, మేధాశక్తిని పెంచుతుంది.

- నిద్రకు ఒక సమయాన్ని కేటాయించడం మంచిది. ఇది వాళ్ళ స్లీప్ సైకిల్‌ని క్రమబద్ధపరచడమే కాకుండా పిల్లల్ని మరింత శక్తిమంతంగా తయారు చేస్తుంది. వేళకు పడుకోవడం.. లేవడం అందరికీ అవసరమే.
- సుఖ నిద్రకు ప్రతిరోజూ చేసే క్రమానుసార పనులు ఎంతగానో దోహదపడతాయి. ఇది పిల్లల మానసిక ఆరోగ్యం పెంపుదలకు దోహదపడుతుంది.
- పడుకునే ముందు స్నానం చేయడం, పళ్ల తోముకోవడం, నైట్ డ్రెస్ వేసుకోవడం, కథలు వింటూనో, చెబుతూనో నిద్రపోవడం.. పిల్లలను ఆరోగ్యంగా ఉంచడమే కాదు, వారికి బంధాల పట్ల గౌరవ మర్యాదలు పెరగడానికీ ఉపకరిస్తుంది.
- పరిపూర్ణ నిద్రకి, పడకగదికి అవినాభావ సంబంధం ఉంది. పరిశుభ్రమైన పడకగది ఆరోగ్యమైన నిద్రతో పాటు అన్నిరకాల అనారోగ్యాలనూ దూరంగా ఉంచుతుంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను, టీవీ వంటి వాటిని పడకగదిలో లేకుండా చేయడం ద్వారా మగతనిద్రను దూరం చేయవచ్చు.
- పడుకునే ముందు జంక్ ఫుడ్ తినడం, కాఫీ తాగడం నిద్రాభంగం కలిగిస్తుంది. వీలైనంత వరకూ రాత్రి భోజనంలో పప్పు ధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం, పడుకోవడానికి రెండు మూడు గంటల ముందే తినడం మంచిది.

లైఫ్@360



* ఆస్తి హక్కు

పిల్లలకు బహుమతిగా ఇచ్చినా తిరిగి తీసుకోవచ్చు...

పిల్లలు ఎదిగేంతవరకు తల్లిదండ్రులు ఎంతో కష్టపడతారు. వాళ్లు జీవితాల్లో స్థిరపడ్డాక ఇంకా ఈ బరువు బాధ్యతలు ఎందుకు... ప్రశాంతంగా వారి వద్ద గడిపేద్దాంలే అని ఉన్న ఆస్తులను వారికే పంచేస్తారు. కానీ, ఆస్తులను పంచుకున్న పిల్లలు తల్లిదండ్రులను పట్టించుకోకపోతే.. ఆస్తులను తీసుకొని, ఇంటినుంచి గెంటేస్తే.. ఏం చేయాలి? ఈ మధ్య కాలంలో తరచూ వృద్ధులకు సంబంధించి వచ్చిన వార్తల్లో ఇది ప్రధాన అంశంగా ఉంటోంది. వృద్ధుల ఆస్తులకు సంబంధించి రక్షణ చట్టాలు ఏం చెబుతున్నాయో... తెలుసుకుందాం.

మహబూబాబాద్ జిల్లా గార్ల గ్రామంలోని జెండా బజారుకు చెందిన వృద్ధురాలు నర్సమ్మ భర్త కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. వీరికి ముగ్గురు కుమారులు. ఉన్న మూడెకరాల భూమిని కొడుకులు పంచుకున్నారు. ఆ తర్వాత ఇంటిని కూలగొట్టి తల్లికి గూడు లేకుండా చేశారు. ఆస్తి పంచుకునే ముందు కొడుకులు నెలకు ఒకరి చొప్పున అమ్మను సాకుతామని ఒప్పందం చేసుకున్నారు. తీరా ఆస్తి పంచిన తర్వాత అసలు అమ్మ విషయాన్నే గాలికి వదిలేశారు. దాంతో చేసేదేం లేక తెలిసిన వాళ్ల ఇళ్ల చుట్టూ తిరుగుతూ వారిలో దయగల తల్లి ఎవరైనా ఇంత ముద్ద పెడితే తిని, ఎవరో ఒక్కళ్ల ఇంటి అరుగులపై తలదాచుకోవలసి వస్తోందా వృద్ధురాలు. ఈ విషయం తెలిసిన తహసీల్దార్, ఆస్తిని తీసుకుని తల్లిని వదిలేసిన కుమారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిని పోషించాలని, లేదంటే ఆమె పంచి ఇచ్చిన యావదాస్తిని తిరిగి తల్లికి చెందేటట్లుగా చేస్తామని వారిని హెచ్చరించారు.

•••

సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం 2007లోని (సీనియర్ సిటిజన్స్ యాక్ట్) సెక్షన్ 23(1) తల్లి దండ్రుల ఆస్తిని రక్షిస్తుంది. మోసాన్ని నిరోధించి, ప్రాథమిక సౌకర్యాలను కోల్పోకుండా పరి రక్షిస్తుంది. ఈ చట్టం అమలులోకి వచ్చి 15 సంవత్సరాలు గడిచినా ఈ హక్కులపై సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన అంతంత మాత్రమే. సీనియర్లు తమ ఆస్తిని పంచి ఇచ్చిన తర్వాత వారిని నిర్లక్ష్యం చేస్తే ట్రిబ్యునల్ ద్వారా ఆస్తి బదిలీని రద్దు చేసుకునే అవకాశంఉంది.

ఆస్తిని తిరిగి పొందవచ్చు...

తమ పిల్లలకు ఆస్తిని బహుమతిగా ఇవ్వాలని ఆలోచించే వయోవృద్ధులైన తల్లిదండ్రులు ట్రాన్స్‌ఫర్ డీడ్‌లో ఒక ఎక్స్‌ప్రెస్ షరతును చేర్చవచ్చు. ఆస్తిని బహుమతిగా తీసుకున్న పిల్లలు ఈ షరతును ఉల్లంఘిస్తే, ఆ బహుమతి చెల్లుబాటు కానిదిగా ప్రకటించి, తల్లిదండ్రులు మెయింటెనెన్స్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చు. తల్లిదండ్రులు ప్రేమ, ఆప్యాయతతో లేదా సేవలకు బదులుగా పిల్లలకు ఆస్తిని బహుమతిగా ఇచ్చినప్పుడు దానిని సూచించవచ్చు. అయితే, అస్పష్టతకు తావు లేకుండా ఎక్స్‌ప్రెస్ షరతును చేర్చడం ఉత్తమం అని పేర్కొన్నాయి.

అవగాహన అవసరం



వృద్ధుల రక్షణ చట్టం గురించి అవగాహన మన దేశంలో చాలా మందికి లేదు. అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. వృద్ధులు కూడా తమ సమస్యను చట్టం దృష్టికి తేవాలి. ఆస్తులు లేకపోయినా వృద్ధ తల్లిదండ్రులు మెయింటనెన్స్ క్లెయిమ్ చేసుకోవచ్చు.

– ఎ.పి.సురేష్, సీనియర్ అడ్వకేట్, హైకోర్ట్

ఇంటినుంచి తరిమివేయవచ్చు

సీనియర్ సిటిజన్ల ఆస్తుల నుంచి పిల్లలు లేదా ఆస్తి తీసుకున్న బంధువులను తొలగించడానికి సుప్రీం కోర్టుతో సహా కోర్టులు అనుమతించాయి. చట్టబద్ధమైన వారసులమనే కారణంతో తల్లిదండ్రులను వేధిస్తే ఇంటినుంచి బయటకు పంపివేయవచ్చని కూడా ఆదేశించింది.

ముఖ్యమైన గమనికలు

- ఆస్తిలో ఆర్థిక పెట్టుబడులు, కాపీరైట్‌లు, పేటెంట్లు, ఆభరణాలు, కళాఖండాలు మొదలైనవి ఉండచ్చు.
- ఆస్తుల వివరాలతోపాటు బ్యాంక్, డీమ్యాట్ ఖాతాలు, ఎమ్ఎఫ్‌లు, షేర్లు, ఎఫ్డీలు, బీమా పాలసీలు, లోన్లు.. మొదలైన వాటి జాబితా కోసం న్యాయవాది, ఆర్థిక సలహాదారుని సంప్రదింపు అవసరం. అందుకని వారి వివరాలను తీసుకోండి.
- వారసత్వం, ఆస్తుల ప్రణాళికలో కీలకమైన భాగం వీలునామాను రూపొందించడం. దాని చెల్లుబాటును నిర్ధారించడానికి కొన్ని అంశాలను జాగ్రత్తగా చూసుకోవాలి... ఆస్తులకు సంబంధించిన వివరాలు, కంపైల్ చేయాల్సిన సమాచారంలో ఇద్దరు సాక్షులను, ఒక ఎగ్జిక్యూటర్‌ని నియమించుకోవాలి.
- వీలునామాలో మీ తదనంతరం ఆస్తి ఎవరికి చెందాలో వారి పేర్లను విధిగా నమోదు చేయాలి. లేకుంటే తర్వాత వారసత్వ చట్టాలు వర్తిస్తాయి.

సినిమా

డేట్ ఫిక్స్



• విక్రమ్

'తంగలాన్' సినిమా థియేటర్స్‌కు వచ్చే తేదీ ఖరారైంది. విక్రమ్ హీరోగా నటించిన ఈ పీరియాడికల్ సినిమాను ఆగస్టు 15న రిలీజ్ చేయనున్నట్లుగా చిత్రయూనిట్ శుక్రవారం ప్రకటించింది. పా. రంజిత్ దర్శకత్వంలో నీలమ్ ప్రొడక్షన్స్, స్టూడియో గ్రీన్ ఫిలింస్ పతాకాలపై కేఈ జ్ఞానవేల్ రాజా ఈ సినిమాను నిర్మించారు. 18వ శతాబ్దంలో కేజీఎఫ్ (కోలార్ గోల్డ్ ఫీల్డ్స్) నేపథ్యంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో మాళవికా మోహనన్, పార్వతీ తిరువోతు, పశుపతి, హరికృష్ణన్ ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ చిత్రంలో విక్రమ్ ఓ తెగకు చెందిన నాయకుడిగా కనిపిస్తారు.

త్వరలో సెట్‌లోకి...



• సమంత

సినిమా సెట్‌లో అడుగుపెట్టి మునుపటి ఉత్సాహంతో చిత్రీకరణలో పాల్గొనడానికి సమంత రెడీ అవుతున్నట్లు సమాచారం. అనారోగ్య సమస్యల కారణంగా కొంత కాలంగా ఆమె చిత్రీకరణలకు దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే. కాగా వచ్చే నెల నుంచి సమంత మూవీ సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారని టాక్. అంతేకాదు... తన భవిష్యత్ సినిమాల్లోని రోల్స్‌కు సంబంధించి ప్రత్యేక శిక్షణతో ప్రస్తుతం ఆమె బిజీగా ఉన్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. కాగా ఈ ఏడాది ఏప్రిల్ 28న తన బర్త్ డే సందర్భంగా 'మా ఇంటి బంగారం' సినిమాను ప్రకటించారు సమంత. ఈ సినిమాలోని మెయిన్ లీడ్ రోల్‌లో నటించి, నిర్మించనున్నారు. అలాగే తమిళ హీరో విజయ్‌తో ఓ సినిమా, ఓ హిందీ సినిమాలో కూడా సమంత హీరోయిన్‌గా నటించనున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరి... సమంత ఏ సినిమా సెట్స్‌లో ముందుగా అడుగుపెడతారు? ప్రస్తుతం ఏ సినిమాలోని పాత్ర కోసం శిక్షణ తీసుకుంటున్నారనేది తెలియాల్సి ఉంది. ఇక సమంత నటించిన 'సిటాడెల్' వెబ్ సిరీస్ త్వరలో స్ట్రీమింగ్ కానుంది.

ఐఎఫ్ఎఫ్ఎమ్‌కి అతిథిగా...

– రామ్‌చరణ్



రామ్‌చరణ్‌కి అరుదైన గౌరవం దక్కింది. 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్' (ఐఎఫ్ఎఫ్ఎమ్) 15వ ఎడిషన్‌లో ఈ హీరో గౌరవ అతిథిగా పాల్గొననున్నారు. "రామ్‌చరణ్ వస్తున్నారు. 'నాటు నాటు..' పాటకు డ్యాన్స్ చేయడానికి సిద్ధంగా ఉండండి' అంటూ ఎక్స్ వేదికగా 'ఐఎఫ్ఎఫ్ఎమ్' తెలియజేసింది. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి 25 వరకు మెల్‌బోర్న్‌లో ఈ చిత్రోత్సవం జరగనుంది. ఈ వేడుకలో రామ్‌చరణ్ అతిథిగా పాల్గొనడంతో పాటు భారతీయ చలన చిత్ర పరిశ్రమకు చేసిన సేవలకుగాను 'ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్ అంబాసిడర్' అవార్డును కూడా అందుకోనున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ స్పందిస్తూ– "భారతీయ సినిమా గొప్పతనాన్ని, వైవిధ్యాన్ని అంతర్జాతీయ వేదికపై సెలబ్రేట్ చేసుకునే 'ఐఎఫ్ఎఫ్ఎమ్-2024'లో భాగం అవుతున్నందుకు గౌరవంగా భావిస్తున్నాను. మన చిత్ర పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించనుండటం నా అదృష్టం. 'ఆర్ఆర్ఆర్' విజయం విశ్వవ్యాప్తం. మెల్‌బోర్న్‌లో ప్రేక్షకులను కలుసుకునేందుకు ఎంతో థ్రిల్లింగ్‌గా ఎదురు చూస్తున్నాను" అన్నారు.

సినిమా చేసేయండని ఎన్టీఆర్ అన్నారు

– అల్లు అరవింద్




• అంజి కె. మణిపుత్ర, 'బన్నీ' వాసు, అల్లు అరవింద్, నార్నే నితిన్

"'ఆయ్' కథ ఓకే అయిన తర్వాత ఎన్టీఆర్‌కి ఫోన్ చేశాం. 'మూవీ రిలీజ్ వరకు మనం పుష్ చేస్తాం... ఆ తర్వాత సినిమా బాగుంటేనే ఆడుతుంది. ఎవరి కష్టం వారిదే. 'ఆయ్' కథ బాగుందని అంటున్నారు... సినిమా చేసేయండి అని ఎన్టీఆర్ చెప్పారు" అని అల్లు అరవింద్ అన్నారు. హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా నటించిన చిత్రం 'ఆయ్'. అంజి కె. మణిపుత్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 15న రిలీజ్ కానుంది. 'ఆయ్' థీమ్ సాంగ్ రిలీజ్ ఈవెంట్‌లో నార్నే నితిన్ మాట్లాడుతూ– "గోదావరి నేపథ్యంలో సాగే ఈ సినిమాలో స్నేహం గురించి చెప్పాం. అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది" అన్నారు. "మా సినిమా చూస్తే కచ్చితంగా నవ్వి నవ్వి బుగ్గలు నొప్పెడతాయి. బాగా గట్టిగా నవ్వే వాళ్లంటే పొట్ట కూడా నొప్పి పుడుతుంది" అన్నారు 'బన్నీ' వాసు. "అమ్మాయిలను ప్రకృతితో పోల్చుతాం. అమ్మాయి తడిసినా, ఊరు తడిసినా అందంగా ఉంటుంది. మా 'ఆయ్' కూడా అంత అందంగా ఉంటుంది" అన్నారు అంజి కె. మణిపుత్ర.

నన్ను క్షమించండి

– పార్తిబన్





హీరోయిన్ తమన్నాకు తమిళ నటుడు-దర్శక-నిర్మాత పార్తిబన్ క్షమాపణలు చెప్పారు. ఓ ఇంటర్వ్యూలో తమన్నా డ్యాన్స్ గురించి పార్తిబన్ చేసిన కామెంట్‌పై తీవ్ర విమర్శలు రావడంతో ఆయన క్షమాపణలు కోరారు. ఆ ఇంటర్వ్యూలో పార్తిబన్ మాట్లాడుతూ – "ప్రస్తుత పరిస్థితుల్లో సినిమాలో కథ ఉందా? లేదా అన్నది ప్రేక్షకులు చూడటం లేదు. హీరోయిన్ డ్యాన్స్ కోసమే సినిమాలు చూస్తున్నారు. తమన్నా ఉంటే చాలు.. కథ లేకపోయినా ఫర్వాలేదు.. సినిమా హిట్టవుతుంది" అన్నారు. పార్తిబన్ మాటలను పలువురు నెటిజన్స్ తప్పుబట్టారు. దాంతో పార్తిబన్ స్పందిస్తూ– "సినిమా ఇండస్ట్రీ వారిపై నాకు గౌరవం ఉంది. నటీనటులను తక్కువ చేసే ఉద్దేశం లేదు. నా మాటలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి" అన్నారు. ఇక తెలుగులో రామ్‌చరణ్ హీరోగా నటించిన 'రచ్చ' సినిమాలో పార్తిబన్ నటించిన విషయం తెలిసిందే.


ఆహారాన్ని తాగండి... నీటిని నమలండి!

– మాధవన్



"వ్యాయామం చేయలేదు. రన్నింగ్ చేయలేదు. సర్జరీ అసలే లేదు. మెడికేషన్ పాటించలేదు... కానీ 21 రోజుల్లోనే పూర్తిగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యాను. బాగా బరువు తగ్గిపోయాను"... 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమాలో తన బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్ గురించి మాధవన్ చెప్పిన మాటలు ఇవి. ఈ ఆసక్తికరమైన విషయాలను ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాధవన్ వెల్లడించగా, ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మాధవన్ నటించి, స్వీయ దర్శకత్వం వహించిన బయోగ్రాఫికల్ డ్రామా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'. ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా మాధవన్ ఈ సినిమాను తెరకెక్కించి, టైటిల్ రోల్ చేశారు. ఈ చిత్రంలో మాధవన్ వివిధ వయస్సుల్లో కనిపిస్తారు. కొన్ని సన్నివేశాల్లో బాగా బరువు పెరిగి, పొట్ట ఉన్న వ్యక్తిగా కనిపిస్తారు. ఈ లుక్ నుంచి మాధవన్ మళ్లీ తన సాధారణ లుక్‌కు మారేందుకు కేవలం 21 రోజులు మాత్రమే పట్టిందట. ఆ మార్పు గురించి మాధవన్ మాట్లాడుతూ– "నేనొక డాక్టర్‌లా మాట్లాడుతున్నానని అనుకోవచ్చు. నా శరీరానికి ఏది మంచి ఆహారమని భావించానో దాన్నే తిన్నాను. 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'కి దర్శకత్వం వహిస్తున్నప్పుడు కాస్త పొట్టతో కనిపించేవాడిని. ఆ తర్వాత 21 రోజులకు నార్మల్‌గా మారిపోయాను. ఇదంతా నేను తీసుకున్న ఆహారం వల్లే జరిగిందని అనుకుంటున్నాను. చెప్పాలంటే నా జీవితంలోనే సైన్స్ ఓ భాగమైపోయిందని అనిపిస్తోంది" అని చెప్పుకొచ్చారు. ఇంకా 'ఎక్స్' వేదికగా ఈ విషయంపై మాధవన్ స్పందిస్తూ– "అప్పుడప్పుడూ ఉపవాసం ఉన్నాను. ఆహారాన్ని 45 నుంచి 60 సార్లు బాగా నమిలాను (మీ ఆహారాన్ని తాగండి... నీటిని నమలండి). సాయంత్రం 6 గంటల 45 నిమిషాలకే రోజులోని నా చివరి భోజనం పూర్తయ్యేది. జ్యూస్‌లు ఎక్కువగా తాగాను. ఆకుపచ్చ కూరగాయలు తిన్నాను. ఉదయాన్నే సుదీర్ఘంగా నడిచేవాడ్ని. నిద్రపోవడానికి 90 నిమిషాల ముందు ఏ స్క్రీనూ చూడలేదు. రాత్రివేళ గాఢంగా నిద్రపోతాను. నా శరీరానికి, నా ఆరోగ్యానికి, నా జీవన శైలికి, జీవక్రియకు తగ్గట్లుగా ఆహారాన్ని తీసుకున్నాను. దాంతో క్రమ క్రమంగా మార్పు వచ్చింది" అన్నారు.

జనార్ధన్ టు జాన్ స్నో



• రాజేంద్రప్రసాద్

సున్నిపెంట జనార్ధన్ ఎందుకు ఏజెంట్ జాన్ స్నోగా మారాడు? అంటే 'రాబిన్‌హుడ్' సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. హిట్ ఫిల్మ్ 'భీష్మ' తర్వాత హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందుతున్న కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ 'రాబిన్‌హుడ్'. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో రాజేంద్రప్రసాద్, 'వెన్నెల' కిశోర్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. శుక్రవారం రాజేంద్ర ప్రసాద్ బర్త్ డే. ఈ సందర్భంగా 'రాబిన్‌హుడ్' సినిమాలో సున్నిపెంట జనార్ధన్ అలియాస్ ఏజెంట్ జాన్ స్నో పాత్రలో రాజేంద్ర ప్రసాద్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 20న విడుదల కానుంది.

యావరేజ్ స్టూడెంట్



• పవన్, స్నేహా

'మెరిసే మెరిసే' చిత్ర దర్శకుడు పవన్ కుమార్ కొత్తూరి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహా మాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్ హీరోయిన్లుగా నటించారు. శ్రీ నీలకంఠ మహదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీపై రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. కార్తీక్ బి కొడకండ్ల సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'సారా సారా..' అంటూ సాగే పాటను విడుదల చేశారు. శివకృష్ణాచారి ఎర్రోజు సాహిత్యం అందించిన ఈ పాటని పద్మలత, అనుదీప్ దేవ్ ఆలపించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	739	80,605
నిఫ్టీ ▽	270	24,531

విదేశీ సూచీలు (శుక్ర రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,724	▽ 147
డోజోన్స్	40,225	▽ 439
ఎఫ్‌టీఎస్ఈ 100	8,156	▽ 49
డాక్స్	18,172	▽ 183
షాంఘై	2,982	△ 5
నికాయ్	40,064	▽ 63

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	73,240	▽ 739
బంగారం (99.5 స్వచ్ఛత)	72,947	▽ 736
వెండి (కేజీ)	88,983	▽ 2,572

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.23	84.25
£	బ్రిటన్ పౌండ్		107.09	109.61
€	యూరో		89.93	92.38
¥	జపాన్ ఎన్ (100)		53.80	54.60
AUS	ఆస్ట్రేలియా డాలర్		55.15	57.10
S$	సింగపూర్ డాలర్		59.57	64.14
SAR	సౌదీ రియాల్		21.40	22.95
UAE D	యూఏఈ దిర్హామ్		21.87	23.66
¥	చైనా యువాన్		10.39	12.46

రిలయన్స్ డీలా

క్యూ1 లాభం రూ. 15,138 కోట్లు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 5 శాతం క్షీణించి రూ. 15,138 కోట్లకు పరిమితమైంది. టెలికం, రిటైల్ బిజినెస్‌ల వృద్ధిని ఇంధన, పెట్రోకెమికల్ మార్జిన్లు దెబ్బతీశాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 16,011 కోట్లు ఆర్జించింది. త్రైమాసికవారీ(క్యూ4)గా నికర లాభం 20 శాతం క్షీణించింది. తరుగుదల, ఎమార్టైజేషన్ వ్యయాలు 16 శాతం పెరిగి రూ. 13,596 కోట్లను తాకాయి. ఇబిటా 2 శాతం వృద్ధితో రూ. 42,748 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 12 శాతం ఎగసి రూ. 2.57 లక్షల కోట్లను తాకింది. ఆయిల్ టు కెమికల్(ఓ2సీ) బిజినెస్ ఇబిటా 14 శాతం నీరసించి రూ. 13,093 కోట్లకు పరిమితమైంది. చమురు, గ్యాస్ ఇబిటా 30 శాతం జంప్‌చేసి రూ. 5,210 కోట్లయ్యింది. కేజీ డీ6 బ్లాక్ నుంచి రోజుకి 28.7 మిలియన్ ప్రామాణిక ఘనపు మీటర్ల గ్యాస్‌ను ఉత్పత్తి చేసింది. జూన్ చివరికల్లా ఆర్ఐఎల్ నికర రుణ భారం రూ. 1.12 లక్షల కోట్లకు చేరింది.



జియో ఇన్ఫోకామ్ గుడ్

జియో ప్లాట్‌ఫామ్స్ కన్సాలిడేటెడ్ నికర లాభం 12 శాతం వృద్ధితో రూ. 5,698 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 13 శాతం బలపడి రూ. 34,548 కోట్లను తాకింది. దీనిలో భాగమైన రిలయన్స్ టెలికం సర్వీసుల విభాగం జియో ఇన్ఫోకామ్ స్టాండెలోన్ నికర లాభం వార్షికంగా 12 శాతం ఎగసింది. రూ. 5,445 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 10 శాతం పుంజుకుని రూ. 26,478 కోట్లకు చేరింది. వినియోగదారుల సంఖ్య 48.97 కోట్లను తాకింది. ఒక్కో వినియోగదారుడిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) రూ. 181.7కు చేరింది. తలసరి డేటా వినియోగం రోజుకి 1జీబీని మించింది. దీంతో డేటా ట్రాఫిక్ కారణంగా ప్రపంచంలో అతిపెద్ద ఆపరేటర్‌గా అవతరించింది. చైనా వెలుపల అతిపెద్ద 5జీ ఆపరేటర్‌గా జియో నిలుస్తోంది.

ఆర్ఐఎల్ షేరు బీఎస్ఈలో 2 % క్షీణించి రూ. 3110 వద్ద ముగిసింది.



లాభాలు పటిష్టం

కన్జూమర్, ఆయిల్ అండ్ గ్యాస్ బిజినెస్ ప్రభావంతో క్యూ1లో మెరుగైన ఇబిటాను సాధించాం. ఇది డైవర్స్ పోర్ట్‌ఫోలియో బిజినెస్‌కున్న పటిష్టతను ప్రతిఫలిస్తోంది. డిజిటల్ సర్వీసుల బిజినెస్ ప్రోత్సాహకర పనితీరు చూపుతోంది. రిటైల్ బిజినెస్ సైతం పటిష్ట ఆర్థిక ఫలితాలను సాధించింది.

– ముకేశ్ అంబానీ, చైర్మన్, ఎండీ, రిలయన్స్ ఇండస్ట్రీస్

రిటైల్ బాగుంది...

రిలయన్స్ రిటైల్ విభాగం ఆర్ఆర్‌వీఎల్ క్యూ1 నికర లాభం 5 శాతం వృద్ధితో రూ. 2,549 కోట్లయ్యింది. స్థూల ఆదాయం 8 శాతం ఎగసి రూ. 75,615 కోట్లను తాకింది. ఇబిటా 10 శాతంపైగా పుంజుకుని రూ. 5,664 కోట్లకు చేరింది. 331 కొత్త స్టోర్లను తెరిచింది. దీంతో వీటి సంఖ్య 18,918ను తాకింది. మరోపక్క కొత్తగా 30 మెట్రో(హోల్‌సేల్) స్టోర్లకు తెరతీసింది. వీటి సంఖ్య 200కు చేరింది. జర్మన్ దిగ్గజం మెట్రో ఏజీ నుంచి 2022 డిసెంబర్‌లో రిలయన్స్ రూ. 2,850 కోట్లకు మెట్రో బిజినెస్‌ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.



జీఆర్‌టీ జ్యువెలర్స్ ఆషాఢం ఆఫర్లు



హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలర్స్ ఆషాఢ మాసం సందర్భంగా ఆఫర్లను ప్రకటించింది. ప్రతి కొనుగోలుపై నిర్ధారిత బహుమతి పొందవచ్చు. కొనుగోలు విలువ పెరిగే కొద్దీ ఈ బహుమతి విలువ పెరుగుతుంది. పాత బంగారు ఆభరణాలు మార్చుకొనే కస్టమర్లు గ్రాముకు రూ.50 అదనంగా అందుకోవచ్చు. ''ప్రతి ఏడాది ఆషాఢంలో జీఆర్‌టీ షోరూంల్లో కొనుగోలు చేసే కస్టమర్ల ఆనందాన్ని రెట్టింపు చేయడమే మా లక్ష్యం'' అని కంపెనీ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. ఆఫర్లను అందరూ వినియోగించుకోవాలని కోరారు.

రికార్డుల ర్యాలీకి బ్రేక్

బడ్జెట్‌కు ముందు అప్రమత్తత
- ప్రపంచ మార్కెట్లపై మైక్రోసాఫ్ట్ ఎఫెక్ట్
- 81 వేల దిగువకు సెన్సెక్స్
- నిఫ్టీకి 270 పాయింట్ల నష్టం



ముంబై: దేశీయ స్టాక్ సూచీల నాలుగు రోజుల రికార్డుల ర్యాలీకి శుక్రవారం బ్రేక్ పడింది. వచ్చే వారం కేంద్ర బడ్జెట్ ప్రకటన నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యతో అంతర్జాతీయంగా ఐటీ సేవలకు అంతరాయం కలగడమూ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. ఫలితంగా సెన్సెక్స్ 739 పాయింట్లు నష్టపోయి 81 వేల దిగువన 80,605 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 270 పాయింట్లు పతనమై 24,531 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 81,588 వద్ద, నిఫ్టీ 24,855 వద్ద జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. అయితే అదే జోరును కనబరచడంలో విఫలమయ్యాయి. వెంటనే నష్టాల్లోకి జారుకున్న సూచీలు రోజంతా నష్టాల్లో కదలాడాయి. ఒక దశలోనూ సెన్సెక్స్ 844 పాయింట్లు నష్టపోయి 80,499 వద్ద, నిఫ్టీ 292 పాయింట్లు క్షీణించి 24,508 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. మైక్రోసాఫ్ట్‌కు విండోస్ తలెత్తిన సాంకేతిక సమస్యలతో అంతర్జాతీయంగా మార్కెట్లు డీలా పడ్డాయి.

'మైక్రోసాఫ్ట్' ఎఫెక్ట్ మాపై లేదు: ఎక్స్ఛేంజీల వివరణ

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ (బీఎస్ఓడీ)ఎర్రర్' సాంకేతిక సమస్య ప్రభావం తమపై పడలేదని బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు ప్రకటించాయి. తమ సేవలు యథావిధిగా కొనసాగినట్లు వేర్వేరు ప్రకటనల్లో వివరణ ఇచ్చాయి.

బ్రోకింగ్ షేర్లకు నష్టాలు

మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ వ్యవస్థలో తలెత్తిన సమస్యలతో పలు రంగాల్లో సేవలకు విఘాతం ఏర్పడడం.. పరోక్షంగా స్టాక్ బ్రోకింగ్ షేర్ల నష్టాలకు దారితీసింది. కొన్ని బ్రోకింగ్ సంస్థల సేవలకు సమస్య తలెత్తడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగడమే నష్టాలకు కారణం.

ఇన్వెస్టర్లకు రూ.7.94 లక్షల కోట్ల నష్టం

సెన్సెక్స్ దాదాపు ఒకశాతం నష్టపోవడంతో బీఎస్ఈలో రూ.7.94 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.4.46 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఈ సూచీలోని 30 షేర్లలో ఇన్ఫోసిస్ 2%, టీసీఎస్ 1%, ఏషియన్ పేయింట్స్ 0.50%, హెచ్‌సీఎల్ టెక్ 0.08 శాతం మాత్రమే లాభపడ్డాయి.

పెన్షన్ ఫండ్స్‌కు పన్ను ప్రయోజనాలు

ఎన్‌పీఎస్ మాదిరే కల్పించాలి • బడ్జెట్‌పై ఆర్థిక మంత్రికి 'యాంఫి' వినతి

పెన్షన్ సదుపాయంతో కూడిన మ్యూచువల్ ఫండ్స్ పథకాలు, డెట్ ఫండ్స్ విషయంలో పన్ను ప్రయోజనాలు కల్పించాలంటూ మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) కేంద్ర ఆర్థిక మంత్రిని కోరింది. బడ్జెట్‌కు ముందు తమ డిమాండ్లను ఆర్థిక మంత్రికి దృష్టికి తీసుకెళ్లింది. జాతీయ పింఛను పథకం(ఎన్‌పీఎస్)లో పెట్టుబడులకు సెక్షన్ 80సీసీడీ కింద కల్పిస్తున్న పన్ను మినహాయింపును పెన్షన్ ప్రయోజనంతో కూడిన మ్యూచువల్ ఫండ్స్ (మ్యూచువల్ ఫండ్స్ లింక్డ్ రిటైర్మెంట్ స్కీమ్స్)కు సైతం అమలు చేయాలని కోరింది. అలాగే, డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో మూడేళ్లు, అంతకుమించిన పెట్టుబడులను ఉపసంహరించుకున్నప్పుడు.. వచ్చిన లాభంపై డిబెంచర్లకు మాదిరే ఫ్లాట్ 10% పన్నును, ద్రవ్యోల్బణం మినహాయింపు ప్రయోజనం లేకుండా అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈక్విటీల్లో 35% వరకు పెట్టుబడులు పెట్టే డెట్ ఫండ్స్‌కు గతేడాది విధించిన స్వల్పకాల మూలధన లాభాల పన్నును తిరిగి పరిశీలించాలని కోరింది.



బాండ్లలో పెట్టుబడులకు ప్రోత్సాహం

డెట్ ఫండ్స్ ద్వారా బాండ్లలో పెట్టుబడులకు రిటైల్ ఇన్వెస్టర్లను ప్రోత్సహించాలని కూడా ఆర్థిక మంత్రిని యాంఫి కోరింది. డిబెంచర్లు, ప్రభుత్వ సెక్యూరిటీలకు మాదిరే పన్ను రేట్లు అమలు చేయాలని, ఇందుకు ఫైనాన్స్ యాక్ట్, 2023లోని సెక్షన్ 50ఏఏను సవరించాలని వినతిపత్రంలో పేర్కొంది.



స్టార్టప్‌లపై ఏంజెల్ ట్యాక్స్ ఎత్తేయాలి..

స్టార్టప్‌లపై ఏంజెల్ ట్యాక్స్ ఎత్తి వేయాలంటూ పరిశ్రమలు, వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కేంద్ర ఆర్థిక శాఖకు సూచించింది. స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ కాని స్టార్టప్‌లు జారీ చేసే షేర్ల విలువ మదింపునకు గాను డీపీఐఐటీ గతేడాది సెప్టెంబర్‌లో కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. పారదర్శక మార్కెట్ విలువ కంటే అధిక ధరపై షేర్లు జారీ చేసే స్టార్టప్‌లు ఈ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీన్ని తొలగిస్తే స్టార్టప్‌లను ప్రోత్సహించినట్టు అవుతుంది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

పేటీఎమ్‌కు పెరిగిన నష్టాలు	బ్యాంకింగ్‌లో కార్పొరేట్లకు నో ఎంట్రీ..

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-7-2024	
విశాఖ	550–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	520–00
విజయవాడ	530–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520–00
వరంగల్	522–00
రిటైల్ ధర	5.80

క్యూ1లో విప్రో ఓకే



- రూ. 3,003 కోట్లు దాటిన నికర లాభం
- క్యూ2 వృద్ధిపై -1నుంచి+1 శాతం అంచనాలు
- 260– 265 కోట్ల డాలర్ల మధ్య ఆదాయం

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 4.6 శాతం వృద్ధితో రూ. 3,003 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం ఆదాయం 3.8 శాతం క్షీణించి రూ. 21,694 కోట్లకు పరిమితమైంది. రెండో త్రైమాసికం (జూలై–సెప్టెంబర్)లో ఐటీ సర్వీసుల ఆదాయం 260–265.2 కోట్ల డాలర్ల మధ్య నమోదుకావచ్చని తాజాగా అంచనా వేసింది. వెరసి త్రైమాసికవారీగా కరెన్సీ నిలకడ ప్రాతిపదికన -1 శాతం నుంచి +1 శాతం మధ్య గైడెన్స్‌ను ప్రకటించింది. బిలియన్ డాలర్లకు మించిన భారీ డీల్స్ ద్వారా మరోసారి ఈ త్రైమాసికంలో కంపెనీ రికార్డు నెలకొల్పినట్లు విప్రో సీఈవో, ఎండీ శ్రీని పాలియా పేర్కొన్నారు. శుక్రవారం మైక్రోసాఫ్ట్ సిస్టమ్స్‌లో ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన సాంకేతిక సమస్యలపై స్పందిస్తూ కంపెనీలో ఎలాంటి సవాళ్లు ఎదురుకాలేదని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఈ అంశంలో సవాళ్లు ఎదుర్కొన్న యూఎస్, యూరప్ క్లయింట్లకు సహాయం చేసినట్లు తెలియజేశారు.

12,000 మందికి చాన్స్

ఈ ఏడాది 10,000–12,000 మందికి ఉపాధి కల్పించనున్నట్లు విప్రో సీహెచ్‌ఆర్‌వో సౌరభ్ గోవిల్ వెల్లడించారు. గతేడాది క్యూ1తో పోలిస్తే నికరంగా 337 మంది ఉద్యోగులను జత చేసుకుంది. దీంతో జూన్ చివరికల్లా మొత్తం సిబ్బంది సంఖ్య 2,34,391కు చేరింది.

షేరు బీఎస్ఈలో 3% క్షీణించి రూ. 557 వద్ద ముగిసింది.



సెమీస్‌లో అనిరుధ్–అర్జున్ ద్వయం

న్యూపోర్ట్ (అమెరికా): హాల్ ఆఫ్ ఫేమ్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్ విభాగంలో వరుసగా రెండో ఏడాది సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్–అర్జున్ ఖడే (భారత్) ద్వయం 6–4, 1–6, 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో క్రిస్టియన్ హారిసన్–వాసిల్ కిర్కోవ్ (అమెరికా) జంటపై గెలిచింది.

క్వార్టర్ ఫైనల్లో సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ75 టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. అమెరికాలో శుక్రవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 318వ ర్యాంకర్ సహజ 6–3, 7–6 (7/5)తో ప్రపంచ 177వ ర్యాంకర్, రెండో సీడ్ ఎలిజబెత్ మాండ్లిక్ (అమెరికా)పై గెలిచింది. డబుల్స్‌లో సహజ (భారత్)–హిరోకో కువాటా (జపాన్) జోడీ సెమీఫైనల్లోకి చేరింది.





దీపిక కుమారి

తరుణ్‌దీప్ రాయ్, ధీరజ్, ప్రవీణ్ జాధవ్

PARIS 2024

మరో 6 రోజుల్లో...

దీపిక కుమారిపైనే భారత్ ఆశలు
ఆర్చరీలో ఊరిస్తున్న ఒలింపిక్ పతకం
మూడు విభాగాల్లో ధీరజ్ బరిలోకి

ఈసారైనా గురి కుదిరేనా!

అంతర్జాతీయ టోర్నీలలో మాత్రం నిలకడగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించడం... ఒలింపిక్స్‌కు వచ్చేసరికి తడబడటం... భారత ఆర్చరీ గురించి ఇలా క్లుప్తంగా చెప్పుకోవచ్చు. 1900 పారిస్ ఒలింపిక్స్‌లో ఆర్చరీకి తొలిసారి చోటు దక్కింది. భారత్ మాత్రం 1988 సియోల్ ఒలింపిక్స్‌తో అరంగేట్రం చేసింది. పురుషుల వ్యక్తిగత, టీమ్ విభాగంలో లింబారామ్, సంజీవ సింగ్, శ్యామ్‌లాల్ మీనా భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. 1992 బార్సిలోనా ఒలింపిక్స్‌లో, 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లోనూ భారత ఆర్చర్లు పాల్గొన్నా ఆరంభ రౌండ్లలోనే నిష్క్రమించారు. 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో భారత్ నుంచి ఎవరూ అర్హత పొందలేదు. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో పురుషుల విభాగంతోపాటు తొలిసారిగా మహిళల విభాగంలోనూ భారత్ పోటీపడింది. పురుషుల విభాగంలో సత్యదేవ్ ప్రసాద్, తరుణ్‌దీప్ రాయ్, మాఝీ సవాయన్... మహిళల విభాగంలో డోలా బెనర్జీ, రీనా కుమారి, సుమంగళ శర్మ భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. సత్యదేవ్ ప్రసాద్, రీనా కుమారి ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోగా... తరుణ్‌దీప్, మాఝీ సవాయన్, డోలా బెనర్జీ తొలి రౌండ్‌లో, సుమంగళ శర్మ రెండో రౌండ్‌లో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2008 బీజింగ్, 2012 లండన్, 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లోనూ భారత ఆర్చర్లు బరిలోకి దిగినా రిక్తహస్తాలతో వెనుదిరిగారు.

గత మూడేళ్ల కాలంలో భారత ఆర్చర్లు నిలకడగా రాణించారు. పారిస్ ఒలింపిక్స్‌లో ఐదు విభాగాల్లోనూ అర్హత సాధించారు. పురుషుల టీమ్ విభాగంలో బొమ్మదేవర ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాధవ్... మహిళల టీమ్ విభాగంలో దీపిక కుమారి, భజన్ కౌర్, అంకిత భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్ పురుషుల టీమ్, వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో... భజన్ కౌర్ మహిళల టీమ్, వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో పోటీపడతారు. 40 ఏళ్ల తరుణ్‌దీప్ రాయ్, 30 ఏళ్ల దీపిక కుమారి నాలుగోసారి ఒలింపిక్స్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ముఖ్యంగా దీపికా కుమారిపై భారత్ భారీ ఆశలు పెట్టుకుంది. ప్రపంచ చాంపియన్‌షిప్, ప్రపంచకప్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్, ఆసియా చాంపియన్‌షిప్... ఇలా అన్ని మెగా టోర్నీల్లో పతకాలు గెల్చుకున్న దీపిక ఖాతాలో కేవలం ఒలింపిక్ పతకం మాత్రమే లోటుగా ఉంది. ఈ ఏడాది దీపిక మంచి ఫామ్‌లో ఉంది. షాంఘై ప్రపంచకప్ టోర్నీలో రజత పతకం సాధించగా... ఆసియా కప్‌లో స్వర్ణ పతకం గెలిచింది. ఓవరాల్‌గా దీపిక ప్రపంచకప్ టోర్నీల్లో 37 పతకాలు... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఐదుపతకాలు సాధించి భారత అత్యుత్తమ ఆర్చర్‌గా పేరు తెచ్చుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో దీపిక తన అనుభవాన్నంతా రంగరించి పోరాడాల్సిన అవసరం ఉంది. కీలకదశలో ఒత్తిడికి తడబడి గురి తప్పడం దీపిక బలహీనతగా ఉంది. అయితే మూడు ఒలింపిక్స్‌లలో పోటీ పడ్డ దీపిక ఈ బలహీనతను పారిస్‌లో అధిగమిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. పారిస్ గేమ్స్ నుంచి దీపిక పతకంతో తిరిగొస్తే భారత్‌లో ఆర్చరీకి మరింత ఆదరణ పెరుగుతుంది.

విజయవాడకు చెందిన 22 ఏళ్ల ధీరజ్ కూడా కొన్నాళ్లుగా నిలకడగా రాణిస్తూ పారిస్ గేమ్స్‌లో తన నుంచీ పతకం ఆశించవచ్చని ఆశలు రేకెత్తిస్తున్నాడు. గత రెండేళ్లలో ధీరజ్ ప్రపంచకప్ టోర్నీల్లో మొత్తం ఎనిమిది పతకాలు నెగ్గాడు. ఆసియా క్రీడల్లో, ఆసియా చాంపియన్‌షిప్‌లో, ఆసియా గ్రాండ్‌ప్రి టోర్నీల్లో ఐదు పతకాలు సాధించాడు. తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న ధీరజ్ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పతకంతో తిరిగొస్తే భారత ఆర్చరీ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంటాడు. పారిస్ ఒలింపిక్స్‌లో ఆర్చరీ ఈవెంట్ జూలై 28 నుంచి ఆగస్టు 4 వరకు జరుగుతుంది. ఆర్చరీలో కాంపౌండ్, రికర్వ్ అని రెండు కేటగిరీలున్నా... ఒలింపిక్స్‌లో మాత్రం కేవలం రికర్వ్ విభాగంలోనే పోటీలు నిర్వహిస్తారు.

–సాక్షి క్రీడా విభాగం

మన మహిళలదే పైచేయి

- ఆసియా కప్‌లో భారత్ శుభారంభం
- 7 వికెట్లతో పాకిస్తాన్‌పై ఘన విజయం
- రాణించిన బౌలర్లు, స్మృతి, షఫాలీ
- ఆదివారం యూఏఈతో మ్యాచ్



స్మృతి మంధాన

దంబుల్లా: డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో శుభారంభం చేసింది. పాకిస్తాన్‌పై తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటూ మరో విజయాన్ని అందుకుంది. శుక్రవారం జరిగిన గ్రూప్ 'ఎ' తొలి పోరులో భారత్ 7 వికెట్ల తేడాతో పాక్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ 19.2 ఓవర్లలో 108 పరుగులకే కుప్పకూలింది. సిద్రా అమీన్ (35 బంతుల్లో 25; 3 ఫోర్లు) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ 3 వికెట్లు పడగొట్టగా... రేణుక, శ్రేయాంక పాటిల్, పూజ వస్త్రకర్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 14.1 ఓవర్లలో 3 వికెట్లకు 109 పరుగులు చేసింది. స్మృతి మంధాన (31 బంతుల్లో 45; 9 ఫోర్లు), షఫాలీ వర్మ (29 బంతుల్లో 40; 6 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 57 బంతుల్లోనే 85 పరుగులు జోడించారు.

టపటపా...

భారత మహిళల పదునైన బౌలింగ్ ముందు పాక్ ఏమాత్రం నిలవలేకపోయింది. పూజ తన తొలి రెండు ఓవర్లలో 2 వికెట్లు తీసి ప్రత్యర్థిని నిలువరించగా, పవర్‌ప్లే ముగిసేసరికి పాక్ 37 పరుగులు చేసింది. కెప్టెన్ నిదా దార్ (8) ప్రభావం చూపలేకపోగా, రేణుక వరుస బంతుల్లో రెండు వికెట్లతో పాక్‌ను దెబ్బ కొట్టింది. ఈ దశలో తుబా, ఫాతిమా పోరాడి 25 బంతుల్లో 35 పరుగులు జత చేశారు. ఇన్నింగ్స్ 18వ ఓవర్లో 3 వికెట్లు కోల్పోయిన పాకిస్తాన్...రాధ ఓవర్లో ఫాతిమా రెండు సిక్స్‌లు బాదడంతో 100 పరుగులు దాటింది. 47 పరుగుల వ్యవధిలో పాక్ చివరి 6 వికెట్లు చేజార్చుకుంది.

ఒకే ఓవర్లో 21 పరుగులు...

ఛేదనలో భారత ఓపెనర్లు షఫాలీ, స్మృతి దూకుడుగా ఆడారు. వరుసగా మూడు ఓవర్లలో రెండేసి ఫోర్లు రాగా...తుబా ఓవర్లో స్మృతి రెండు ఫోర్లు, షఫాలీ ఒక సిక్స్ బాదారు. ఫలితంగా 6 ఓవర్లలోనే స్కోరు 57 పరుగులకు చేరింది. ఆ తర్వాత తుబా వేసిన ఇన్నింగ్స్ 8వ ఓవర్లో స్మృతి చెలరేగింది. ఏకంగా ఐదు ఫోర్లు (4, 0, 4, 1 వైడ్, 4, 4, 4) బాదడంతో 21 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత 17 పరుగుల వ్యవధిలో స్మృతి, షఫాలీతో పాటు హేమలత (14) కూడా వెనుదిరిగినా...హర్మన్ (5 నాటౌట్), జెమీమా (3 నాటౌట్) కలిసి లాంఛనం పూర్తి చేశారు. గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన మరో మ్యాచ్‌లో నేపాల్ ఆరు వికెట్ల తేడాతో యూఏఈ జట్టుపై విజయం సాధించింది.



మిథాలీ చేతుల మీదుగా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్న దీప్తి శర్మ

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఫిరోజా (సి) హర్మన్ (బి) పూజ 5; మునీబా (సి) రోడ్రిగ్స్ (బి) పూజ 11; సిద్రా (సి) రాధ (బి) రేణుక 25; ఆలియా (సి) రోడ్రిగ్స్ (బి) శ్రేయాంక 6; నిదా (సి) హేమలత (బి) దీప్తి 8; తుబా (సి) రాధ (బి) దీప్తి 22; ఇరమ్ (ఎల్బీ) (బి) రేణుక 0; ఫాతిమా (నాటౌట్) 22; అరూబ్ (రనౌట్) 2; నష్రా (సి) రిచా (బి) దీప్తి 0; సాదియా (బి) శ్రేయాంక 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం** (19.2 ఓవర్లలో ఆలౌట్) 108. **వికెట్ల పతనం:** 1–9, 2–26, 3–41, 4–59, 5–61, 6–61, 7–92, 8–94, 9–94, 10–108. **బౌలింగ్:** రేణుక 4–0–14–2, పూజ 4–0–31–2, దీప్తి శర్మ 4–0–20–3, రాధ 4–0–26–0, శ్రేయాంక పాటిల్ 3.2–0–14–2. **భారత్ ఇన్నింగ్స్:** షఫాలీ (బి) అరూబ్ 40; స్మృతి (సి) ఆలియా (బి) అరూబ్ 45; హేమలత (సి) తుబా (బి) నష్రా 14; హర్మన్ (నాటౌట్) 5; జెమీమా (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం** (14.1 ఓవర్లలో 3 వికెట్లకు) 109. **వికెట్ల పతనం:** 1–85, 2–100, 3–102. **బౌలింగ్:** సాదియా 2.1–0–18–0, ఫాతిమా 2–0–15–0, నిదా 1–0–10–0, తుబా 2–0–36–0, నష్రా 4–0–20–1, అరూబ్ 3–0–9–2.

ఫైనల్లో యూకీ బాంబ్రీ జోడీ



స్టాడ్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో మూడో సీడ్ యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ ఫైనల్లోకి చేరింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో యూకీ–ఒలివెట్టి ద్వయం 6–3, 7–6 (7/4)తో ఐదో సీడ్ అరెండ్స్–రాబిన్ హాస్ (నెదర్లాండ్స్) జంటను ఓడించింది. మరోవైపు జర్మనీలో జరుగుతున్న హాంబర్గ్ ఓపెన్ ఏటీపీ–500 టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న–శ్రీరామ్ బాలాజీ (భారత్) జోడీ తొలి రౌండ్‌లో 1–6, 4–6తో జేకబ్ ష్నయిటర్–మార్క్ వాల్నర్ (జర్మనీ) జంట చేతిలో ఓటమి పాలైంది.

హోడ్జ్ సెంచరీ: విండీస్ 351/5



నాటింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో వెస్టిండీస్ దీటైన జవాబు ఇచ్చింది. రెండో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన విండీస్ ఆట ముగిసే సమయానికి 84 ఓవర్లలో 5 వికెట్లకు 351 పరుగులు చేసింది. కావెమ్ హోడ్జ్ (120; 19 ఫోర్లు) సెంచరీ సాధించాడు. అథనాజ్ (82; 10 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి హోడ్జ్ నాలుగో వికెట్‌కు 175 పరుగులు జోడించాడు. ప్రస్తుతం హోల్డర్ (23 బ్యాటింగ్), జోషువా డిసిల్వా (32 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 416కు విండీస్ మరో 65 పరుగుల దూరంలో ఉంది.

క్లుప్తంగా...

సీడీపీఓ పరీక్ష రద్దు

- పరీక్ష నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తాం: టీజీపీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలో శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి(సీడీపీఓ), గ్రేడ్–1 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(సూపర్‌వైజర్) ఉద్యోగాల భర్తీకి సంబంధించి గతేడాది జనవరి 3న నిర్వహించిన అర్హత పరీక్షను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) రద్దు చేసింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీజీపీఎస్సీలో వివిధ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ(సీఎఫ్ఎస్ఎల్), స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(ఎస్ఐటీ) ఇచ్చిన నివేదికలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషన్ తెలిపింది. ఈ పరీక్షను తిరిగి నిర్వహించే సమాచారాన్ని, పరీక్ష తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు కమిషన్ వెల్లడించింది. కాగా ఈ పరీక్షకు సంబంధించి ప్రాథమిక ఎంపిక జాబితాను విడుదల చేసి అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించడంతో పాటు ఈ ఏడాది ఫిబ్రవరి 3న తుది ఫలితాలను సైతం ప్రకటించిన విషయం తెలిసిందే.

ఆర్జీయూకేటీలో ముగిసిన రెండోదశ కౌన్సెలింగ్

బాసర: బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ)లో ప్రవేశాలకు శుక్రవారం రెండోదశ కౌన్సెలింగ్ నిర్వహించారు. క్యాంపస్‌లోని అకడమిక్ బ్లాక్‌లో విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకటరమణ ఆదేశాల మేరకు అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. కాగా, 82 మంది సాధారణ, క్యాప్ కేటగిరీలో 14 మంది, గ్లోబల్ కేటగిరీలో ఏడుగురు విద్యార్థులు హాజరయ్యారు. వనపర్తి జిల్లా తాటిపాముల గ్రామానికి చెందిన కావ్యశ్రీకి ఎంపిక ధ్రువపత్రాన్ని జాయింట్ కన్వీనర్ డాక్టర్ పావనితో కలసి అందజేశారు. రెండోదశలో మిగిలిన సీట్లను మూడవ విడతలో భర్తీ చేస్తామని తెలిపారు. దానికి సంబంధించిన జాబితాను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. గ్లోబల్ కోటా స్వరాష్ట్రం సీట్లను సైతం భర్తీ చేస్తామని తెలిపారు. దీనికి సంబంధించిన తేదీలను ఖరారు చేస్తామన్నారు. వివరాలకు www.rgukt.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో జాయింట్ కన్వీనర్లు రంజిత్‌కుమార్, డాక్టర్ దత్తు, అడ్మిషన్స్ కమిటీ సభ్యులు హరి కృష్ణ, సునీత, డాక్టర్ కుమార్ రాగుల, శ్రీకాంత్, రాకేశ్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్ -1కు 1:100 నిష్పత్తిలో పిలవాలి

- సీఎం పరిశీలించాలని అభ్యర్థుల అభ్యర్థన

లక్డీకాపూల్: మీకు ఒకసారి అవకాశం ఇచ్చాం .. మాకు కూడా ఒక సారి అవకాశం ఇవ్వండంటూ గ్రూప్–1 అభ్యర్థులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గ్రూప్ –1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను పిలవాలని, గ్రూప్ 2ను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా నిరుద్యోగులే కీలకమన వారికి దారి చూపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.

75,200 ఇంజనీరింగ్ సీట్ల భర్తీ

మొదలైన తొలి దశ సీట్ల కేటాయింపు

- కంప్యూటర్ కోర్సుల్లోనే 53 వేల సీట్లు
- సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్స్‌లో తక్కువే
- కౌన్సెలింగ్‌కు దూరంగా టాపర్స్
- వివరాలు వెల్లడించిన సాంకేతిక విద్యా శాఖ

53 వేల సీట్లు కంప్యూటర్ కోర్సుల్లోనే



భర్తీ అయిన 75,200 సీట్లల్లో 53,517 సీట్లు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఇతర కంప్యూటర్ సైన్స్ అనుబంధ గ్రూపుల్లోనే ఉన్నాయి. వివిధ విభాగాలుగా ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ బ్రాంచీలో వందశాతం సీట్లు భర్తీ అయ్యాయి. సీఎస్ఈలో 99.80 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఐటీ, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ కోర్సుల్లోనూ 97 శాతంపైగా సీట్లు కేటాయించారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌ల్లో సీట్లు తక్కువగా ఉన్నా మిగిలిపోయాయి.



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ తొలి దశ సీట్ల కేటాయింపు శుక్రవారం చేపట్టారు. సాంకేతిక విద్య విభాగం ఇందుకు సంబంధించిన వివరాలను సాయంత్రం వెల్లడించింది. మొత్తం 175 కాలేజీలు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నాయి. కన్వీనర్ కోటా కింద 78,694 సీట్లు అందుబాటులో ఉండగా, వీటిల్లో 75,200 సీట్లు భర్తీ చేశారు. 3,494 సీట్లు మిగిలిపోయాయి. మొత్తం 95.56 శాతం సీట్లు భర్తీ చేసినట్టు అధికారులు తెలిపారు. 95,735 మంది 62,60,149 ఆప్షన్లు ఇచ్చారు. 20,535 సరైన ఆప్షన్లు ఇవ్వలేదు. ఈడబ్ల్యూఎస్ కోటా కింద 6,038 మందికి సీట్లు వచ్చాయి. సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు.

ముందుకు రాని టాపర్స్

ఈఏపీ సెట్‌లో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఈసారి కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు ఆసక్తి చూపలేదు. జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు పొందడానికే ప్రాధాన్యమిచ్చారు. వందలోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులు కేవలం ఒక్కరే తొలి కౌన్సెలింగ్‌లో సీటు కోసం పోటీ పడ్డారు. 201 నుంచి 500 ర్యాంకులు వచ్చిన వాళ్ళు కూడా 10 మందే ఉన్నారు. ఆఖరుకు వెయ్యి లోపు ర్యాంకర్లు కూడా 74 మంది మాత్రమే కన్పించారు. 5 వేలు పైబడిన ర్యాంకు వచ్చిన వాళ్ళే రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల కోసం ప్రయత్నించారు.

ర్యాంకుల వారీగా సీట్ల కేటాయింపు

ర్యాంకు	ఎంతమందికి సీట్లు
0-100	1
101-200	1
201-500	10
501-1000	74
1001-5000	1,822
5001-10000	2,945
10001-20000	5,809
20001-30000	5,878
30001-40000	5,879
40001-50000	5,623
50001-100000	22,964
100001-150000	15,045
150001 ఆ పైన	9,150

ప్రధాన బ్రాంచీల్లో సీట్ల కేటాయింపు ఇలా..

బ్రాంచీ	సీట్లు	భర్తీ	శాతం
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్	46	46	100
కంప్యూటర్ ఇంజనీరింగ్	91	91	100
సైబర్ సెక్యూరిటీ (బ్లాక్ చైన్)	133	133	100
సీఎస్ఈ (నెట్‌వర్క్)	45	45	100
సీఎస్ఈ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)	42	42	100
కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్	24,927	24,876	99.80
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ	4,042	4,021	99.48
సీఎస్ఈ సైబర్ సెక్యూరిటీ	1,562	1,525	97.63
సీఎస్ఈ డేటాసైన్స్	7,305	7,258	99.36
సీఎస్ఈ (ఏఐఎంఎల్)	12,497	12,351	98.83
కంప్యూటర్ సైన్స్ ఐటీ	231	219	94.81
ఏఐఎంఎల్	695	693	99.,71
ఏఐ డేటా సైన్స్	1434	1406	98.05
సీఎస్‌సీ (ఐవోటీ)	339	339	100
కంప్యూటర్ సైన్స్, డిజైన్	92	66	71.74
కంప్యూటర్ ఇంజనీరింగ్ సాఫ్ట్‌వేర్	136	133	97.79
ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్	11,261	10,943	97.18
ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్	4,681	3,786	80.88
సివిల్ ఇంజనీరింగ్	3,510	2,832	80.68
మెకానికల్ ఇంజనీరింగ్	3,335	2,386	71.54

'సివిల్స్'కు సింగరేణి దన్ను

మెయిన్స్‌కు ప్రిపేర్ అయ్యేవారికి ఆర్థిక సాయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బొగ్గు, విద్యుత్ ఉత్పత్తి రంగంలో దూసుకెళ్తున్న సింగరేణి సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ తన వంతు పాత్ర పోషిస్తోంది. అందులో భాగంగానే రాష్ట్రం నుంచి సివిల్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే వారికి అండగా నిలవాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రిలిమినరీలో ఉత్తీర్ణత సాధించి మెయిన్స్‌కు వెళ్లేవారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించనుంది. ప్రతీ బ్యాచ్‌లో 200మంది చొప్పున ఎంపిక చేసి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ ఫండ్‌లో రూ.2 కోట్లు ఈ కార్యక్రమానికి కేటాయిస్తోంది. శనివారం సీఎం రేవంత్‌రెడ్డితో పంపిణీ చేసేందుకు సింగరేణి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

30 నుంచి పీజీఈ సెట్ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ఎంటెక్, ఎంఈ, ఎంఆర్క్, ఎం ఫార్మసీ, ఫామ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి టీజీపీజీఈ సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియను ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహిస్తారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి నేతృత్వంలో శుక్రవారం జరిగిన సమావేశంలో కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. సమావేశంలో మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్‌కే మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, పీజీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి.రమేశ్‌బాబు పాల్గొన్నారు.

షెడ్యూల్ ఇలా..

తేదీ	వివరాలు
ఫేజ్–1	
30.7.24 – 9.8.24	ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన
1,8.24 – 3.8.24	ఎన్‌సీసీ, పీహెచ్, స్పోర్ట్స్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
12.8.24 – 13.8.24	వెబ్ ఆప్షన్లు
17.8.24	సీట్ల కేటాయింపు
18.8.24 – 21.8.24	కాలేజీల్లో రిపోర్టింగ్
ఫేజ్–2	
20.8.24 – 23.8.24	ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్
25.8.24 – 26.8.24	వెబ్ ఆప్షన్లు
30.8.24	సీట్ల కేటాయింపు
31.8.24 – 3.9.24	కాలేజీల్లో రిపోర్టింగ్

రెండోరోజు డీఎస్సీకి 94.69 శాతం హాజరు

సాక్షి, హైదరాబాద్: రెండోరోజు డీఎస్సీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 27,061 మంది శుక్రవారం హాజరవ్వాల్సి ఉంది. కానీ 25,625 మంది పరీక్ష రాశారు. మొత్తం 94.69% అభ్యర్థులు హాజరైనట్టు విద్యాశాఖ పేర్కొంది.



హేరామ్.. 'గాంధీ' ఖాళీ

తెలంగాణ వైద్య ప్రదాయినికి బదిలీల విఘాతం

- ఒకేసారి 40 మంది ప్రొఫెసర్లకు స్థానచలనం
- కీలక విభాగాల్లో మూకుమ్మడి బదిలీలు
- కొత్త వాళ్లు కుదురుకుని అలవాటుపడేందుకు కొంత సమయం
- ఈలోగా వైద్యసేవలకు అంతరాయం.. జాప్యం కానున్న సర్జరీలు

గాంధీ ఆస్పత్రి: తెలంగాణ వైద్యప్రదాయిని, కోవిడ్ సంక్షోభ వేళ వేలాది మంది ప్రాణాలు కాపాడిన కోవిడ్ నోడల్ సెంటర్ సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి బదిలీల విఘాతం తగిలింది. సుమారు 2 వేల మంది ఇన్‌పేషెంట్లు, మరో మూడు వేల మంది అవుట్‌పేషెంట్లకు వైద్యసేవలు అందిస్తున్న గాంధీ ఆస్పత్రిలో పెద్దసంఖ్యలో ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఒకేసారి బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. లాంగ్‌స్టాండింగ్ పేరిట బోధనాసుపత్రి నిర్వహణలో ఉన్న కీలకమైన ప్రొఫెసర్లను మూకుమ్మడిగా బదిలీ చేయడంతో గాంధీ ఆస్పత్రి నిర్వహణపై పెనుప్రభావం పడనుంది. ఆస్పత్రి సూపరింటెండెంట్‌తోపాటు ఆయా విభాగాలకు చెందిన సుమారు 40 మంది ప్రొఫెసర్లను ఒకేసారి బదిలీ చేయడంతో మేజర్ సర్జరీల్లో జాప్యం నెలకొనే అవకాశం ఉంది. పోస్ట్‌గ్రాడ్యుయేట్ వైద్యులకు గైడ్‌లుగా వ్యవహరించే ప్రొఫెసర్లకూ బదిలీ కావడంతో పీజీల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. సీనియర్, జూనియర్ నిష్పత్తిలో కాకుండా నిష్ణాతులైన వైద్యులందరినీ ఇష్టారాజ్యంగా శుక్రవారం బదిలీ చేయడంపై వైద్యవర్గాల్లో విస్మయం వ్యక్తం అవుతోంది.

జనరల్ సర్జరీ విభాగంలో ఆరుగురు ప్రొఫెసర్లకు....

కీలకమైన గాంధీ జనరల్ సర్జరీ విభాగంలో ఆరుగురు ప్రొఫెసర్లను ఒకేమారు బదిలీ చేయడంతో సర్జరీలపై ప్రభావం పడే అవకాశం ఉంది. నూతనంగా బదిలీపై వచ్చే ప్రొఫెసర్లకు ఇక్కడి పరిస్థితులు ఆకళింపు చేసుకునేందుకు కొంత సమయం పడుతుంది. అప్పటివరకు అరకొరగా ఉన్న అసోసియేట్, అసిస్టెంట్ వైద్యులతో నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. జనరల్ మెడిసిన్ విభాగంలో ఆరుగురు ప్రొఫెసర్లకుగాను ఐదుగురు బదిలీ అయ్యారు. అత్యంత కీలకమైన అనస్తీషియా విభాగంలో ముగ్గురు ప్రొఫెసర్లు, ఆరుగురు అసోసియేట్లు బదిలీ కావడంతో ఆపరేషన్లలో జాప్యం నెలకొనే పరిస్థితి ఏర్పడింది. ఆర్థోపెడిక్ విభాగంలో ముగ్గురు ప్రొఫెసర్లు బదిలీకాగా ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. గైనకాలజీ విభాగంలో నలుగురు ప్రొఫెసర్లు బదిలీ అయ్యారు.

విభాగం	ప్రొఫెసర్ పోస్టులు	బదిలీ అయిన ప్రొఫెసర్లు
జనరల్ సర్జరీ	6	6
జనరల్ మెడిసిన్	6	5
గైనకాలజీ	5	4
ఆర్థోపెడిక్	3	2
అనస్తీషియా	4	3
అనస్తీషియా (అసోసియేట్)	8	6
రేడియాలజీ	2	2
డెంటల్	2	1

సీటీ సర్జరీ, యూరాలజీ, కార్డియాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, మైక్రోబయాలజీ, ఈఎన్‌టీ, ఫిజియోథెరపీ తదితర విభాగాల్లో ఒక్కో ప్రొఫెసర్ బదిలీ జరిగింది.

ఒక్కో ప్రొఫెసర్ ఉన్న విభాగంలో కూడా

యూరాలజీ, సీటీ సర్జరీ, కార్డియాలజీ తదితర విభాగాల్లో ఉన్న ఒకే ఒక్క ప్రొఫెసర్‌ను కూడా బదిలీ చేయడంతో ఆయా విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగుల పరిస్థితిపై ప్రభావం పడనుంది.

గ్రూప్-2 పరీక్షలు వాయిదా

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకున్నారు. ఈ క్రమంలో టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డితోనూ ప్రభుత్వం మాట్లాడింది. చర్చల సందర్భంగా నిరుద్యోగుల డిమాండ్లను సానుకూలంగా ఆలకించిన తర్వాత డిప్యూటీ సీఎం స్పందించారు.

3 నెలల్లో 54 వేల ఉద్యోగాలకు మోక్షం: భట్టి

గ్రూప్–2 అభ్యర్థులతో మాట్లాడి సమస్య పరిష్కరించాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డి సూచించారని భట్టి చెప్పారు. డిసెంబర్‌లో పరీక్షల నిర్వహణపై అధికారులతో చర్చిస్తామని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 3 నెలల వ్యవధిలోనే 54 వేల ఉద్యోగాలకు మోక్షం కల్పించిందని అన్నారు. మరిన్ని ఉద్యోగ ఖాళీలను గుర్తించి జాబ్ కేలండర్‌ను ప్రకటించే పనుల్లో ప్రభుత్వం నిమగ్నమైందని వెల్లడించారు. ఓవర్ లాపింగ్ లేకుండా పోటీ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఉద్యోగాలు భర్తీ చేసి ఉంటే లక్షలాది కుటుంబాలు ఇప్పటికే స్థిరపడేవన్నారు. ఎన్నికలకు ముందు సీఎల్పీ నేతగా తాను, పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి నిరుద్యోగులు లేవనెత్తిన అంశాలనే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఎజెండాగా చేసుకున్నామని గుర్తు చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఆలస్యం చేస్తే ప్రభుత్వానికి జీతాల భారం తగ్గుతుంది కానీ, ప్రజా ప్రభుత్వం ఆ విధంగా ఆలోచించదని స్పష్టం చేశారు. తెలంగాణ బిడ్డలు స్థిరపడాలని, వారి కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలని మనసారా కోరుకుంటున్నట్లు చెప్పారు. కొందరు వారి స్వలాభం కోసం నిరుద్యోగులను బలి చేస్తున్నారని ఆరోపించారు.

ప్రతి నియోజకవర్గ కేంద్రంలో నాలెడ్జ్ సెంటర్

విద్యావ్యవస్థను సమూలంగా మార్చాలని ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోందని భట్టి చెప్పారు. కొద్ది రోజుల్లోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం అధునాతన టెక్నాలజీతో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీ పరీక్షలకు ఉచితంగా ఆన్‌లైన్ పద్ధతిలో శిక్షణ ఇస్తామని, దేశంలోనే ఉన్నతమైన సబ్జెక్టు నిపుణులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్ కేంద్రంగా ఆన్‌లైన్‌లో పాఠాలు బోధిస్తారని చెప్పారు.

ఇది ప్రజా, విద్యార్థుల ప్రభుత్వం: ఎంపీలు

గ్రూప్–2 పరీక్షల పోస్టులను పెంచుతూ మరోసారి నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్ తెలిపారు. ఇది ప్రజా, విద్యార్థుల ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. డిప్యూటీ సీఎంతో సమావేశం తర్వాత మీడియా పాయింట్ వద్ద వారు విలేకరులతో మాట్లాడారు.

పరీక్షలకు సమయం ఇవ్వాలి

పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేదని గ్రూప్–2 అభ్యర్థులు విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి తమ విజ్ఞప్తిని మన్నించారంటూ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గ్రూప్ పోస్టులను వీలైనంత వరకూ పెంచాలని, పరీక్షలకు సమయాన్ని ఇవ్వాలని విద్యార్థులు సుఖేష్ (సిద్దిపేట జిల్లా), నవీన్ (హుస్నాబాద్), మహేష్ (ఖమ్మం) కోరారు. డీఎస్సీ పరీక్షలు రాసేవారు కూడా చాలామంది గ్రూప్ పరీక్షలు రాస్తున్నారని, అందువల్ల కనీసం మూడు నెలలైనా పరీక్షలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రూప్ పరీక్షల కోసం రూ.5 భోజనం చేస్తూ సిద్ధమవుతున్నామని, ప్రభుత్వం నిరుద్యోగులపై కరుణ చూపించాలని కోరారు.

డిసెంబర్‌లో గ్రూప్-2: టీజీపీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–2 పరీక్షలు రీషెడ్యూల్ అయ్యాయి. ఆగస్టు 7, 8 తేదీల్లో నిర్వహించాల్సిన ఈ పరీక్షలను ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి ఇ.నవీన్ నికొలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ తొలుత నిర్ణయించిన తేదీల్లో వివిధ పోటీ పరీక్షలు సైతం ఉండడంతో అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా గ్రూప్–2 పరీక్షలను రీషెడ్యూల్ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పరీక్షల తేదీలను త్వరలో ప్రకటిస్తామ న్నారు.

రెండోసారి వాయిదా

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 783 గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి 2022 డిసెంబర్‌లో టీజీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. 5.5 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది ఆగస్టు 29, 30 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తామని టీజీపీఎస్సీ ప్రకటించగా.. అభ్యర్థుల ఒత్తిడితో గత ప్రభుత్వం పరీక్షలను వాయిదా వేయాలని నిర్ణయించింది. తర్వాత రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం, కమిషన్ కూడా కొత్త వారితో ఏర్పాటు కావడంతో తాజాగా ఈ ఏడాది మార్చి నెలలో గ్రూప్–2 పరీక్షల తేదీలను ప్రకటించారు. అయితే మళ్లీ పరీక్షలను వాయిదా వేయాలంటూ అభ్యర్థులు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో ప్రభుత్వం మరోసారి పరీక్షల వాయిదాకు నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే టీజీపీఎస్సీ రీషెడ్యూల్ ప్రకటన జారీ చేసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.